

మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

GSTIN 37AMRPM5719R1ZX

ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ , ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 203 | బుధవారం 29- 07 -2026 | పేజీలు : 12 | వెల-3 | No: KNL/3-77(D)/2026-2028


## కెమెరా యాంగిల్ కాదు, హృదయం యాంగిల్ మార్చండి: ప్రధాని మోదీకి ప్రియాంక గాంధీ చురక



## జనసంద్రమైన సింహాచలం..

ప్రారంభమైన సింహాచలం గిరి ప్రదక్షిణ మహోత్సవం

అప్పన్న నామస్మరణతో కిటకిటలాడుతున్న 32 కి.మీ. మార్గం

10 లక్షల మందికి పైగా పాల్గొంటారని అధికారుల అంచనా

భక్తుల కోసం భారీ ఏర్పాట్లు.. డ్రోన్లతో పోలీసుల పర్యవేక్షణ

స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో అన్నదానం, మంచినీటి పంపిణీ



## కుప్పంలో కొనసాగుతున్న నారా భువనేశ్వరి పర్యటన..

కుప్పంలో రెండో రోజు పర్యటించిన నారా భువనేశ్వరి

క్యాన్సర్ స్క్రీనింగ్ యూనిట్ తో పాటు రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన వైనం

కుప్పానికి 30 పరిశ్రమలు తెచ్చి వేలాది ఉద్యోగాలు కల్పిస్తామన్న భువనేశ్వరి

రాష్ట్ర అభివృద్ధికి సీఎం చంద్రబాబు అహర్నిశలు కృషి చేస్తున్నారని వెల్లడి

డీఎస్సీపై వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని వ్యాఖ్య




# అమరావతిలో జెనోమిక్ సొల్యూషన్ సెంటర్



### ఏపీ ప్రభుత్వంతో ఎంఓయూ కుదుర్చకున్న ఆస్ట్రాజెనెకా ఇండియా

### దేశంలోనే మొదటి ప్రెసిషన్ అంకాలజీ పరిశోధనకు ఒప్పందం

### సీఎం చంద్రబాబు సమక్షంలో ఎంఓయూ కుదుర్చుకున్న ఫార్మా సంస్థ

కాన్సర్ రంగంలో జన్యుపరమైన పరిశోధనల ద్వారా వైద్య చికిత్సలను అందించేందుకు వీలుగా కీలకమైన ముందడుగు పడింది. అమరావతిలో ఇంటిగ్రేటెడ్ ప్రెసిషన్ అంకాలజీ విధానాన్ని ప్రారంభించేందుకు వీలుగా అంతర్జాతీయ ఫార్మాసుటికల్, బయో టెక్నాలజీ దిగ్గజ సంస్థ ఆస్ట్రాజెనెకా ఇండియా ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. అమరావతిలో ఇంటిగ్రేటెడ్ జెనోమిక్స్ సొల్యూషన్ సెంటర్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఎంఓయూ కుదుర్చుకుంది. సీఎం చంద్రబాబు నాయుడు సమక్షంలో వైద్యారోగ్యశాఖ- ఆస్ట్రాజెనెకా ఇండియా సంస్థల ప్రతినిధులు ఒప్పందాలపై సంతకాలు చేశారు. రిలయన్స్‌కు చెందిన స్ట్రాండ్ లైఫ్ సైన్సెస్, క్యూఆర్ఏఐ సంస్థలతో కలిసి ఆస్ట్రా జెనెకా ఇండియా ఇంటిగ్రేటెడ్ జెనోమిక్ సొల్యూషన్స్ సెంటర్ ఏర్పాటు చేయనుంది. అమరావతిలో దేశంలోనే మొట్టమొదటి ఇంటిగ్రేటెడ్ ప్రెసిషన్ అంకాలజీ చికిత్సా విధానాన్ని ప్రారంభించేందుకు ఈ ఎంఓయూ కుదుర్చుకున్నారు. ఊపిరితిత్తులు, రొమ్ము కాన్సర్ రోగుల కోసం అధునాతన జన్యు పరీక్షలు, బయోమార్కర్ టెస్టింగ్ చేసేందుకు వీలుగా ఇంటిగ్రేటెడ్ జెనోమిక్ సొల్యూషన్ సెంటర్‌ను

## జంతర్ మంతర్ వద్ద మరో ధర్నా..



### గాయపడిన పోలీసులకు మద్దతుగా

### రిటైర్డ్ పోలీస్ అధికారుల నిరసన

### జూలై 31న జంతర్ మంతర్ వద్ద ధర్నాకు అనుమతి కోరిన ఫెడరేషన్

### సీజేపీ ఆందోళనల్లో 100 మందికి పైగా సిబ్బందికి గాయాలైనట్లు వెల్లడి

ఇటీవల కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) విద్యార్థి విభాగాల ఆందోళనలతో దద్దరిల్లిన ఢిల్లీలోని జంతర్ మంతర్, ఇప్పుడు మరో అసాధారణ నిరసనకు వేదికగా మారనుంది. విధి నిర్వహణలో గాయపడిన పోలీసులకు సంఘీభావం ప్రకటిస్తూ రిటైర్డ్ పోలీస్ అధికారులు ధర్నా చేపట్టాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో, జూలై 31న ఒకరోజు పాటు శాంతియుత నిరసన చేపట్టేందుకు అనుమతి కోరుతూ ఢిల్లీ పోలీస్ ఫెడరేషన్, పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్‌కు లేఖ రాసింది. జూలై 20న సీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'చలో పార్లమెంట్' ర్యాలీ సందర్భంగా జంతర్ మంతర్ వద్ద

# ఏపీపై ఎల్‌నినో పంజా..



### ఏపీపై ఎల్‌నినో తీవ్ర ప్రభావం.. జూలైలో 69 శాతం లోటు వర్షపాతం

### రానున్న నెలల్లో 40 శాతం వరకు వర్షాభావ పరిస్థితులు

### పత్తి, వరి పంటలపై ప్రభావం.. 122 మండలాలను గుర్తించిన ప్రభుత్వం

### పంటల రక్షణకు అత్యవసర ప్రణాళిక.. ప్రత్యామ్నాయాలపై దృష్టి

### పశుగ్రాసానికి కొరత లేదు.. 5 నెలలకు సరిపడా నిల్వలు సిద్ధం

## నిరసన కాదు కృతజ్ఞత ర్యాలీ



### వైసీపీకి నారా లోకేశ్ ఘాటు కౌంటర్

### లోకేశ్ పర్యటనలో అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన తెలిపారంటూ వైసీపీ విమర్శలు

### కృతజ్ఞతా ప్రదర్శనను వైసీపీ నేతలు నిరసనగా చిత్రీకరిస్తున్నారన్న లోకేశ్

### ఫేక్ న్యూస్ అంటూ లోకేశ్ ట్వీట్

తన పెనమలూరు పర్యటనలో అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన తెలిపారంటూ వైసీపీ చేస్తున్న ఆరోపణలపై ఏపీ మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా స్పందించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు

## బ్లాక్‌మెయిల్ కోసమే హైడ్రా



### హైడ్రా కమిషనర్ గా ఏవీ రంగనాథ్ ను తొలగించాలన్న హైకోర్టు

### హైకోర్టు ఆదేశాలు రేవంత్ ప్రభుత్వానికి చెంపపెట్టు అన్న కేటీఆర్

### హైడ్రా పేరుతో ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారని ఆరోపణ

### కాంగ్రెస్ నేతల నివాసాలను ఎందుకు కూల్చడం లేదని ప్రశ్న

హైడ్రా కమిషనర్‌ను తక్షణమే ఆ పదవి నుంచి తొలగించాలని తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు రాష్ట్రం రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపాయి. ఈ పరిణామంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘాటుగా స్పందించారు. హైడ్రాను కాంగ్రెస్ ప్రభుత్వం ఒక బ్లాక్‌మెయిల్ సాధనంగా వాడుకుంటోందని,

# భవిష్యత్‌లో పేపర్ లీకులకు అడ్డుకట్ట



### యాంటీ పేపర్ లీక్ బిల్లుపై మంత్రి జితేంద్ర సింగ్

### లీకులకు పాల్పడితే పదేళ్ల జైలు..పది కోట్ల జరిమానా

### గతంలో లీకులు జరిగినా చర్యలు తీసుకోని ప్రభుత్వాలు

### లోక్‌సభలో బిల్లుపై చర్చలో కేంద్రమంత్రి జితేంద్ర సింగ్

భవిష్యత్‌లో పేపర్ లీక్‌లు అరికట్టేందుకే యాంటీ పేపర్ లీక్ బిల్లును తీసుకువస్తున్నట్లు కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ స్పష్టం చేశారు. మంగళవారం యాంటీ పేపర్ లీక్ బిల్లుపై లోక్‌సభలో చర్చలో మాట్లాడుతూ.. దేశ చరిత్రలోనే ఈ చట్టం ఒక మైలురాయిగా నిలుస్తుందని జితేంద్ర సింగ్ అభివర్ణించారు. విద్యార్థుల భవిష్యత్ కోసం మోదీ కృషి చేస్తున్నారని వివరించారు. దేశవ్యాప్తంగా పేపర్ లీక్‌లు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలోనూ ఆర్ఆర్‌బీ పేపర్ లీక్ అయ్యిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలనలో ఎన్నోసార్లు పరీక్షా పత్రాలు లీకయ్యాయని మండిపడ్డారు. అయితే పరీక్షల నిర్వహణలో సంస్కరణలను కాంగ్రెస్ వ్యతిరేకించిందని తెలిపారు. 2010లో ఎన్‌టిఎ ఏర్పాటు విజ్ఞప్తిని కాంగ్రెస్ పట్టించుకోలేదని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. నీట్ పరీక్షా పత్రం లీక్, విద్యా వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాలంటూ కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఆందోళనలు తీవ్ర రూపం దాల్చడంతో కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్.. తన పదవికి రాజీనామా చేశారు. పేపర్ల లీకులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు కేంద్రం చర్యలు చేపట్టింది. అందుకోసం 2024 నాటి ప్రవేశ పరీక్షల చట్ట సవరణ బిల్లును సోమవారం లోక్‌సభలో కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో విద్యార్థులు, యువత పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి పేపర్ లీక్ నిరోధక బిల్లు నిదర్శనమని జితేంద్రసింగ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనూ

## అట్టుడుకుతున్న పాక్ ఆక్రమిత కశ్మీర్..

### 20 మంది మృతి



### పీఓకేలో లాంగ్ మార్చ్ సందర్భంగా హింస

### కనీసం 20 మంది మృతి, పలువురికి గాయాలు

### చర్చలు విఫలమవడంతో జేఏఏసీ ఆందోళన

### నిరసనకారులపై కాల్పుల ఆరోపణలు

పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. 'జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ)' చేపట్టిన లాంగ్ మార్చ్ సందర్భంగా జరిగిన హింసలో కనీసం 20 మంది మృతి చెందారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని సమాచారం.జేఏఏసీ మంగళవారం ఎక్స్‌లో చేసిన పోస్టు ప్రకారం..

నంది పత్రిక

బుధవారం 29 - 07 -2026

# ఏపీపై ఎల్‌నినో పంజా..

ఆంధ్రప్రదేశ్‌పై ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా చూపుతోంది. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, ప్రభుత్వ పరంగా తీసుకోవాల్సిన చర్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, నీటిపారుదల శాఖల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సమీక్షకు మంత్రి అచ్చెన్నాయుడు జూమ్ ద్వారా హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు పరిస్థితి తీవ్రతను ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్రంలో జూలై నెలలో ఏకంగా 69 శాతం లోటు వర్షపాతం నమోదైందని తెలిపారు. రాబోయే మూడు నెలల్లో సగటున 35 నుంచి 40 శాతం వరకు వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేశారు. జూన్ నుంచి నవంబర్ మధ్య కాలంలో సాధారణంగా 844 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, ఈసారి కేవలం 551 మి.మీ మాత్రమే కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. అంచనాలకు మించి ఎల్‌నినో ప్రభావం ఉండబోతోందని అధికారులు స్పష్టం చేశారు. ఈ ప్రభావం అన్ని జిల్లాల్లో ఉన్నప్పటికీ ముఖ్యంగా పశ్చిమ గోదావరి, ప్రకాశం, అన్నమయ్య, కృష్ణా, కడప జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులు ఎక్కువగా ఉంటాయని అధికారులు తెలిపారు. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.78 లక్షల హెక్టార్లలో పత్తి, 1.07 లక్షల హెక్టార్లలో వరి పంటలపై తీవ్ర ప్రభావం పడుతుందని అంచనా వేశారు. ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లాలో వరి పంటకు ఎక్కువ నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని చెప్పడంతో, వంశధార జలాలను తరలించి పంటలను కాపాడేందుకు ప్రయత్నించాలని సీఎం చంద్రబాబు సూచించారు. ప్రభుత్వం ఇప్పటికే రాష్ట్రంలో 122 హై రిస్క్ మండలాలను గుర్తించిందని అధికారులు తెలిపారు. ఈ మండలాల్లో బోరు బావుల ఆధారంగా పంటలను కాపాడుకునే అవకాశాలను పరిశీలించాలని సీఎం ఆదేశించారు. రైతులకు అవగాహన కల్పించేందుకు ఆగస్ట్ 3 నుంచి ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు, వరికి ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించేలా అత్యవసర విత్తన ప్రణాళికను సిద్ధం చేసినట్లు అధికారులు వివరించారు. ఫసల్ బీమా యోజన, వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం కింద నమోదుకు ఈ నెల 31 వరకు గడువు ఉందని, వరి పంటకు మాత్రం ఆగస్ట్ 15 వరకు సమయం ఉందని అధికారులు గుర్తుచేశారు. మరోవైపు, పశుగ్రాసానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఐదు నెలలకు సరిపడా 286.30 లక్షల మెట్రిక్ టన్నుల గ్రాసాన్ని అందుబాటులో ఉంచామని పశుసంవర్ధక శాఖ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

# జంతర్ మంతర్ వద్ద మరో ధర్నా..

తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. ఈ ఘర్షణల్లో సుమారు 100 మందికి పైగా పోలీసులు, పారామిలిటరీ సిబ్బంది గాయపడ్డారని ఫెడరేషన్ తమ దరఖాస్తులో పేర్కొంది. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల త్యాగాలను చాటిచెప్పేందుకే ఈ ధర్నా తలపెట్టినట్లు స్పష్టం చేసింది. జూలై 27న పోలీస్ ప్రధాన కార్యాలయంలో అందిన ఈ దరఖాస్తులో, జూలై 31న ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిరసన చేపట్టాలని ప్రతిపాదించారు.కాగా, సీజేపీ నిరసనల సమయంలో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనల దృష్ట్యా పోలీసులు లాఠీఛార్జ్, టియర్ గ్యాస్‌ను ప్రయోగించాల్సి వచ్చింది. కొందరు సంఘ విద్రోహ శక్తులు ఉద్దేశపూర్వకంగానే తమపై దాడులకు తెగబడ్డారని పోలీసులు ఆరోపిస్తుండగా, భద్రతా బలగాలు హద్దులు మీరి ప్రవర్తించాయని ఆందోళనకారులు ప్రత్యారోపణలు చేశారు. ఈ వ్యవహారంపై దాఖలైన పిటిషన్లను విచారించిన సుప్రీంకోర్టు, ఆందోళనల నియంత్రణ సమయంలో పోలీసులు నూతన ప్రొటోకాల్‌ను అనుసరించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. ఈ ఘటనపై సమగ్ర స్వతంత్ర దర్యాప్తు జరిపి, బాధ్యులెవరైనా సరే వారిపై జవాబుదారీతనాన్ని నిర్ధారించాలని సీజేఐ జస్టిస్ సూర్య కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశించింది. అయితే, రిటైర్డ్ పోలీసుల ధర్నాకు సంబంధించి అనుమతి ప్రక్రియ ఇంకా పెండింగ్‌లో ఉంది.

# అట్టుడుకుతున్న పాక్ ఆక్రమిత కశ్మీర్..


లాంగ్ మార్చ్ బృందాలు రావల్‌కోట్‌కు చేరుకున్నాయి. ఇప్పటివరకు 19 మంది మృతుల గుర్తింపును నిర్ధారించామని తెలిపింది. తలకు బుల్లెట్ గాయం అయిన మరో వ్యక్తి వద్ద గుర్తింపు పత్రాలు లేకపోవడంతో మొత్తం మృతుల సంఖ్య 20కి చేరిందని పేర్కొంది. పరిస్థితులు సాధారణమైన తర్వాత మరిన్ని వివరాలు వెల్లడిస్తామని తెలిపింది.జేఏఏసీ, పాకిస్థాన్ అధికారుల మధ్య చర్చలు విఫలం కావడంతో ఈ లాంగ్ మార్చ్ చేపట్టారు. ఆదివారం మీర్‌పూర్ డివిజన్ నుంచి ప్రారంభమైన నిరసన ర్యాలీ సోమవారం ముజఫరాబాద్ వైపు సాగింది. మరోవైపు పాక్ భద్రతా బలగాలు శాంతియుత నిరసనకారులపై సోమవారం సాయంత్రం కాల్పులు, టియర్ గ్యాస్, భారీ బలప్రయోగానికి పాల్పడ్డాయని 'యునైటెడ్ కశ్మీర్ పీపుల్స్ నేషనల్ పార్టీ' (యూకేపీఎన్‌పీ) ఆరోపించింది. దీంతో పలువురు మృతి చెందగా, మరికొందరు గాయపడ్డారని పేర్కొంది. ఈ ఘటనపై ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థలు వెంటనే జోక్యం చేసుకోవాలని యూకేపీఎన్‌పీ కోరింది. శాంతియుత నిరసనకారులపై కాల్పులు, అధిక బలప్రయోగాన్ని నిలిపివేయాలని పాకిస్థాన్‌పై ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేసింది. మరోవైపు పీఓకేలో జరుగుతున్న నిరసనలపై భారత విదేశాంగ శాఖ గత నెల స్పందించింది. అక్కడ పోలీసుల దౌర్జన్యాల్లో పలువురు మరణించారని, అనేక మంది గాయపడ్డారని పేర్కొంటూ పాకిస్థాన్‌ను అంతర్జాతీయ సమాజం జవాబుదారీగా నిలపాలని ఆశిస్తున్నట్లు విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు.

# బ్లాక్‌మెయిల్ కోసమే హైడ్రా:

హైకోర్టు తీర్పు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చెంపపెట్టు వంటిదని ఆయన విమర్శించారు.

మంగళవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన కేటీఆర్, బిల్డర్లను, సామాన్య పౌరులను లక్ష్యంగా చేసుకుని డబ్బులు వసూలు చేయడానికే హైడ్రాను ప్రయోగిస్తున్నారని ఆరోపించారు. అధికార పక్షానికి చెందిన వారి ఆస్తుల జోలికి వెళ్లడం లేదని, ఇదే నిజమైతే ముఖ్యమంత్రి సోదరుడి అక్రమ కట్టడాలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. భవిష్యత్తులో బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే హైడ్రాను రద్దు చేస్తామని ఆయన ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.దేశంలో ఏ అధికారి అయినా 63 సార్లు కోర్టు ధిక్కరణకు పాల్పడిన దాఖలాలు ఉన్నాయా అని కేటీఆర్ ప్రశ్నించారు. హైడ్రా రేవంత్ రెడ్డికి వేటకుక్కలా మారిందని, దీనిని అడ్డుపెట్టుకుని బిల్డర్ల వద్ద 'ఆర్ఆర్ ట్యాక్స్' వసూలు చేస్తున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి సోదరుడి నివాసంతో పాటు కాంగ్రెస్ నేతలు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్, మహేందర్ రెడ్డి, కేవీపీల అక్రమ కట్టడాలను ఎందుకు కూల్చివేయడం లేదని ప్రశ్నించారు. తెలంగాణలో బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే హైడ్రాను బంగాళాఖాతంలో కలిపేస్తామని స్పష్టం చేశారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై కూడా కేటీఆర్ స్పందించారు. ఈ ఉదంతంతో దేశ యువత మొదటిసారిగా మోదీ ప్రభుత్వంపై తిరుగుబాటు బావుటా ఎగురవేసిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తన అసమర్థతతో సరైన మద్దతు ఇవ్వలేకపోవడంతో, విద్యార్థులే నేరుగా పోరాటం చేస్తున్నారని పేర్కొన్నారు. అవసరం వచ్చినప్పుడు యువత తప్పకుండా స్పందిస్తుందని కేసీఆర్ గతంలోనే చెప్పారని అన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ హయాంలో నీట్ పేపర్ మూడుసార్లు లీక్ అయిందంటూ కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు.

## ఏపీ మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన బీబీసీ బృందం



తెలుగు రాష్ట్రాల్లో బ్యాడ్మింటన్ ఆడే మహిళల సంఖ్య గణనీయంగా పెరిగినట్లు ఓ సర్వేలో వెల్లడైంది. బీబీసీ న్యూస్ తెలుగు అసిస్టెంట్ ఎడిటర్ అనిల్ కుమార్, కలెక్టివ్ న్యూస్‌రూమ్ బృందం ఏపీ మంత్రి నారా లోకేశ్‌తో తాజాగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు భారత్‌లో మహిళల క్రీడలపై నిర్వహించిన సర్వే వివరాలను లోకేశ్‌కు అందించారు.ఈ సర్వేలోని పలు అంశాలు ఆసక్తిని రేకెత్తించాయి. ముఖ్యంగా, తెలుగు రాష్ట్రాల్లో 2020 నుంచి ఇప్పటివరకు బ్యాడ్మింటన్ ఆడే మహిళల సంఖ్య మూడింతలు పెరిగిందని సర్వేలో తేలింది. 2020లో కేవలం 3 శాతంగా ఉన్న ఈ సంఖ్య, ఇప్పుడు 9 శాతానికి చేరినట్లు బీబీసీ బృందం వివరించింది. ఈ సర్వే ఫలితాలపై మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. ఏపీలో క్రీడాకారులకు, ముఖ్యంగా యువతులకు మరిన్ని అవకాశాలు, మెరుగైన మౌలిక వసతులు, బలమైన మద్దతు వ్యవస్థలను సృష్టించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. క్రీడల్లో రాణించాలనే కల ఉన్న ప్రతి అమ్మాయికి అవకాశం కల్పించడమే తమ లక్ష్యమని లోకేశ్ తెలిపారు.

# ఉద్యమ కెరటాలు నిలిచేనా?

మాతృదేశంలో జన చైతన్య ఉరుములు మెరుపులకు సంబంధిత ప్రవాసులు స్పందించడం సహజం. ప్రవాస భారతీయ యువత అలనాటి స్వాతంత్ర్యోద్యమం నుంచి నేటి జంతర్ మంతర్ పోరాటం దాకా ప్రతి ప్రజాప్రతిఘటనకు ప్రభావశీలంగా ప్రతిస్పందిస్తూనే ఉన్నది. మాతృదేశంలో యువత చేస్తున్న ఉద్యమానికి సంఘీభావంగా విదేశాలలోని యువత నుంచి లభించిన స్పందన ఆశ్చర్యం కలిగించింది. కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో ప్రజ్వరిల్లిన విద్యార్థి ఉద్యమానికి మద్దతుగా అమెరికా, ఐరోపా, ఆస్ట్రేలియాలోని ప్రధాన నగరాలలో నిర్వహించిన ప్రదర్శనలలో ప్రవాస యువ భారతీయులు అంచనాలకు మించి పాల్గొన్నారు. పాలనా వ్యవస్థల్లో అవినీతి నిర్మూలనకై 2011లో అన్నా హజారే నిర్వహించిన ఉద్యమ సందర్భంలో కంటే ఎక్కువగా జంతర్ మంతర్ విద్యార్థుల పోరుకు ప్రవాస భారతీయ యువత స్పందించింది. అయితే గల్ఫ్ దేశాలలోని ప్రవాస భారతీయ సమాజం మాత్రం 'బొద్దింకల పోరు'పై ఆచితూచి స్పందించింది. ఈ దేశాలలో సీబీఎస్ఈ అనుబంధ భారతీయ పాఠశాలలు 170 దాకా ఉన్నాయి. ఈ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులలో, స్వదేశంలో వైద్య విద్యాభ్యాసానికి తాపత్రయ పడే వారి సంఖ్య తక్కువేమీ కాదు. 'నీట్' పరీక్షా కేంద్రాలు సైతం ఈ దేశాలలో ఉన్నాయి. 'నీట్' ప్రవేశ పరీక్ష ప్రశ్న పత్రాలు లీక్ కావడం, తరువాత ఆ పరీక్ష రద్దు కావడం, పిమ్మట ఇరాన్ యుద్ధం మూలంగా సీబీఎస్ఈ సంవత్సరాంత పరీక్షలూ రద్దయ్యాయి. ఈ పరిణామాలతో గల్ఫ్ దేశాలలోని సీబీఎస్ఈ పాఠశాలల భారతీయ విద్యార్థులు నష్టపోయారు. అమెరికా, ఐరోపా, ఇతర పాశ్చాత్య దేశాలలోని భారతీయ విద్యార్థులు ఆయా దేశాల విద్యావిధానంలో విద్యనభ్యసిస్తారు. భారతీయ విద్యా విధానాలతో వారికి సంబంధముండదు. వివిధ పాశ్చాత్య దేశాలలోని ప్రవాస భారతీయులు ఉత్సాహంగా ముందుకు వచ్చి సీజేపీ పోరాటానికి బాసటగా నిలిచారు. అయితే గల్ఫ్‌లోని ప్రభావిత విద్యార్థులు కనీసం సామాజిక మాధ్యమాలలో కూడా తమ అసంతృప్తిని వ్యక్తీకరించలేదు! వర్తమాన భారత రాజకీయాలలో ఒక వినూత్న సంచలనాన్ని సృష్టించిన అభిజిత్ దీప్కే (సీజేపీని ప్రారంభించిన జెన్‌జీ పోరాటకారుడు) భారతీయ యువత మానసిక అలజడిని సరిగ్గా అర్థం చేసుకున్నాడు. వారిలో పోరాట జ్వాల రగిలించాడు. అధికారాన్ని ప్రశ్నించే యువశక్తికి ప్రతీకగా ప్రభవించాడు. ప్రశ్న పత్రాల లీకులకు వ్యతిరేకంగా జరిగిన సీజేపీ ఉద్యమం యువతలో గూడుకట్టుకున్న అసంతృప్తి, ఆగ్రహాన్ని సంపూర్ణంగా వ్యక్తం చేసేందుకు ఒక వేదిక అయింది. స్వదేశంలో అవకాశాలు లేకనే యువత విదేశీబాట పడుతోందనే విషయాన్ని నిజాయితీగా అంగీకరించాలి.ఆక్రోశం, ఆవేదన ఎంతగా ఉన్నా వాటిని వ్యక్తీకరించేందుకు అవసరమైన ధైర్యసాహసాలు అందరికీ ఉండవు. విదేశాలలో ఉన్నా, స్వదేశంలో ఉన్నా వర్తమాన సామాజిక అంశాల పట్ల స్పందించడం అనేది వ్యక్తుల చైతన్యశీలతపై ఆధారపడి ఉంటుంది. ప్రత్యేకించి వృత్తిపరంగా మెరుగైన అవకాశాలు, వ్యక్తిగత ఆర్థిక సమున్నతికి విదేశాలకు వచ్చే భారతీయులలో మాతృభూమిలోని సామాజిక ఉద్యమాలు, పోరాటాల పట్ల సహానుభూతి చూపేవారు ఎంతోమంది ఉండరు.అభిజిత్ దీప్కే వలే బోస్టన్ విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసించిన రాజన్ కిలెచంద్ దుబాయిలోని ప్రముఖ భారతీయ పారిశ్రామికవేత్తలలో ఒకరు. ఆ విశ్వవిద్యాలయానికి 25 మిలియన్ డాలర్లు విరాళంగా ఇచ్చిన వితరణశీలి. అయితే స్వదేశంలోని సామాజిక ఉద్యమాలపై ఆయన అంతగా ఆసక్తి చూపరు. సంపన్న ప్రవాస భారతీయులలోని అత్యధికులకు రాజన్ ఒక ప్రతీక. మొత్తం మీద స్వల్ప సంఖ్యలో ఉండవచ్చుగానీ విదేశాలలోని భారతీయ యువత మాతృభూమిలో సంభవిస్తున్న సంఘటనల పట్ల చురుగ్గా ప్రతిస్పందిస్తుందని చెప్పవచ్చు. ఈజిప్టు నుంచి బంగ్లాదేశ్ దాకా ఆగ్రహంతో గళమెత్తి ప్రభుత్వాలను కూల్చివేసిన యువత, కొత్త పాలకుల విధానాలను ప్రభావితం చేయడంలో విఫలమయిందనేది ఒక చేదు సత్యం. దశాబ్దం క్రితం ఇదే ఢిల్లీలో దుమారంతో పాటు ఒక ఆశను రేకెత్తించిన విద్యార్థి నాయకుడు కన్నయ్య కుమార్ ఉద్యమం తదనంతర కర్తవ్య సాధనలో ఎంతవరకు సఫలీకృతమయిందనేది కూడా గుర్తు చేసుకోవాలి. రాజకీయ క్రీడల్లో భాగం కాకుండా భావితరాలకు మేలు జరిగేలా నిర్మాణాత్మకంగా అడుగులు ముందుకు వేయవలసిన బాధ్యత ఉద్యమిస్తున్న భారతీయ యువతపై ఉన్నది.

# బీజేపీలో ఎంత కలవరాన్ని సృష్టించిందో!

'నేటి యువతరం తప్పుదారి పట్టలేదు. దిశానిర్దేశం లేకుండా వారు వ్యవహరించడంలేదు. వారితో చర్చించాలి కానీ వారిని నియంత్రించకూడదు. నిబంధనల్ని కాదు, కారణాల్ని వారు అడుగుతారు. వివరణలు కోరతారు. జిజ్ఞాస వారి లక్షణం. తిరుగుబాటు వారి స్వభావం'.. ఈ మాటలన్నది ఏ కమ్యూనిస్టు నాయకుడో కాదు, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ అధినేత మోహన్ భాగవత్. జూలై 24న అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో జరిగిన విశ్వ మాంగల్య సభలో ఆయన ఆ మాటలు అంటున్న సమయంలో.. అక్కడికి ఒక కిలోమీటర్ దూరంలో, జంతర్ మంతర్ వద్ద దెబ్బతిన్న యువ సమూహం ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తోంది. సరిగ్గా 24 గంటల అనంతరం కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. 'ఆలస్యమైనా చివరకు మంచి పనిచేశారు..' అని 92 ఏళ్ల మురళీమనోహర్ జోషీ వ్యాఖ్యానించారు. భాగవత్ ప్రకటన చేయడానికి ఒక రోజు ముందే, విద్యార్థులపై లాఠీచార్జి దారుణమని ఆ కురు వృద్ధుడు వ్యాఖ్యానించారు. పరీక్షా వ్యవస్థపై విద్యార్థుల ఆందోళన న్యాయసమ్మతమేనని కూడా జోషీ సమర్థించారు.ఈ పరిణామాలను నిశితంగా పరిశీలిస్తే యువత నుంచి వచ్చిన ఒత్తిడి మాత్రమే కాదు, బీజేపీ, సంఘ్‌లో అంతర్గత శక్తుల నుంచి వచ్చిన ఒత్తిడి కూడా ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు కారణమైనట్లు తెలుస్తోంది. జంతర్ మంతర్ వద్ద జరిగిన కాక్రోచ్ జనతా పార్టీ నిరసన ప్రదర్శన తీవ్రత ఆలస్యంగానైనా బీజేపీలో ఎంత అంతర్గత కలవరాన్ని సృష్టించిందో కూడా అర్థమవుతోంది. తన ఆమరణ నిరాహార దీక్ష ద్వారా కాక్రోచ్ జనతా పార్టీ నిరసనకు బలం చేకూర్చిన లద్దాఖ్ విద్యావేత్త, పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ ఒకప్పుడు మోదీ సమర్థకుడు. ఆర్టికల్ 370 రద్దు చేసి, లద్దాఖ్‌ను జమ్మూకశ్మీర్ నుంచి వేరు చేసినప్పుడు ఆయన హర్షాతిరేకంతో ఉప్పొంగిపోయారు. లద్దాఖ్‌ను ఆరవ షెడ్యూల్‌లో చేరుస్తామని బీజేపీ హామీ ఇచ్చినప్పుడు ఆయన బీజేపీకి అనుకూలంగా ఎన్నికల్లో ప్రచారం చేశారు. రాహుల్‌గాంధీ భారత జోడో యాత్రలో పాల్గొనేందుకు వచ్చిన ఆహ్వానాన్ని కూడా వాంగ్‌చుక్ తిరస్కరించారు. అలాంటి వ్యక్తిని బీజేపీ వ్యతిరేకంగా మార్చుకుంది. ఆయనే కాదు, జంతర్ మంతర్‌కు వచ్చిన యువతీ యువకుల్లో ఒకప్పుడు మోదీని, బీజేపీని అభిమానించి తర్వాత వ్యతిరేకంగా మారిన వారెందరో ఉన్నారు. 'నేను కూడా నా తల్లిదండ్రులతో కలిసి మోదీకి ఓటు వేశాను. ఢిల్లీలో జంతర్ మంతర్ ప్రదర్శనకు వస్తుంటే వారు ఏ మాత్రం అభ్యంతరం చెప్పలేదు' అని ఒక యువతి చెప్పింది. అనేకమంది కేంద్ర మంత్రులు, ఎంపీల ఇళ్లలో కూడా వారి పిల్లలు సీజేపీ ప్రదర్శనకు సంఘీభావం ప్రకటించారని బీజేపీ నేతలే అంటున్నారు. జంతర్ మంతర్ ప్రదర్శనలో పంజాబ్, ముంబై, హరియాణా, తెలంగాణతో పాటు అనేక రాష్ట్రాల నుంచి ఇంజనీర్లు, ఫ్యాషన్ డిజైనర్లు, ఎంబీఏ, లా విద్యార్థులు, రైతు కుటుంబాల పిల్లలు అనేకమంది కనపడ్డారు. లూజ్ జీన్స్, టీషర్టులు, రకరకాల వస్త్రధారణ, నెత్తికి చుట్టుకున్న బ్యాండ్లతో ఉన్న వీరిని ఏ రాజకీయ పార్టీతోనూ అంటగట్టలేము. ఈ విద్యార్థులే ఇవాళ పార్లమెంటు అజెండాను నిర్ణయిస్తున్నారంటే ఆశ్చర్యం కలుగుతోంది. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభమయిన తర్వాత ఏడు రోజులకు మొదటిసారి మంగళవారం మధ్యాహ్నం నుంచి లోక్‌సభ సజావుగా సాగింది. అందుకు కారకులు విద్యార్థులే. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడానికే కాదు, పరీక్షల్లో అక్రమాలను నిరోధించేందుకు ప్రభుత్వం ఆగమేఘాలపై బిల్లు తేవడానికి, ప్రధానమంత్రి రాత్రి పొద్దుపోయిన తర్వాత ఈ బిల్లు గురించి ప్రకటించడానికి, ప్రతిపక్షాలు కూడా చివరకు చర్చకు సిద్ధపడడానికి వారే కారకులు. స్మృతి ఇరానీ నుంచి ధర్మేంద్ర ప్రధాన్ వరకు మోదీ హయాంలో నలుగురు విద్యామంత్రులు మారారు. ప్రతి విద్యామంత్రి హయాంలో ఏదో ఒక వివాదం ఉంటూనే వచ్చింది. కానీ విద్యార్థుల ఒత్తిడి మేరకు రాజీనామా చేయక తప్పని పరిస్థితి ఒక్క ధర్మేంద్ర ప్రధాన్‌కే ఏర్పడింది. రాజీనామా చేసిన తర్వాత పార్లమెంటు ఆవరణలో ధర్మేంద్ర అడుగుపెడితే బీజేపీ ఎంపీలు ఆయనకు జిందాబాద్ అంటూ ఘనస్వాగతం పలికారు. కిరీటం తొడిగారు. దేనికి? ఎవరి ఆదేశాలతో ఎందుకు సన్మానం చేశారు? కింద పడ్డా తమదే పై చేయి అని చెప్పుకునేందుకే ఆ పని చేసినట్లు స్పష్టమవుతోంది. దానివల్ల నష్టం ఎవరికి? వారికే కాదూ! నెల రోజులకు పైగా శాంతియుతంగా నిరసన ప్రదర్శన చేస్తూ పరీక్షా పత్రాల లీక్‌కు విద్యామంత్రి నైతిక బాధ్యత వహించాలని కోరిన యువతీ యువకులతో దేశవ్యాప్తంగా ఎంతోమంది కనెక్టయ్యారు. పార్లమెంటుకు ఊరేగింపుగా వెళ్లి లాఠీచార్జిలకు తలలు పగిలి, పెల్లెట్ల ముక్కలు ఆ యువజనుల శరీరాల్లోకి చొచ్చుకుపోయినప్పుడు అనేకమంది తీవ్ర ఆవేదనకు గురయ్యారు. సీజేపీలో ఉన్నవారే సంఘ వ్యతిరేక శక్తులైతే, వారి ప్రతినిధులతో కేంద్రమంత్రులు మూడు దఫాలు ఎందుకు చర్చలు జరిపారు? విద్యావ్యవస్థలో సంస్కరణలపై వారితో కూడా చర్చిస్తామని ఎందుకు వాగ్దానం చేశారు? నిజానికి ప్రతి ఉద్యమంలోనూ ఎంతో కొంత హింసాకాండ, విధ్వంసం జరుగుతూనే ఉన్నది. జయప్రకాశ్ నారాయణ్ నిర్వహించిన సంపూర్ణ క్రాంతి ఉద్యమంలో కూడా డైనమైట్లతో రైల్వే వంతెనలు పేల్చివేసేందుకు కుట్ర జరిగిందని ఆరోపణలు వచ్చాయి. రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమ సమయంలో కూడా హింసాకాండ చెలరేగింది. చాలాసార్లు పోలీసుల దమనకాండ జరిగిన తర్వాత దాన్ని సమర్థించుకునేందుకు ఈ సంఘ వ్యతిరేకుల కోణం ముందుకు వస్తుంది.

# జనసంద్రమైన సింహాచలం..

ఆంధ్రప్రదేశ్ లోని ప్రముఖ పుణ్యక్షేత్రం సింహాచలంలో శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి గిరి ప్రదక్షిణ మహోత్సవం అంగరంగ వైభవంగా కొనసాగుతోంది. సింహాద్రి అప్పన్న నామస్మరణతో గిరి ప్రదక్షిణ మార్గం మార్మోగిపోతోంది. ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని ఏటా నిర్వహించే ఈ మహోత్సవంలో పాల్గొనేందుకు లక్షలాదిగా తరలివచ్చిన భక్తులతో 32 కిలోమీటర్ల మార్గమంతా కిటకిటలాడుతోంది. కొండ దిగువన ఉన్న తొలిపావంచ వద్ద కొబ్బరికాయలు కొట్టి, ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు పాదయాత్రను ప్రారంభించారు. ఈ ఏడాది 10 లక్షల మందికి పైగా భక్తులు గిరి ప్రదక్షిణలో పాల్గొంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం, దేవస్థానం అధికారులు సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేశారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలను డ్రోన్ల సహాయంతో పర్యవేక్షిస్తూ, అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు.పాదయాత్ర చేస్తున్న భక్తుల కోసం గిరి ప్రదక్షిణ మార్గంలో 33 చోట్ల వైద్య శిబిరాలు, 26 అంబులెన్స్‌లను అత్యవసర సేవల కోసం సిద్ధంగా ఉంచారు. గిరి ప్రదక్షిణ పూర్తి చేసుకున్న వారికి అప్పన్న ఉచిత దర్శన సౌకర్యం కల్పించారు. మార్గమధ్యంలో పలు స్వచ్ఛంద సంస్థలు, స్థానికులు భక్తులకు అల్పాహారం, తాగునీరు అందిస్తూ తమ భక్తిని చాటుకుంటున్నారు. 32 కిలోమీటర్ల పాదయాత్రను పూర్తి చేసుకుని భక్తులు బుధవారం ఉదయానికి స్వామివారి ఆలయానికి చేరుకుంటారు. ఆషాఢ పౌర్ణమి నాడు సింహాద్రి కొండ చుట్టూ ప్రదక్షిణ చేస్తే భూ ప్రదక్షిణ చేసినంత పుణ్యఫలం దక్కుతుందని భక్తులు ప్రగాఢంగా విశ్వసిస్తారు.

# కుప్పంలో కొనసాగుతున్న నారా భువనేశ్వరి పర్యటన..

ముఖ్యమంత్రి చంద్రబాబు అర్ధాంగి నారా భువనేశ్వరి కుప్పం నియోజకవర్గంలో తన పర్యటనను రెండో రోజు కొనసాగించారు. ఈ సందర్భంగా ఆమె పలు అభివృద్ధి, సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. కుప్పం ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి, స్విమ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ కేంద్రాన్ని, టీఎన్ఎస్ఎఫ్ నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ.. క్యాన్సర్ మహమ్మారిపై మహిళల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పారు. క్యాన్సర్ స్క్రీనింగ్ యూనిట్ ఏర్పాటు చేసిన స్విమ్స్ ప్రతినిధులను అభినందించారు. ముందస్తు జాగ్రత్తలు, చైతన్యం ద్వారా క్యాన్సర్ ముప్పు నుంచి మహిళలను కాపాడవచ్చని తెలిపారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా కూడా ఇలాంటి ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నామని, ముఖ్యంగా తలసీమియా వ్యాధిగ్రస్త పిల్లలకు ఉచితంగా సురక్షితమైన రక్తాన్ని అందిస్తూ అండగా నిలుస్తున్నామని వివరించారు. కుప్పం అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ పెట్టారని భువనేశ్వరి అన్నారు. గతంలో ఇక్కడి నుంచి ఉపాధి కోసం యువత కర్ణాటకకు వలస వెళ్లేవారని, కానీ ఇప్పుడు ఆ పరిస్థితి మారుతుందని భరోసా ఇచ్చారు. సీఎం చంద్రబాబు ఒకేసారి కుప్పానికి 30 పరిశ్రమలు తీసుకువచ్చారని, వీటి ద్వారా వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆమె స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు సీఎం అహర్నిశలు కృషి చేస్తున్నారని కొనియాడారు. అనంతరం రాజకీయ అంశాలపై మాట్లాడుతూ.. డీఎస్సీ నిర్వహణపై వైసీపీ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు గమనిస్తున్నారని ఆమె వ్యాఖ్యానించారు. కుప్పం ప్రజలు తనను ఎంతో ఆదరిస్తున్నారని, వారికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

# అమరావతిలో జెనోమిక్ సొల్యూషన్ సెంటర్

ఆస్ట్రా జెనెకా ఏర్పాటు చేయనుంది. అమరావతి క్వాంటం వ్యాలీ- ఆస్ట్రా జెనెకా ఇండియా భాగస్వామ్యంతో ఇంటిగ్రేటెడ్ ప్రెసిషన్ అంకాలజీ చికిత్సా విధానాన్ని ప్రారంభించనున్నారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ , నెక్స్ట్ జనరేషన్ సీక్వెన్సింగ్ , ఆధునిక జన్యుచికిత్సా విధానాల్ని వినియోగించి కాన్సర్ ప్రారంభదశలోనే గుర్తించి శరీర తత్వానికి అనుగుణంగా చికిత్స అందించేలా ఈ ఇంటిగ్రేటెడ్ ప్రెసిషన్ అంకాలజీ విధానం ఉపకరించనుంది. ఊపిరితిత్తుల కాన్సర్ ను ముందుగా గుర్తించేందుకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ తో కూడిన ఎక్స్ రే ఆధారిత వ్యవస్థను ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏర్పాటు చేయనుంది. తద్వారా రోగులను వేగంగా స్క్రీనింగ్, డయాగ్నోస్టిక్ సేవలు అందటం తో పాటు ఎలాంటి జాప్యం లేకుండా చికిత్స చేసేందుకు వీలుగా మార్గం సుగమం కానుంది.

**వైద్య రంగంలో పరిశోధనలకు క్వాంటంవ్యాలీ సేవలు** ప్రజలందరికీ అందుబాటులో అత్యాధునిక వైద్య సదుపాయాలను తీసుకురావటమే ఈ ఒప్పందం లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఫార్మా, బయో టెక్నాలజీ రంగాల్లో క్వాంటం పరిశోధనలు జరగాల్సి ఉందని సీఎం సూచించారు. కాలుష్యం లాంటి బాహ్య కారణాల వల్ల కూడా ప్రమాదకరమైన కాన్సర్ బారిన పడుతున్నారని... ముందే గుర్తించి చికిత్సలు అందించటం ద్వారా రోగులకు ప్రయోజనం కలుగుతుందని అన్నారు. వైద్య రంగంలోని వ్యవస్థలు ప్రిడిక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్ విధానంలో పనిచేయాలని సీఎం సూచించారు. ఏపీలో సంజీవని ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలోని ప్రతీ పౌరుడి హెల్త్ ప్రొఫైల్ ను డిజిటల్ రికార్డులుగా మారుస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. వైద్యారోగ్య రంగంలో మరింత వేగంగా ట్రాన్స్‌ఫర్మేషన్ జరగాల్సి ఉందని తెలిపారు. కేన్సర్ తో పాటు ఇతర వ్యాధులపై కూడా అమరావతి క్వాంటం వ్యాలీ నుంచి విస్తృతంగా పరిశోధనలు జరగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఎస్ జి.సాయి ప్రసాద్, ఆస్ట్రాజెనెకా ఇండియా ఎండీ ఏ. ప్రవీణ్ రావు , స్ట్రాండ్ లైఫ్ సైన్సెస్, క్యూర్ ఏఐ సంస్థల ప్రతినిధులు, వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# భవిష్యత్‌లో పేపర్ లీకులకు అడ్డుకట్ట

ఇటువంటి ఘటనలు చోటుచేసుకున్నాయన్నారు. ఇవి క్రమంగా వ్యవస్థాగత నేరాలుగా మారాయని, వీటిని అరికట్టేందుకే చట్టంలో మార్పులు చేస్తున్నామని సభకు వివరించారు. 2009, 2011లో ఎన్నో పేపర్‌లు లీకయ్యాయి. 2012లో ఎయిమ్స్ ప్రవేశ పరీక్ష పేపర్ లీక్ అయ్యింది. యూపీ, తమిళనాడుల్లోనూ ఈ ఘటనలు చోటుచేసు కున్నాయి. ఎన్నో ప్రవేశ, ఉద్యోగ నియామక పరీక్షల పేపర్లు లీక్ అయ్యాయి. వీటిని అరికట్టేందుకు 1992, 2010లోనూ ప్రయత్నాలు జరిగాయి. అయితే, అవి ఎందుకు పూర్తి కాలేదో నాటి పాలకులే సమాధానం చెప్పాలి. క్రమంగా ఇవి వ్యవస్థాగత నేరాలుగా మారాయి. ఇటీవల నీట్ పేపర్ లీక్ విషయం తెలియగానే ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఇటువంటి నేరాలను అరికట్టేందుకు ప్రస్తుతం తీసుకొచ్చిన బిల్లు ఎంతో ఉపయోగకరం. నిందితులను కఠినంగా శిక్షించేందుకు బిల్లులో నిబంధనలు రూపొందించాం. దోషులకు శిక్షలను పదేళ్లకు పెంచాం. లీకేజీ గ్యాంగ్‌లకు జరిమానాను రూ.కోటి నుంచి రూ.10 కోట్లకు పెంచాం. కేసుల విచారణకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేశాం అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

# నిరసన కాదు కృతజ్ఞత ర్యాలీ:

'అమ్మ ఒడి' పథకాన్ని నిరాకరించి తీవ్ర ద్రోహం చేశారని ఆయన మండిపడ్డారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీల పిల్లలకు కూడా 'తల్లికి వందనం' పథకాన్ని వర్తింపజేస్తూ నిర్ణయం తీసుకోవడంతో... వారు సంతోషంతో తనకు ధన్యవాదాలు తెలిపేందుకు ర్యాలీగా వచ్చారని లోకేశ్ స్పష్టం చేశారు. అంగన్‌వాడీలు తెలిపిన కృతజ్ఞతా ప్రదర్శనను వైసీపీ నేతలు వికృత ఆలోచనలతో నిరసనగా చిత్రీకరిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా వేదికగా అసలైన చిత్రాలు, వైసీపీ తప్పుడు ప్రచారం చేసిన ఫోటోలను పంచుకున్న లోకేశ్... విపక్షాల 'ఫేక్ న్యూస్' ప్రచారాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రజలకు, అంగన్‌వాడీలకు మేలు జరుగుతుంటే ఓర్వలేకనే ప్రతిపక్షం ఇలాంటి అసత్య ప్రచారాలకు ఒడిగడుతోందని విమర్శించారు.

## హైదరాబాద్‌ను ముంచెత్తిన భారీ వర్షం..

భాగ్యనగరాన్ని మంగళవారం సాయంత్రం భారీ వర్షం ముంచెత్తింది. హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో ఏకధాటిగా కురిసిన కుండపోత వానకు రహదారులన్నీ జలమయమయ్యాయి. దీంతో ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ ఎక్కడికక్కడ స్తంభించిపోవడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. ముఖ్యంగా కార్యాలయాల పనివేళలు ముగిసే సమయం కావడంతో హైటెక్ సిటీ, మాదాపూర్, గచ్చిబౌలి తదితర ప్రాంతాల్లో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి.

# సన్‌రైజ్ ప్రీ-స్కూల్ నిర్వాహకురాలిని కత్తితో బెదిరించి నగదు వసూలు చేసిన కేసు ఛేదన..

## విద్యార్థి సంఘ నాయకులు, మీడియా ప్రతినిధులు సహా ఐదుగురి అరెస్ట్

**నంది పత్రిక కడప ప్రతినిధి కడప, జూలై 28:** కడప పట్టణంలోని సన్‌రైజ్ ప్రీ-స్కూల్ నిర్వాహకురాలిని కత్తితో బెదిరించి నగదు వసూలు చేసిన కేసును కడప తాలూకా పోలీసులు ఛేదించారు. ఈ కేసులో విద్యార్థి సంఘ నాయకులు, యూట్యూబర్లు, మీడియా ప్రతినిధులు సహా ఐదుగురిని అరెస్టు చేసి, నేరానికి ఉపయోగించిన కత్తితో పాటు రూ.3,000 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు అధికారికంగా వెల్లడించారు. పోలీసుల ప్రకారం, కడప తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన క్రైమ్ నంబర్ 102/2026 కేసు దర్యాప్తులో భాగంగా నిందితులను గుర్తించి అరెస్టు చేశారు.

**నేరం జరిగిన విధానం** పోలీసుల కథనం ప్రకారం, సన్‌రైజ్ ప్రీ-స్కూల్‌కు సంబంధించి అనుమతులు లేవనే విషయాన్ని ఆసరాగా చేసుకున్న నిందితులు, స్కూల్ నిర్వాహకురాలిని బెదిరించి అక్రమంగా డబ్బులు వసూలు చేయాలని ముందుగానే పథకం రచించారు. ఈ క్రమంలో కొందరు విద్యార్థి, ప్రజా సంఘాల నాయకుల పేర్లను ఉపయోగించగా, మరికొందరు విలేకరులు, యూట్యూబ్ ఛానల్ ప్రతినిధులుగా కెమెరాలతో పాఠశాలలోకి ప్రవేశించి వీడియోలు, ఫొటోలు చిత్రీకరించారు. అనంతరం స్కూల్‌కు అనుమతులు లేవని, పాఠశాలను మూసివేయిస్తామని, సంబంధిత అధికారులతో చర్యలు తీసుకునేలా చేస్తామని, తమకు కావాల్సిన మొత్తం ఇవ్వకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని నిర్వాహకురాలిని బెదిరించినట్లు పోలీసులు తెలిపారు. ఈ బెదిరింపుల నేపథ్యంలో రూ.3,000 నగదును వసూలు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

**అరెస్టు చేసిన నిందితులు**

**పోలీసులు అరెస్టు చేసిన వారి వివరాలు ఇలా ఉన్నాయి:**

1. బుక్కే జగన్ మోహన్ నాయక్ ఏ జగన్ నాయక్ ఏ జనగణ నాయక్ (29) క్యాటరింగ్ వ్యాపారి. స్వస్థలం కల్లూరుపల్లి తాండా, చక్రాయపేట మండలం. ప్రస్తుతం రాజారెడ్డి వీధి, కడపలో నివాసం.
2. నాగిపోగు ఓబయ్య (34) విద్యార్థి నాయకుడు. మల్లేపల్లి గ్రామం, బి.మఠం మండలం, కడప జిల్లా.
3. చౌడవరం విజయ సాయి ఏ విజయ కుమార్ (53) ఛా1 న్యూస్ రిపోర్టర్. నివాసం ఖాజానదీ కాలనీ, కడప.
4. దారా కమ్మన్న ఏ కంబన్న (43) సూర్య న్యూస్ విలేకరి. నివాసం నాగరాజుపేట, కడప.
5. సుంకు శ్యామ్ ప్రసాద్ ఏ శ్యామ్ (55) ఖ.ఎల కెమెరామెన్. నివాసం నబీకోట, కడప.

**స్వాధీనం చేసుకున్న వస్తువులు**

**ఈ కేసులో నిందితుల వద్ద నుంచి:**



– నేరానికి ఉపయోగించిన 6 అంగుళాల పొడవు గల ఒక కత్తి, – రూ.500 చొప్పున ఆరు నోట్లు, మొత్తం రూ.3,000 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

**పోలీసుల హెచ్చరిక** విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు, మీడియా సంస్థలు లేదా యూట్యూబ్ ఛానళ్ల పేర్లను దుర్వినియోగం చేస్తూ ప్రజలను బెదిరించి అక్రమంగా డబ్బులు వసూలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కడప తాలూకా పోలీసులు హెచ్చరించారు. ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు వెల్లడించారు.

# సంత జుటూరులో ప్రైవేటు క్లినికును తనిఖీ చేసిన వైద్యాధికారి



**బండి ఆత్మకూరు నంది పత్రిక జూలై 28:** గ్రామీణ ప్రాంతంలో పనిచేసే ఆర్ఎంపీలు ప్రజలకు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని నారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి దినేష్ బాబు పేర్కొన్నారు. బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న సంత జూటూరు గ్రామంలోని పరశురాం ఆర్.ఎం.పి క్లినిక్కుతో పాటు, మందుల దుకాణాన్ని ల్యాబ్ ను వైద్యాధికారి తనిఖీ చేశారు. ఎట్టి పరిస్థితులలోనూ అధిక మోతాదు కలిగిన స్టెరాయిడ్స్, యాంటీబయాటిక్, నొప్పి నివారణ మాత్రలను మందుల షాపులలో ఉంచరాదని పేర్కొన్నారు. ఈ మందులను రోగులకు రాయరాదని, ఆర్.ఎం.పి ప్రాక్టీస్ చేసేవారు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని పేర్కొన్నారు. క్లినిక్కు, మందుల షాపును, ల్యాబ్ ను ఒకే వ్యక్తి నిర్వహించరాదని పేర్కొన్నారు. మందుల దుకాణాన్ని ఫార్మసీ చేసిన వారే నిర్వహించాలని, అర్హులైన ల్యాబ్ టెక్నీషియన్స్ ద్వారా మాత్రమే ల్యాబ్ టెస్టులు చేయించాలని వైద్యాధికారి మౌఖికంగా ఆదేశాలు ఇచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు,ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీలు వైద్యాధికారి దినేష్ బాబు తో పాటు సంత జూటూరు సిహెచ్ఓ యశోద, ఆశ వర్కర్ సువర్ణమ్మ పాల్గొన్నారు.

# పంట మార్పిడితోనే లాభాలు

**బండి ఆత్మకూరు నంది పత్రిక జూలై 28:** బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న పెద్దదేవలాపురం, సంత జూటూరు గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ,పంటల బీమా పథకం ప్రాముఖ్యత, అర్హత, నమోదు విధానం మరియు ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంట బీమా రైతులకు అందించే ప్రయోజనాల గురించి వివరించారు. రైతుల సాగు చేసిన ప్రతి పంటకు బీమా మరియు పంట నమోదు చేసుకోవాలని,ప్రస్తుత ఎల్నినో పరిస్థితుల్లో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నేల తేమ సంరక్షణ, సమతుల్య ఎరువుల వినియోగం, వాతావరణ ఆధారిత వ్యవసాయ యాజమాన్య పద్ధతులు మరియు పంట బెట్ట గురి అయినప్పుడు 19:19:19 నీటిలో కరిగే ఎరువును 1% ద్రావణంగా ఆకులపై పిచికారీ చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.అనంతరం అధికారులు మొక్కజొన్న మరియు పత్తి పంటలు క్షేత్రస్థాయిలో సందర్శించి పంటల ఎదుగుదల, నేలలో తేమ పరిస్థితులు, చీడపీడలు మరియు వ్యాధుల ఉనికిని పరిశీలించారు. రైతుల సమస్యలను తెలుసుకుని పంట పరిస్థితులకు అనుగుణంగా శాస్త్రీయ సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు వెటర్నరీ డాక్టర్ అనూష, వ్యవసాయ విస్తరణ సిబ్బంది అర్ఫత్ పలువురు రైతులు పాల్గొన్నారు



# కాంట్రాక్ట్ మరియు ఔట్సోర్సింగ్ కార్మికులకు రెగ్యులర్ చేయాలి..

**ఉప్పెన కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ఆందోళన జయప్రదం చేయండి.**

**షెడ్యూల్ ఎంప్లాయిస్ వేతనాలు రివైజ్ చేయాలి.**

**సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్.**




**నందిని ప్రతినిధి, జులై 29, కడప జిల్లా..** జిల్లా వ్యాప్తంగా కాంట్రాక్ట్ మరియు ఔట్సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని ఈ నెల 30న కలెక్టర్ నిర్వహించి ఆందోళన జయప్రదం చేయాలని షెడ్యూల్ ఎంప్లాయిస్ కి వేతనాలు రివైజ్ చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసంఘటిత సంఘటిత కార్మికులు జిల్లా వ్యాప్తంగా రెండు నుంచి ఐదు లక్షల మంది ఉన్నారని పేర్కొన్నారు. మున్సిపల్, విద్యుత్, విద్య, వైద్యము స్కీం వర్కర్లు, అంగన్వాడి, మధ్యాహ్న భోజనం, ఆశ, వివో ఏలు, పెట్రోల్ బంకులు, షాపింగ్ మాల్స్, టీచింగ్ నాన్ టీచింగ్, ఆసుపత్రుల్లో శానిటేషన్, నర్సులు, షిరిడి సాయిబాబా దాదాపు 7వేల మంది, డిక్షన్ కంపెనీ 2,500 మంది, కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. వీరికి కలెక్టర్ నిర్ణయించిన ప్రకారం కనీస వేతనం అమలు కావడం లేదని చెప్పారు. ప్రభుత్వ శాఖలో ఆప్కో లేకుండా ఈ శాఖ లేదని పేర్కొన్నారు. ఎక్కువ పని చేయించుకుంటూ తక్కువ విత్తనాలు ఇస్తున్నారని విమర్శించారు. 108, 104, కేజీబీవీఎస్, ఆరోగ్య మిత్ర, ఆయుష్, 1962 ఏపీ సెక్స్, అర్బన్ హెల్త్, వీఆర్ఏ, జర్నలిస్టుల్లో, హోంగార్డ్స్ సమస్యల పరిష్కరించడానికి డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు లక్ష్మీదేవి, కోశాధికారి వెంకటసుబ్బయ్య, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, చంద్రారెడ్డి, తిరుపాల్, జిల్లా కార్యదర్శి గోపి, కమిటీ సభ్యులు రవి, ఆనందరావు, శ్యామ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

# కోటపాడులో వీధి వీధినా వెలుగులు..

## 30కు పైగా నూతన ఎల్ఈడి బల్బుల ఏర్పాటు

**భూమా అఖిలప్రియ ఆదేశాల మేరకు అభివృద్ధి పనులు**

**శకుంతలమ్మ, చింతకుంట్ల బూసిరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం**



**సిరివెళ్ల (నంది పత్రిక)**ఆళ్లగడ్డ నియోజకవర్గ శాసనసభ్యురాలు భూమా అఖిలప్రియ ఆదేశాల మేరకు నంద్యాల జిల్లా టీడీపీ ఉపాధ్యక్షురాలు శకుంతలమ్మ, నీటి సంఘం వైస్ ప్రెసిడెంట్ చింతకుంట్ల బూసిరెడ్డి ఆధ్వర్యంలో సిరివెళ్ల మండలంలోని కోటపాడు గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. గ్రామంలోని పలు వీధుల్లో పనిచేయకుండా ఉన్న వీధి విద్యుత్ దీపాలను గుర్తించి,వాటి స్థానంలో నూతన ఎల్ఈడి బల్బులను ఏర్పాటు చేయడంతో గ్రామమంతా విద్యుత్ వెలుగులతో ప్రకాశవంతంగా మారింది. గ్రామపంచాయతీ కార్యదర్శి మనోహర్ తెలిపిన వివరాల ప్రకారం,గ్రామంలో సుమారు 30 కు పైగా వీధి విద్యుత్ స్తంభాలపై ఉన్న బల్బులు పనిచేయకపోవడంతో వాటి స్థానంలో నూతన ఎల్ఈడి బల్బులను అమర్చారు. దీంతో గ్రామ ప్రజలు రాత్రి వేళల్లో సురక్షితంగా రాకపోకలు సాగించే అవకాశం కలిగిందన్నారు.ఈ సందర్భంగా నంద్యాల జిల్లా టీడీపీ ఉపాధ్యక్షురాలు శకుంతలమ్మ,నీటి సంఘం వైస్ ప్రెసిడెంట్ చింతకుంట్ల బూసిరెడ్డి మాట్లాడుతూ, గ్రామాభివృద్ధిలో భాగంగా మౌలిక సదుపాయాల మెరుగుదలకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను కూడా త్వరలో చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. గ్రామస్థులు ఈ చర్యను స్వాగతిస్తూ, గ్రామంలో వీధి దీపాల సమస్యను పరిష్కరించిన ప్రజాప్రతినిధులకు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

# దోమల అంతం మన అందరి పంతం.



**బేతంచెర్ల జులై 28 ( నంది పత్రిక).** బేతంచర్ల మండలం ఆర్ఎస్.రంగాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు శ్రీదేవి మరియు హెల్త్ అసిస్టెంట్ రామాంజనేయులు ఆధ్వర్యంలో డెంగ్యూ వ్యతిరేక మాసం సందర్భంగా,దోమకాటు వలన కలిగే జ్వరాలు మరియు దోమల నివారణ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. వర్షాకాలం కాబట్టి అందరూ దోమల నివారణకు సహకరించాలని ప్రతి శుక్రవారం ఇంటి లోపల ఇంటి బయట నీటి నిల్వ ప్రాంతాలను పరిశీలించాలని,దోమ లార్వా లేకుండా చూసుకోవాలని, ప్రతి శుక్రవారం నీటి విలువ తొట్లను పూర్తిగా కడిగి, ఆరబెట్టి తిరిగి కొత్త నీటిని నింపుకోవాలని వారు తెలియజేశారు.ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు.దీనివల్ల డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్య, మెదడు వాపు వ్యాధి, భోదకాలు నివారించవచ్చు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తిమ్మరాజు మరియు ఆశా కార్యకర్తలు నాగేంద్రమ్మ, స్నేహ, విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీ మద్దులేటి స్వామి అమ్మవార్ల హుండీ లెక్కింపు.





**41 రోజులకు రూ.35 లక్షల 86 వేలు, 15గ్రాముల 180 మిల్లి గ్రాముల బంగారు, 800 గ్రాముల 150 మిల్లిగ్రాముల వెండి సమకూరిక.**

**బేతంచెర్ల జులై28 ( నంది పత్రిక ).** శ్రీ మద్దులేటి లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానం నందు శ్రీ స్వామి అమ్మవారికి భక్తులు సమర్పించిన ముడుపులు, కానుకల హుండీ లెక్కింపు 28/7/2026 మంగళవారం నాడు నిర్వహించడం జరిగింది. ఉప కమీషనర్ & శ్రీ మద్దులేటి స్వామి దేవస్థానం కార్య నిర్వహణ అధికారి ఎం. రామాంజనేయులు మరియు దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ డి. రమేష్ ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు కార్యక్రమం జరిగింది. హుండీ లెక్కింపు ద్వారా 17 /6/2026 నుండి 28/7/2026 వ తేది వరకు, అంటే 41 రోజుల కాలానికి 35 లక్షల 86 వేల 251 రూపాయలు నగదు, 15 గ్రాముల 180 మిల్లి గ్రాముల బంగారు, 800 గ్రాముల 150 మిల్లి గ్రాముల వెండి సమకూరినట్లు ఉప కమీషనర్ & శ్రీ మద్దు లేటి దేవస్థానం కార్య నిర్వహణ అధికారి ఎం. రామాంజనేయులు తెలిపారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో బేతంచెర్ల పట్టణానికి చెందిన బాలాజీ సేవా సమితి సభ్యులు, డోన్ పట్టణానికి చెందిన శ్రీ మద్దులేటి స్వామి సేవా సభ్యులు, వాసవీ సేవా సమితి సభ్యులు మరియు అమ్మ వారి శాల సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.



# వైఎస్ఆర్సిపి ఆధ్వర్యంలో కడప నగరంలో భారీ ర్యాలీ..

**నంది పత్రిక ప్రతినిధి, జులై 28, సార్ కడప జిల్లా.** మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, డీఎస్సీ లో జరిగిన అక్రమాలను కు నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయా లని ఇవాళ వైఎస్ఆర్ జిల్లా కడప నగరంలో యూత్ దేవి రెడ్డి ఆదిత్య, నగర యూత్, జిల్లా విద్యార్థి విభాగం సాయి దత్త మరియు నగర విద్యార్థి విభాగం సంయుక్త ఆధ్వర్యంలో భారీ ర్యాలీ ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ ర్యాలీలో కడప నగరంలోని పార్టీ కార్యాలయం నుండి ప్రారంభమైన కోటిరెడ్డి సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, సెవెన్ రోడ్స్, పెద్ద పోస్ట్ ఆఫీస్ వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలవేసి వన్ టౌన్ సర్కిల్ వరకు ఉత్సాహపరితంగా సాగింది. వంటము సర్కిల్ వద్ద ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నాయకులు ఘనంగా నివాళులు అర్పించి వినతి పత్రం అందజేశారు. ప్రతినిధులు పి రవీంద్రనాథ్ రెడ్డి కడప జిల్లా అధ్యక్షులు, పి సురేష్ బాబు సి ఈ సి నెంబర్ ఎస్ బి అంజద్ భాష మాజీ డిప్యూటీ సీఎం ఈ నరేష్ రెడ్డి కమలాపురం ఇంచార్జ్ రఘురామిరెడ్డి మైదుకూరు మాజీ ఎమ్మెల్యే, బద్వేల్ ఎమ్మెల్యే సుధమ్మ, రామ సుబ్బారెడ్డి జమ్మలమడుగు ఎమ్మెల్సీ, తెలుగు పులి వెంకటసుబ్బమ్మ కడప జిల్లా మహిళా అధ్యక్షురాలు, పులి సునీల్ కుమార్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, నిత్యానంద రెడ్డి మాజీ డిప్యూటీ మేయర్, దీప్తి రెడ్డి కడప నగర్ అధ్యక్షులు, కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్, మాజీ కౌన్సిలర్లు, విద్యార్థులు , మాజీ చైర్మన్లు, యువత, విద్యార్థినులు, అతి భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమం చేశారు వైఎస్ఆర్సిపి నాయకులు, నాయకురాలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు



# విద్యార్థి శివాని ఆత్మహత్య చాలా బాధాకరం. వెంటనే పాఠశాలల్లో మానసిక నిపుణులను నియమించాలి

**పోరుమామిళ్ల, జులై 28 (నంది పత్రిక )**రంపచోడవరం జిల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న, ఉజ్వల భవిష్యత్తు గల మరియు మెగా పేటీఎంలో ముఖ్యమంత్రి గారిచే ప్రశంసలు అందుకున్న పదవ తరగతి చదువుతున్న విద్యార్థి శివాని ఆత్మహత్య మనసును కదిలించే చాలా బాధాకరమైన విషయం అని ఎస్ టి యు నాయకుడు మరియు సైకాలజిస్టు మూల రామక్రి ష్ణారెడ్డి తెలిపారు. ఎస్ టి యు భవన్లో విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థి ఆత్మహత్యకు గల కారణాలు వెంటనే ప్రభుత్వం శోధించాలి. నేటి సమాజంలో విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారు విద్యార్థుల మానసిక స్థితిగతులు ఎప్పటికప్పుడు విశ్లేషిస్తూ కౌన్సిలింగ్ నిర్వహించడానికి పాఠశాలల్లో అర్హత కలిగిన కౌన్సెలింగ్ సైకాలజిస్టను వెంటనే నియమించాలని ప్రభుత్వాన్ని కోరడమైనది. గౌరవ సుప్రీంకోర్టు కూడా పాఠశాలలో కౌన్సిలింగ్ సైకాలజిస్ట్ నిమాకం గురించిన స్పష్టమైన ఆదేశాలు రాష్ట్ర ప్రభుత్వాలకు ఇవ్వడమైనది. ఈ సమావేశంలో ఎస్ టి యు నాయకులు పుల్లయ్య, బాలరాజు, శ్రీనివాసులు, వెంకటసుబ్బయ్య భాష, డి.ఎల్.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు



# కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలపై డోర్ టు ప్రోగ్రాం



**సిరివెళ్ల..(నంది పత్రిక)** సిరివెళ్ల మండల పరిధిలోని కోటపాడు గ్రామంలో తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు గారు ఆళ్లగడ్డ శాసన సభ్యురాలు గౌరవనీయులైన అఖిలమ్మ గారి ఆదేశాలతో రెండవ రోజు డోర్ టు డోర్ క్యాంపియన్ లో భాగంగా 70వ బూతు పరిధిలో ప్రజలకు సంక్షేమ కార్యక్రమాల గురించి వివరిస్తూ కూటమి ప్రభుత్వం సంక్షేమ విజయాలు రెండు ఏళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం డోర్ టు డోర్ కార్యక్రమాన్ని గురించి వివరించడం జరుగుతున్నది అలాగే ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజలతో మమేకమవుతు ఎలాంటి సమస్యలు ఉన్నా ప్రజలు మా దృష్టికి తీసుకువస్తే మేము ఎమ్మెల్యే గారైన అఖిలమ్మ గారి దృష్టికి తీసుకుపోయి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ప్రజలకు తెలియజేస్తూ ఈ డోర్ టు డోర్ కార్యక్రమాన్ని మా వంతుగా విజయవంతం చేయడానికి ప్రయత్నం చేస్తున్నాము. కార్యక్రమంలో 70 బూతు ఇంచార్జి కేడం సుబ్బారావు తెలుగుదేశం పార్టీ నాయకులు నీటి సంఘం అధ్యక్షులు చిలుకల రాంపుల్లయ్య, కోకన్వీనర్ చిలుకల లక్ష్మీనారాయణ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేసినారు.

# నూతన యూజిడి వ్యవస్థకు 188 కోట్లతో ప్రతిపాదనలు:

### ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



**తిరుపతి బ్యూరో చీఫ్ జూలై 28 నంది పత్రిక** తిరుపతి నగరాన్ని అన్ని విధాల ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. 35ఏళ్ల అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ స్థానంలో కొత్త డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు 188 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు ఆయన చెప్పారు. స్టామ్ వాటర్ డ్రైన్ ను మెరుగు పరిచేందుకు 135 కోట్ల రూపాయల రుణం త్వరలో మంజూరు అవుతుందని ఆయన వెల్లడించారు. మంగళవారం ఉదయం ఒకటవ డివిజన్ లోని సుబ్బారెడ్డి నగర్ లో 27లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. అనంతరం రెండవ డివిజన్ లోని పూలావాణిగుంట లో 80 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రైన్ ను ఎమ్మెల్యే ఆరణి ప్రారంభించారు. నగరంలో మౌలికసదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. డ్రైనేజీ వ్యవస్థ పాతది కావడంతో అక్కడక్కడా లీకేజీలు ఎదురవుతున్నాయని ఆయన చెప్పారు. పాత డ్రైనేజీ స్థానంలో కొత్తది తీసుకొచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. నగర విస్తరణలో భాగంగా ఏర్పాటైన ప్రాంతాల్లో డ్రైనేజీ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ లు నగర అభివృద్ధి పట్ల ఎంతో చిత్తశుద్ధితో ఉన్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్ పర్సన్ సుగుణమ్మ, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, రాష్ట్ర నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఎస్ ఈ శ్యాంసుందర్, ఈఈ తులసి కుమార్ , గోమతి, డీఈ రమణ, ప్రజా ప్రతినిధులు, పాల్గొన్నారు.




# నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో అన్న ప్రసాద వితరణ

**నంద్యాల ప్రతినిధి. జూలై 28 . (నంది పత్రిక ):**నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం అన్నప్రసాద వితరణ చేసినట్లు లయన్ పెసల శ్రీకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా నంద్యాల ప్రభుత్వాసుపత్రిలో వచ్చు పేషెంట్ల సహాయకులకు అన్నదాన వితరణ చేస్తున్నట్లు తెలిపారు. మంగళవారం కీర్తిశేషులు చందా రామయ్య వర్ధంతి సందర్భంగా చందా రామయ్య కుటుంబసభ్యుల సహకారంతో అన్న ప్రసాద వితరణ నిర్వహించామన్నారు. నంద్యాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో దూరప్రాంతాల నుంచి వైద్యం కొరకు ఎంతోమంది వస్తుంటారని వారికి ప్రత్యనిత్యం అన్నదానం దాతల సహకారంతో నిర్వహిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో లయన్ చంద్రమోహన్, లయన్స్ సేవ ప్రగతి చార్టర్ ప్రెసిడెంట్ పెసల శ్రీకాంత్,అధ్యక్షులు సందీప్ కుమార్, కార్యదర్శి చంద్రశేఖర్, జోన్ చైర్మన్ సోమశిల నాగరాజు, సభ్యులు పోలూరు జనార్దన్, కిరాణలాల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.




# మస్జిద్-ఏ-లతీఫియా అభివృద్ధికి సొంత నిధులతో రూ.2.50 లక్షల ఆర్థిక సహాయం అందజేసిన ఎన్ .ఎం.డి.ఫిరోజ్

**నంద్యాల సిటీ బ్యూరో జులై 28 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణంలోని బాలాజీ కాంప్లెక్స్ లోగల మస్జిద్ -ఏ-లతీఫియా అభివృద్ధి పనుల కోసం తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ రూ.2.50 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఫిరోజ్ మాట్లాడుతూ లతీఫియా మస్జిద్ నందు మౌలిక వసతుల లేమీతో మరియు వివిధ సమస్యలతో నమాజ్ వచ్చే ముస్లిం సోదరులకు ఇబ్బందులకు గురయ్యేవారు. ఈ మస్జిద్ లోనే తరుచూ జుమ్మా ప్రార్థనలకు హాజరయ్యే మంత్రి ఫరూక్ ఈ సమస్యను గుర్తించి మస్జిద్ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు తన వంతు సహాయంగా సొంత నిధులతో అక్షరాల 2 లక్షల యాభై వేల రూపాయలు ఆర్థిక సహాయం చేయడం జరుగుతుందన్నారు. నంద్యాలలో మతాలకు అతీతంగా ప్రార్థనా స్థలాల అభివృద్ధి సమాజంలో ఐక్యత, సామరస్యం మరియు ఆధ్యాత్మిక విలువలను పెంపొందిస్తుందని అన్నారు. అదే విధంగా భవిష్యత్తులో కూడా మస్జిద్ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తామని తప్పక అండగా ఉంటామని తెలిపి మస్జిద్ కమిటీ సభ్యులకు మొత్తాన్ని అందజేశారు.మస్జిద్ అభివృద్ధికి అందించిన ఈ ఆర్థిక సహాయం నిర్మాణ, మౌలిక సదుపాయాల మెరుగుదలకు ఉపయోగపడుతుందని ఫిరోజ్ పేర్కొన్నారు.లతీఫియా మస్జిద్ అభివృద్ధికి సహకరించిన రాష్ట్ర మంత్రివర్యులు ఫరూక్ , ఫిరోజ్ కు మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మనియార్ ఖలీల్ అహ్మద్ మరియు మస్జిద్ కమిటీ సభ్యులు జాహెద్, జాఫర్, అయ్యుబ్ అర్షద్ తదితరులు పాల్గొన్నారు.



# క్వాలిటీ కంట్రోల్ ఎక్కడ?..

## ఆర్ అండ్ బి అధికారులపై తీవ్ర విమర్శలు

### నాణ్యతా ప్రమాణాలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి: ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్

**పోరుమామిళ్ల, జులై 28: (నంది పత్రిక )**వైయస్సార్ కడప జిల్లా పోరుమామిళ్ల పట్టణంలోని పోరుమామిళ్లరంగసముద్రం రహదారి నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ సభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గత మూడు సంవత్సరాలుగా కొనసాగుతున్న ఈ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత లోపాలు ఉన్నాయని, సంబంధిత ఆర్ అండ్ బి అధికారులు, క్వాలిటీ కంట్రోల్ అధికారులు పర్యవేక్షణలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు.కాంక్రీట్ రోడ్డు నిర్మాణంలో సాంకేతిక నిబంధనల ప్రకారం తగిన కాలం పాటు క్యూరింగ్ చేయాల్సి ఉండగా, కొన్ని ప్రాంతాల్లో కేవలం పైపైగా నీరు చల్లి పనులు ముగిస్తున్నారని వారు పేర్కొన్నారు. అలాగే పోరుమామిళ్ల బస్టాండ్ సమీపంలోని డ్రైనేజీ క్యూరింగ్ కూడా నాసిరకంగా జరుగుతోందని, వర్షాకాలంలో కాలువలు కుంగిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల పన్నుల సొమ్ముతో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రభుత్వ నిధులు వృథా కావడంతో పాటు ప్రజల ప్రాణాలకు కూడా ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. ఇలాంటి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నాణ్యతా ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్లు, పర్యవేక్షణలో విఫలమైన సంబంధిత అధికారులపై ప్రభుత్వం కఠిన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్ వెంటనే సమగ్ర సాంకేతిక విచారణకు ఆదేశాలు జారీ చేసి, అవసరమైతే స్వతంత్ర నాణ్యతా తనిఖీ నిర్వహించి, నివేదిక ఆధారంగా బాధ్యులపై చట్టపరమైన మరియు శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ సభ్యులు కోరారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ రాష్ట్ర కార్యదర్శి ఫణి రావు, ఆఫీస్ సెక్రటరీ ప్రవీణ్ బాబు , ప్రెస్ సెక్రటరీ సాగర్ మాట్లాడుతూ ప్రజా ధనంతో చేపట్టే ప్రతి అభివృద్ధి పనిలో పారదర్శకత, నాణ్యత తప్పనిసరిగా ఉండాలని, ప్రజల ప్రయోజనాలను కాపాడేలా అధికారులు తక్షణమే స్పందించాలని విజ్ఞప్తి చేశారు.



# ఖరీఫ్ కాలంలో సాగుచేసిన పంటలకు భీమా చేయించుకోవాలి.





**నంద్యాల సిటీ బ్యూరో జులై 28 ( నంది పత్రిక )** రైతులు ఖరీఫ్ కాలంలో సాగు చేసిన పంటలకు భీమా చేయించుకోవాలని నంద్యాల వ్యవసాయ శాఖ అధికారి ప్రసాదరావు పేర్కొన్నారు. నంద్యాల మండలంలోని చాబోలు , కానాల గ్రామాలలో నంద్యాల మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావు ఆధ్వర్యంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడమైనది.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి మాట్లాడుతూ ఖరీఫ్ కాలంలో సాగు చేసిన పంటలకు భీమా చేయించుకోవాలని తెలియజేశారు. ఈ ఖరీఫ్ కాలంలో సాగు చేసిన పంటలకు ప్రభుత్వం ప్రధానమంత్రి ఫసల్ భీమా ను వివిధ పంటలకు వర్తింప చేస్తూ మార్గదర్శకాలు విడుదల చేయడం జరిగిందని తెలిపారు. ప్రధానమంత్రి ఫసల్ భీమా పథకం లో వరి గ్రామం యూనిట్ గా, మొక్కజొన్న, మినుము, కంది, మిరప మండలం యూనిట్ గా, సజ్జ, కొర్ర, ఉల్లి, ఆముదం, జొన్న జిల్లా యూనిట్ గా ఉన్నదని, వరికి ఎకరాకు 800/-, మొక్కజొన్న కు 660/-, కంది కి 400/- , మినుము మరియు జొన్నకు 190/-, సజ్జ మరియు ఆముదం పంటలకు 160/-, ఉల్లికి 450/- , మిరపకు 2880/- ప్రీమియం చెల్లించి రైతులు పంటల భీమా పథకం లో నమోదు చేసుకోవచ్చునని, అలాగే, వరికి ఆగస్టు 15వ తేదీ వరకు మరియు ఇతర పంటలకు జూలై 31 వరకు గడువు ఉన్నదని తెలిపారు. ప్రధాన పంటలకు గడువు సమీపిస్తున్నందున రైతులు పంటల భీమా చేసుకోవటానికి త్వరపడాలని వ్యవసాయ అధికారి సూచించారు.ఇంకా పూర్తి వివరాలకు రైతులు వారి సమీపంలోని రైతు సేవా కేంద్రాల సిబ్బందిని కలవాలని సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో పంటల భీమా పథకం రైతులకు ఎంతో మేలు చేస్తుందని , కావున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారి సూచించారు.అలాగే ప్రస్తుతం ఎల్లినో ప్రభావం వలన వర్షాలు తక్కువగా కురుస్తున్నందున ఈ పరిస్థితుల్లో రైతులు వరి, మొక్కజొన్న కు ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో సాగు చేయగల పంటలను అనగా మినుము లేదా కంది లేదా పెసలు ఎంపిక చేసుకొని సాగు చేసుకోవాలని తెలియజేశారు. అలాగే భూమిలో నిరంతరం పచ్చదనం ఉండే విధంగా పి.ఎం.డి.ఎస్ విత్తనాలు పొలంలో వెదజల్లుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా సిబ్బంది ఝాన్సీ, సుదర్శన్ , వ్యవసాయ విస్తరణ అధికారి బాలలింగమయ్య ఆయా గ్రామ రైతులు పాల్గొనటం జరిగినది .

# సాయి అఖండ నామావళి

**కర్నూలు ప్రతినిధి. జూలై 28 . (నంది పత్రిక ):**గురుపౌర్ణిమ సందర్భంగా కర్నూలు దక్షిణ శిరిడి సాయిబాబా దేవస్థానం నందు 7 రోజులు ఓం సాయి శ్రీ సాయి జయ జయ సాయి అఖండ నామావళి ప్రారంభమైనది. 7వ చివరి రోజు నామావళికి కర్నూలు చుట్టుపక్కల గ్రామాలైన పులగుమ్మి గ్రామ భజన మండలి వారు, కొంకల గ్రామ భజన మండలి వారు నన్నూరు గ్రామ భజన మండలి వారు గ్రామ భజన మండలి వారు మరియు పెద్ద తాండ్రపాడు భజన మండలి వారు 5 భజన బృందాలు ఈ అఖండ నామంలో పాల్గొన్నారని దేవస్థాన ప్రధాన కార్యదర్శి మహాబలేశ్ సజ్జనార్ తెలిపారు.



# ఏఐ బిగ్ డేటా అనలిటిక్స్‌పై అవగాహన సదస్సు

నంద్యాల ప్రతినిధి. జూలై 28. (నంది పత్రిక ):శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాల (స్వయంప్రతిపత్తి), నంద్యాలలోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (డేటా సైన్స్) విభాగం ఆధ్వర్యంలో ఏఐ బిగ్ డట అనలిటిక్స్: ఇండస్ట్రీ పర్స్పెక్టివ్" అంశంపై ఒకరోజు సదస్సు ఘనంగా నిర్వహించారు.సీఎస్ఈ (డేటా సైన్స్) విభాగాధిపతి డా. ఎన్. రమాదేవి మాట్లాడుతూ, "నేటి సాంకేతిక యుగంలో విద్యార్థులు తరగతి గది పరిజ్ఞానానికే పరిమితం కాకుండా పరిశ్రమ అవసరాలను అర్థం చేసుకొని, ఏఐ బిగ్ డట అనలిటిక్స్: ఇండస్ట్రీ మెషిన్ లెర్నింగ్ వంటి ఆధునిక సాంకేతిక రంగాల్లో నైపుణ్యాలను పెంపొందించుకోవాలి. ఇలాంటి పరిశ్రమ ఆధారిత సదస్సులు విద్యార్థులకు వాస్తవ పరిశ్రమ వాతావరణంపై అవగాహన కల్పించడంతో పాటు ఉపాధి అవకాశాలకు సిద్ధం చేస్తాయి.విద్యార్థులు పరిశోధనా దృక్పథం, ఆవిష్కరణాత్మక ఆలోచన మరియు నిరంతర అభ్యాసాన్ని అలవర్చుకొని భవిష్యత్తులో విజయవంతమైన నిపుణులుగా ఎదగాలని" సూచించారు.కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం.వి. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, "కృత్రిమ మేధస్సు మరియు బిగ్ డేటా అనలిటిక్స్ వంటి సాంకేతిక రంగాలు ప్రపంచవ్యాప్తంగా పరిశ్రమల అభివృద్ధికి కీలకంగా మారాయి. విద్యార్థులు ఈ రంగాల్లో నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మెరుగైన ఉద్యోగ అవకాశాలను పొందగలరు. శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులను పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు పరిశ్రమ నిపుణులతో కలిసి ఇటువంటి నాణ్యమైన కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వనరుల వ్యక్తి శ్రీ ఒబులయ్య కి, సీఎస్ఈ (డేటా సైన్స్) విభాగానికి మరియు అధ్యాపకులకు నా అభినందనలు" అని తెలిపారు.ఒబులయ్య, సీఈఓ, శ్రీవేద సొల్యూషన్స్ ఇండియా లిమిటెడ్ మాట్లాడుతూ, "ఏఐ బిగ్ డట అనలిటిక్స్: ఇండస్ట్రీ




పర్స్పెక్టివ్ రంగాలు భవిష్యత్ పరిశ్రమలను నిర్దేశించే ప్రధాన సాంకేతిక శక్తులుగా మారాయి. పరిశ్రమలు కేవలం విద్యార్హతలను మాత్రమే కాకుండా సమస్యలను విశ్లేషించే సామర్థ్యం, డేటా ఆధారిత నిర్ణయాలు తీసుకునే నైపుణ్యం, కమ్యూనికేషన్ స్కిల్స్ మరియు సృజనాత్మక ఆలోచన కలిగిన అభ్యర్థులను కోరుకుంటున్నాయి. విద్యార్థులు సర్టిఫికేషన్లు, ప్రత్యక్ష ప్రాజెక్టులు, ఇంటర్న్‌షిప్‌లు మరియు నిరంతర అభ్యాసం ద్వారా తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటే ప్రపంచవ్యాప్తంగా ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోగలరు.స్పష్టమైన లక్ష్యం, క్రమశిక్షణ మరియు నిరంతర కృషితో ప్రతి విద్యార్థి తన కెరీర్‌లో అత్యున్నత స్థానాన్ని చేరుకోవచ్చు" అని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో సీఎస్ఈ (డేటా సైన్స్) విభాగానికి చెందిన అధ్యాపకులందరూ పాల్గొన్నారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై సదస్సును ఆసక్తిగా వీక్షించి, పరిశ్రమ నిపుణులతో ప్రత్యక్షంగా మమేకమై తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కళాశాల యాజమాన్యానికి, వనరుల వ్యక్తి ఒబులయ్య కి, విభాగాధిపతి డా. ఎన్. రమాదేవికి, అధ్యాపకులకు మరియు విద్యార్థులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రకృతి వ్యవసాయ పద్ధతులే రైతుకు లాభసాటి.. ఏవో




చాగలమర్రి జూలై 28 నంది పత్రిక ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, సమగ్ర పంటల యాజమాన్య పద్ధతిలో పంటలు సాగు చేయడం వలన నేల ఆరోగ్యంగా ఉంటుందని, అలాగే రైతుకు దిగుబడి లాభసాటిగా ఉంటుందని మండల వ్యవసాయ శాఖ అధికారి రంగ నేతాజీ అన్నారు. మండలంలోని మద్దూరు గ్రామంలో ఏవో రంగ నేతాజీ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్షేత్రస్థాయిలో రైతులకు వ్యవసాయ పద్ధతుల గురించి అవగాహన కల్పించి పలు సూచనలు ఇచ్చారు. ఆధునిక వ్యవసాయ రంగంలో రైతులు కేవలం రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడటం, అధిక పెట్టుబడి వలన నష్టపోతారన్నారు. రైతులందరూ తప్పనిసరిగా ఆరుతడి పంటలను సాగు చేసి పంట బీమా చేసుకోవాలన్నారు. జూలై 31 చివరి తారీకు లోపు బీమా దరఖాస్తు చేసి సద్వినియం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రేవతి, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

# గుండెపోటుతో విశ్రాంత హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ మృతి

మర్రిపాడు జులై 28నంది పత్రిక : మర్రిపాడు,చుంచులూరు సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో దాదాపు 30 సంవత్సరాలకు పైగా సేవలందించిన పడమటి నాయుడుపల్లి గ్రామానికి చెందిన విశ్రాంత హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ చీర్ల రామకృష్ణారెడ్డి సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు.ఆరు నెలల క్రితం అమెరికాలో నివసిస్తున్న తన కుమార్తె వద్దకు వెళ్లిన రామకృష్ణారెడ్డి,తిరుగు ప్రయాణంలో సోమవారం ఉదయం బెంగళూరులో విమానం దిగారు.అనంతరం చుంచులూరుకు తిరిగి వస్తూ,తిరుపతిలో నివసిస్తున్న తన కుమారుడి ఇంటికి వెళ్లారు.అక్కడ అకస్మాత్తుగా



అస్వస్థతకు గురై గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.రామకృష్ణారెడ్డి మృతి విషయం తెలుసుకున్న బంధుమిత్రులు,శ్రేయోభిలాషులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.వారి మృతితో పడమటి నాయుడుపల్లి,చుంచులూరు గ్రామాలలో విషాదఛాయలు అలుముకున్నాయి.సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో మూడు దశాబ్దాలకు పైగా సేవలందించిన ఆయన సేవలను పలువురు స్మరించుకున్నారు.ఆయన మృతి పట్ల కుటుంబ సభ్యులకు పలువురు సానుభూతి తెలియజేశారు.

# అవగాహన ఒప్పందం (ఎంవోయు)

నంద్యాల ప్రతినిధి. జూలై 28. (నంది పత్రిక ):శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాల (స్వయంప్రతిపత్తి), నంద్యాల మరియు శ్రీవేద సొల్యూషన్స్ ఇండియా లిమిటెడ్ మధ్య విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమ ఆధారిత శిక్షణ, ఇంటర్న్‌షిప్‌లు, పరిశ్రమ ప్రాజెక్టులు, సర్టిఫికేషన్ కార్యక్రమాలు మరియు ఉపాధి అవకాశాలను విస్తరించేందుకు అవగాహన ఒప్పందం కుదిరింది.ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , బిగ్ డేటా అనలిటిక్స్, డేటా సైన్స్, మెషిన్ లెర్నింగ్, క్లౌడ్ టెక్నాలజీ వంటి ఆధునిక సాంకేతిక రంగాల్లో పరిశ్రమ నిపుణుల ద్వారా శిక్షణ, వర్క్‌షాప్‌లు, ఇంటర్న్‌షిప్‌లు మరియు ప్రత్యక్ష ప్రాజెక్టులలో పాల్గొనే అవకాశం లభించనుంది.సీఎస్ఈ (డేటా సైన్స్) విభాగాధిపతి డా. ఎన్. రమాదేవి మాట్లాడుతూ, "శ్రీవేద సొల్యూషన్స్ ఇండియా లిమిటెడ్‌తో కుదిరిన ఈ అవగాహన ఒప్పందం విద్యార్థులకు పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునే మంచి అవకాశాన్ని కల్పిస్తుంది. పరిశ్రమ-విద్యాసంస్థల అనుసంధానం ద్వారా విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై ప్రాయోగిక అనుభవాన్ని పొందడంతో పాటు భవిష్యత్తులో మెరుగైన కెరీర్ అవకాశాలను అందిపుచ్చుకోగలరు" అని తెలిపారు.కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం.వి. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, "విద్యార్థులకు ప్రపంచ స్థాయి పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన విద్యను అందించాలనే లక్ష్యంతో కళాశాల వివిధ ప్రముఖ సంస్థలతో భాగస్వామ్యాలు ఏర్పరుస్తోంది. శ్రీవేద సొల్యూషన్స్ ఇండియా లిమిటెడ్‌తో కుదిరిన ఈ అవగాహన ఒప్పందం ద్వారా విద్యార్థులు సాంకేతికంగా మరింత బలోపేతం కావడంతో పాటు ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకునే అవకాశం పొందుతారు. భవిష్యత్తులో కూడా ఇటువంటి పరిశ్రమ



భాగస్వామ్యాలను విస్తరించి విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తాము" అని పేర్కొన్నారు.శ్రీవేద సొల్యూషన్స్ ఇండియా లిమిటెడ్ సీఈఓ శ్రీ ఒబులయ్య మాట్లాడుతూ, "విద్యాసంస్థలు మరియు పరిశ్రమలు కలిసి పనిచేసినప్పుడే పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాలు కలిగిన యువతను తయారు చేయడం సాధ్యమవుతుంది.

ఈ అవగాహన ఒప్పందం ద్వారా విద్యార్థులకు పరిశ్రమ ప్రమాణాలకు అనుగుణంగా శిక్షణ, ఇంటర్న్‌షిప్‌లు, మెంటరింగ్, ప్రత్యక్ష ప్రాజెక్టులు మరియు కెరీర్ మార్గదర్శకత్వాన్ని అందించేందుకు మా సంస్థ కట్టుబడి ఉంది. విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని తమ భవిష్యత్తును ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని" అన్నారు.ఈ కార్యక్రమంలో సీఎస్ఈ (డేటా సైన్స్) విభాగానికి చెందిన అధ్యాపకులందరూ పాల్గొన్నారు. కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు మరియు శ్రీవేద సొల్యూషన్స్ ఇండియా లిమిటెడ్ ప్రతినిధుల సమక్షంలో అవగాహన ఒప్పంద పత్రాలపై సంతకాలు జరిగాయి. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు పరిశ్రమ అనుసంధానిత శిక్షణ, నైపుణ్యాభివృద్ధి మరియు ఉపాధి అవకాశాలు మరింత విస్తరించనున్నాయని నిర్వాహకులు తెలిపారు.

# సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగాల రెగ్యులరైజేషన్ కోసం జూలై 30 చలో కలెక్టరేట్ జయప్రదం చేయండి.

బద్వేల్, జులై 28 (నంది పత్రిక)బద్వేల్ పట్టణంలోనిస్థానిక పాత మున్సిపల్ కార్యాలయం నందు 28/7/26 న బద్వేల్ మున్సిపల్ వర్కర్స్ ఏఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ ఉద్యోగ- కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న చలో కలెక్టరేట్ ధర్నా కార్యక్రమంలో పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొనాలని కార్మికులతో గేట్ మీటింగ్ నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు కాలువ నాగేంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖలు, షెడ్యూల్ ఎంప్లాయిమెంట్ పరిశ్రమలలో పనిచేస్తున్న లక్షలాదిమంది కాంట్రాక్టు- ఔట్సోర్సింగ్ కార్మికులకు సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పుల మేరకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, శాశ్వత స్వభావం గల విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని, కనీస వేతనాలు అమలు చేయాలని, ప్రైవేటీకరణ విధానాలను విరమించుకోవాలని, కార్మిక చట్టాల మార్పును ఉపసంహరించుకోవాలని, కార్మికుల సంఖ్యను పెంచాలని, చనిపోయిన కార్మికుల కుటుంబాలలో ఒకరికి ఉపాధి అవకాశం కల్పించాలని, పనిముట్లు రక్షణ పరికరాలు అందించాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని రాష్ట్రవ్యాప్తంగా జూలై 30వ తేదీ నాడు అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద జరుగుతున్న ధర్నా కార్యక్రమంలో పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు నాగరపు సత్యరాజు, ఉపాధ్యక్షురాలు దియ్యాల దేవమ్మ, కమిటీ సభ్యులు ఇండ్ల చంద్రశేఖర్ పలువురు కార్మికులు పాల్గొన్నారు.



# మోడల్ స్కూల్ లో ఘనంగా స్కౌట్ అండ్ గైడ్ ఇన్వెస్టిచర్ కార్యక్రమం




మర్రిపాడు జులై 28నంది పత్రిక : నందవరం మోడల్ స్కూల్ లో స్కౌట్ అండ్ గైడ్ అధికారిక బాధ్యతల స్వీకార వేడుక కార్యక్రమాన్ని ఎంతో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా స్కౌట్ అండ్ గైడ్ విద్యార్థులకు ప్రవేశ్ సర్టిఫికెట్లు,మెడల్స్‌ను అందజేశారు.ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పోలూరు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రమశిక్షణ,సేవాభావం,నాయకత్వ లక్షణాలు,దేశభక్తి,సమాజ సేవ పట్ల బాధ్యతను పెంపొందించడంలో స్కౌట్ అండ్ గైడ్ కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు.విద్యార్థులు చదువుతో పాటు సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని,ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నెల్సన్ కిషోర్,స్కౌట్ మాస్టర్ రఘు క్రాంతి కుమార్,గైడ్ కెప్టెన్ ప్రసన్నకుమారి,అధ్యాపకులు శివకుమార్,రవికుమార్,ఇతర ఉపాధ్యాయులు,ఉపాధ్యాయేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# యూత్ రెడ్ క్రాస్ ను బలోపేతం చేసేందుకు సహకరించాలి

నంద్యాల ప్రతినిధి. జూలై 28 . (నంది పత్రిక ):జిల్లాకు నూతనంగా వచ్చిన జాయింట్ కలెక్టర్ ని మర్యాదపూర్వకంగా కలిసిన రెడ్ క్రాస్ బృందము .ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ రెడ్ క్రాస్ వారితో మాట్లాడుతూనంద్యాల జిల్లాలో జూనియర్ యూత్ రెడ్ క్రాస్ ను బలోపేతం చేసి తద్వారా విద్యార్థి దశ నుండే ఫస్ట్ ఎయిడ్/సిపిఆర్, రక్త



దానము, పర్యావరణ పరిరక్షణ, డిజాస్టర్ మేనేజ్మెంట్ తదితర అంశాలపైవిద్యార్థులకు,యువతకు శిక్షణ ఇచ్చి నంద్యాల జిల్లాలో ప్రజలకు ఉపయోగపడే విధంగా సంస్థను తీర్చిదిద్దడమే తమ ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని రెడ్ క్రాస్ వారికి జాయింట్ కలెక్టర్ తెలిపారు.ఈ సందర్భంగా జిల్లాలో ఉండే ప్రతి ఒక్క విద్యా సంస్థ యువజన సంస్థలు సంఘాలు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి జిల్లాలో జూనియర్ యూత్ రెడ్ క్రాస్ బలోపేతానికి సహకరించాలని కోరారు.పై అంశాలపై ఎవరు కోరిన ఆఫ్లైన్లో ఆన్లైన్లో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తామని ప్రతి ఒక్కరూ రెడ్ క్రాస్ వాలంటీర్ గా చేరాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల, జిల్లా జనరల్ సెక్రెటరీ మరియు జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి శ్రీకాంత్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఉస్మాన్ బాషా, రెడ్ క్రాస్ జిల్లా డిఎఫ్ఓ అబ్దుల్లా తదితరులు పాల్గొని జెసి కి మొక్కను పంపిణీ చేసి దుశ్శలువతో సత్కరించారు జిల్లాలో రెడ్ క్రాస్ కు సంబంధించిన పత్రాలను అందించారు, వాటి గురించి వివరించారు.

# 11వేల పోస్టులతో మెగా పోలీస్ నోటిఫికేషన్ విడుదల చేయాలి-డివైఎఫ్ఐ - ఎస్ఎఫ్ఐ

## పోస్టులు పెంచకపోతే జూలై 30వ తేదీ చలో విజయవాడ

నంద్యాల ప్రతినిధి. జూలై 28 . (నంది పత్రిక ):రాష్ట్రంలో పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని స్థానిక నంద్యాల పట్టణంలో ఉన్న బొమ్మల సత్రం దగ్గర అంబేద్కర్ విగ్రహం ఎదుట కానిస్టేబుల్ అభ్యర్థులతో కలిసి 2500 పోస్టులు వద్దు పదివేల పోస్టులే ముద్దు అంటూ మెగా పోలీస్ నోటిఫికేషన్ ఇవ్వాలని కోరుతూ స్థానిక నంద్యాల పట్టణంలో ఉన్న బొమ్మల సత్రం దగ్గర అంబేద్కర్ విగ్రహం ఎదుట నిలబడి ధర్నా చేయడం జరిగిందని డివైఎఫ్ఐ నంద్యాల పట్టణ కార్యదర్శి శివ ఎస్ఎఫ్ఐ నాయకులు రాజా తెలిపారు.ఈ సందర్భంగా డివైఎఫ్ఐ నంద్యాల పట్టణ కార్యదర్శి శివ మాట్లాడుతూ ఎన్నికల ముందు నారా లోకేష్ రాష్ట్రమంతా తిరిగి అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలో ఖాళీ పోస్టులన్నింటికీ నోటిఫికేషన్లు ఇస్తామని హామీ ఇచ్చారు.అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం మొదటి అసెంబ్లీ సమావేశాల్లోనే హోం శాఖ మంత్రి 20వేల పోలీస్ కానిస్టేబుల్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపి. తీరా వెబ్ నూట్ రిలీజ్ చేసినప్పుడు 11638 పోస్టులు ఉన్నట్లు విడుదల చేశారు. రెండు సంవత్సరాల తర్వాత విడుదల చేసిన జాబ్ క్యాలెండర్ 2388 పోస్టులు మాత్రమే చూపించారు. దీంతో నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఒక మాట ఎన్నికల తర్వాత మరో మాట చెప్పినట్లు అయిందని తెలిపారు. నారా లోకేష్ కి ఎన్నికల ముందు నిరుద్యోగులు, రాష్ట్రంలో ఖాళీ పోస్టులు, నిరుద్యోగ భృతి బాగా గుర్తు ఉంది అధికారంలోకి వచ్చాక ఇవన్నీ మరిచిపోయారని ఆరోపించారు. తక్షణమే 11638 పోస్టులకు మెగా పోలీస్ నోటిఫికేషన్ విడుదల చేయాలని లేనిపక్షంలో జూలై 30వ తేదీ ఛలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. నిరుద్యోగులకు నారా లోకేష్, చంద్రబాబు నాయుడు పవన్ కళ్యాణ్ ఎన్నికల ముందు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని హెచ్చరించారు. లేనిపక్షంలో జెన్ జి ఆందోళన రాష్ట్రానికి తాకే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ అభ్యర్థులు మరియు డివైఎఫ్ఐ ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.



# మహానంది దేవస్థానంకు శివ కుటుంబం చిత్రపటం విరాళం



**మహానంది జూలై 28 (నంది పత్రిక):-** మహానంది దేవస్థానంకు లక్షకు పైగా విలువచేసే శివ కుటుంబం చిత్రపటాన్ని భక్తులు మంగళవారం అందజేశారు. తిరుపతికి చెందిన శంకర్ నాయుడు, లావణ్య పిక్చర్ ఫ్రేమ్స్ వారు సుమారు రూ.1,00,000 పైగా విలువచేసే శివ కుటుంబం ఫోటోను విరాళంగా అందజేసినట్లు టెంపుల్ ఇన్స్పెక్టర్ నాగమల్లయ్య తెలిపారు. దాతలను అభినందించి, స్వామివారి ప్రసాదాలను అందజేశారు

# ఆరుతడి పంటలను వేసుకోవాలి

### ఈనెల 31వ లోగా పంట బీమా చేసుకోవాలి : ఏవో నాగేశ్వర్ రెడ్డి



**మహానంది జూలై 28 ) నంది పత్రిక):-** ఎల్నినో ప్రభావం నేపథ్యంలో రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి.నాగేశ్వర రెడ్డి సూచించారు. మంగళవారం మహానంది మండలంలోని నందిపల్లె, మసీదుపురం గ్రామాల్లో పొలం పిలోస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ..ప్రస్తుతం సూపర్ ఎల్నినో ప్రభావం నేపథ్యంలో వర్షా బావ పరిస్థితులు ఉన్నాయని, ఆగస్టు, సెప్టెంబర్ మాసాలలో ఈ ప్రభావం చాలా అధికంగా ఉంటుందన్నారు.ఖరీఫ్ సీజన్లో వరి పంట వేయరాదని తెలిపారు.వరికి ప్రత్యామ్నాయంగా మినుము, పెసర, ఆముదం, నువ్వులు, కొర్ర, సజ్జ లాంటి ఆరుతడి పంటలను వేసుకోవాలన్నారు. మొక్కజొన్న, మినుము, అరటి పంటలు వేసిన రైతులు ఈనెల 31వ లోగా పంట బీమా చేయించుకోవాలని, వరి పంట వేసిన రైతులు ఆగస్టు 15వ లోగా పంట బీమా చేయించుకోవాలని తెలిపారు. రైతులు వేసిన పంటలను సంబంధిత రైతు సేవ కేంద్ర సిబ్బందిని కలిసి వెంటనే పంట నమోదు చేయించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ అధికారులు చంద్రశేఖర్, భారతి, రైతులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ స్వీట్స్ కార్పొరేషన్ చైర్మన్ ను మర్యాదపూర్వకంగా కలిసిన చైర్మన్ రేచర్ల నాగేంద్ర.



**శిరివెళ్ల ::,, (నంది పత్రిక )** ఆంధ్రప్రదేశ్ స్వీట్స్ కార్పొరేషన్ చైర్మన్, మహారాష్ట్ర ఔరంగాబాద్ కలెక్టర్ డి.స్వామి ని నంద్యాలలోని గెస్ట్ హౌస్ లో నంద్యాల బిఒంగోలు జాతీయ రహదారిలో ఆహ్లాదాన్ని పంచే పచ్చని చెట్ల మధ్య వెలసిన సర్వ నరసింహ స్వామి ఆలయ చైర్మన్ రేచర్ల నాగేంద్ర, సిబ్బంది చిన్న మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఏపీ స్వీట్స్ కార్పొరేషన్ చైర్మన్ డి స్వామిని మర్యాదపూర్వకంగా శు భాకాంక్షలు తెలియజేస్తూ, పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సన్మానించారు. ఆలయ అభివృద్ధి పనుల గురించి మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా అభివృద్ధి పనులు మధ్యలోనే ఆగిపోయాయని ధ్వజస్తంభం తదితర ప్రధానమైనటువంటి కొన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాలు, దేవాదాయ పరిసరాలు, పారిశు ధ్యం, త్రాగునీరు, వంటివి అభివృద్ధికి నేర్చుకోవడం లేదని ఆయన తెలిపారు. ఆగిపోయిన అభివృద్ధి పనులు తిరిగి ప్రారంభించేలా తగిన చర్యలు తీసుకోవాలని, మీ సహకారం ఎల్లప్పుడూ ఉండాలని ఆయన కోరారు.

# సమయపాలన పాటించాలి

### - తహసిల్దార్ ఉమారాణి



**కొత్తపల్లి - నంది పత్రిక :** గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న సచివాలయాల ఉద్యోగులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని తహసిల్దార్ ఉమారాణి సూచించారు గురువారం మండలంలోని ఎదురుపాడు, ముసలిమడుగు, పెద్ద గుమ్మనాపురం ,కొక్కెరించ గ్రామ సచివాలయాలను సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది తప్పక సమయపాలన పాటించాలన్నారు ప్రజల నుంచి వచ్చే సమస్యలు, వినతులు మరియు దరఖాస్తులను సకాలంలో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అలాగే సచివాలయ సిబ్బంది సమయపాలన పాటిస్తున్నారా లేదా అని ప్రజలకు అందుబాటులో ఉన్నారా అనే విషయాలను పరిశీలించడం జరిగింది. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఇబ్బందికి సూచించారు



# ఉత్సవ మూర్తికి అభిషేకం అలంకరణలు

**బనగానపల్లె జులై 28నందిపత్రిక** శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానం నందవరంలో కొనసాగుతున్న అమ్మవారి శాఖంబరి ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు మంగళవారం అమ్మవారి మూల మూర్తికి పండ్లతో అలంకరణ మరియు గణపతి హోమం, అగ్ని ప్రతిష్టాపన,ఉత్సవ మూర్తికి విశేష అభిషేకం,సప్తశతి పారాయణ, అవాహిత దేవత పూజలు, సాయంత్రం దీక్ష హోమం, మూల మంత్ర హోమములు, పల్లకి సేవ, సహస్ర నామార్చన నిర్వహించడం జరిగినది.శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానం నందు మూడు రోజులు జరుపు శాకాంబరీ ఉత్సవములలో భాగముగా రెండవ రోజు అమ్మవారి మూల మూర్తి కి విశేష పూజలు నిర్వహించినట్లు అర్చకులు తెలిపారు.



# పొలం పిలుస్తుంది కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సరిత,,





**ఎమ్మిగనూరు నంది పత్రిక జులై 28** ఎల్‌నినో ప్రభావంతో తగ్గిన వర్షాలు వరి సాగును తగ్గించి ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మొగ్గు చూపాలినందవరం మండలంలో వివిధ గ్రామంలో నదికైరవాడి మరియు పెద్దకొత్తిలి గ్రామాలలో "పొలం పిలుస్తోంది" కార్యక్రమం నిర్వహించిన మండల వ్యవసాయ అధికారి. నదికైరవాడి మరియు పెద్దకొత్తిలి గ్రామాలలో "పొలం పిలుస్తోంది" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి ఎం ఏ ఓ సరిత గ్రామంలోని పత్తి మరియు వరి పొలాలను క్షేత్రస్థాయిలో సందర్శించి పంటల పరిస్థితిని పరిశీలించారు. అనంతరం రైతులతో సమావేశమై ప్రస్తుత వర్షాభావ పరిస్థితులపై అవగాహన కల్పిస్తూ పలు కీలక సూచనలు చేశారు.ఈ ఏడాది ఎల్‌నినో (జుశ్రీ చీతేశీ) ప్రభావం కారణంగా వర్షపాతం సాధారణం కంటే చాలా తక్కువగా నమోదైందని తెలిపారు. అలాగే జలాశయాల్లో తగినంత నీటి నిల్వలు లేకపోవడంతో వరి సాగును వీలైనంత వరకు తగ్గించాలని, అధిక నీటి అవసరమున్న పంటలకు బదులుగా తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని రైతులకు సూచించారు.

1.వరి సాగును తగ్గించి తక్కువ నీటితో పండే కందులు, పెసర్లు, మినుములు, సజ్జలు, కొర్రలు, మొక్కజొన్న, ఆముదం వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలి.

2.ప్రధాన పంటల్లో అంతర పంటలుగా పప్పుధాన్యాలను సాగు చేయడం ద్వారా వర్షాభావ పరిస్థితుల్లో నష్టాలను తగ్గించుకోవచ్చు.

3.అందుబాటులో ఉన్న నీటిని డ్రిప్ మరియు స్ప్రింక్లర్ పద్ధతుల ద్వారా పొదుపుగా వినియోగించాలి.

4.నిర్ణీత గడువులోగా ప్రతి రైతు వేసిన పంటలకు పంట బీమా చేయించుకోవాలి ,దీని ద్వారా భవిష్యత్తులో పంటలు నష్టపోయిన రైతులు పంట నష్టపరిహారం పొందగలరు .బీమా కొరకు జూలై 31 వరకు సమయం ఉంది వరికి ఆగస్టు 15 వరకు ఉంది.

5.వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు అందించే సాంకేతిక సూచనలు, వాతావరణ ఆధారిత సలహాలను ఎప్పటికప్పుడు పాటించాలి.

6. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు పంట మార్పిడి విధానాన్ని అవలంబించి ఆర్థిక నష్టాలను నివారించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి (హీూా) శ్రీమతి సరిత, గ్రామ వ్యవసాయ సహాయకులు (వాూాలు) డి. చంద్రశేఖర్, యం.రాఘవేంద్ర, రైతులు మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

## పోరుమామిళ్లలో ఫుట్‌పాత్‌లు మాయం: డ్రైనేజీలపై అక్రమ కట్టడాలు.

# చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు!

### 1200 మీటర్ల మెయిన్ రోడ్డుపై నరకప్రాయమైన ప్రజా ప్రయాణం అధికారుల 'ముడుపుల' వేటలోనే అనుమతులు ఇచ్చారా? టౌన్ ప్రజల్లో పెల్లుబుకుతున్న ఆగ్రహం నేషనల్ హ్యూమన్ రైట్స్ వైస్ ప్రెసిడెంట్ 'కవలకుంట్ల మధు బాబు' తీవ్ర ఆగ్రహం.పై అధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరిక!

**పోరుమామిళ్ల, జూలై 28 (నంది పత్రిక)**కడప జిల్లాలోని ప్రముఖ వ్యాపార కేంద్రంగా ఎదుగుతున్న పోరుమామిళ్ల మండల కేంద్రంలో అక్రమ కట్టడాల జోరు ప్రజా ప్రాణాల మీదకు తెస్తోంది. రంగసముద్రం మరియు పోరుమామిళ్ల మేజర్ పంచాయతీల పరిధిలోకి వచ్చే సుమారు 1200 మీటర్ల పొడవున్న ప్రధాన రహదారి (మెయిన్ రోడ్డు) ఇప్పుడు అక్రమార్కులకు కామధేనువుగా,సామాన్య ప్రజలకు యమపాశంగా మారింది. రోడ్డుకు ఇరువైపులా ఉండాల్సిన ఫుట్‌పాత్‌లు పూర్తిగా అదృశ్యమవడమే కాకుండా,కనీసం డ్రైనేజీ కాల్వలపై కూడా నడవడానికి వీల్లేకుండా దుకాణాలు, కాంక్రీట్ మెట్లు వెలిశాయంటే ఇక్కడి పాలన ఎంత లోసుగులతో సాగుతుందో అర్థం చేసుకోవచ్చు.

**నిబంధనలు తుంగలో.డ్రైనేజీలపైనే దుకాణాలు !**

నిబంధనల ప్రకారం రోడ్డుకు ఇరువైపులా పాదచారుల భద్రత కోసం ఫుట్‌పాత్‌లు నిర్మించాలి.కానీ పోరుమామిళ్ల మెయిన్ రోడ్డుపై పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంది.డ్రైనేజీ కాల్వల పైనే భారీ ఎత్తున షాపులు వెలిశాయి.వ్యాపారులు తమ దుకాణాల విస్తరణలో భాగంగా కాల్వలను కప్పివేస్తూ శాశ్వత కాంక్రీట్ మెట్లను నిర్మించారు.దీనివల్ల కాల్వలు పూడిక తీయడానికి వీల్లేకుండా పోవడమే కాక, కాలినడకన వెళ్లే సామాన్య ప్రజలు నడవడానికి అడుగు స్థలం కూడా లేకుండా పోయింది. ఫుట్‌పాత్ హక్కును కోల్పోయిన ప్రజలు విధిలేక ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని మెయిన్ రోడ్డుపైనే నడవాల్సిన దుస్థితి ఏర్పడింది.

**' ముడుపుల' మాయాజాలం.అండదండలు ఎవరికి?**

ఈ అక్రమ కట్టడాల వెనుక పంచాయతీ,రెవెన్యూ,మరియు ఆర్అండ్‌బి శాఖల అధికారుల హస్తం ఉందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.ప్రభుత్వ స్థలాలను,ప్రజా రహదారులను ఆక్రమించి వ్యాపారాలు చేసుకుంటుంటే,సంబంధిత అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారనేది మిస్టరీగా మారింది. అక్రమంగా షాపులు పెట్టడానికి, మెట్లు కట్టుకోవడానికి ఈ మూడు శాఖల అధికారులు లోపాయికారీగా భారీ ఎత్తున లంచాలు తీసుకున్నారని పోరుమామిళ్ల టౌన్ ప్రజలు బహిరంగంగానే గుసగుసలాడుకుంటున్నారు. లక్షలాది రూపాయల ముడుపులు చేతులు మారడం వల్లే అధికారులు కళ్లు మూసుకున్నారని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**తక్షణమే పై అధికారులకు ఫిర్యాదు చేస్తాం: కవలకుంట్ల మధు బాబు హెచ్చరిక!**

పోరుమామిళ్ల మెయిన్ రోడ్డుపై జరుగుతున్న ఈ దారుణమైన ఆక్రమణలను,అధికారుల నిర్లక్ష్య వైఖరిని నేషనల్ హ్యూమన్ రైట్స్ వైస్ ప్రెసిడెంట్ కవలకుంట్ల మధు బాబు తీవ్రంగా ఖండించారు.లంచాలకు ఆశపడి నిబంధనలను పక్కనబెట్టిన స్థానిక అధికారుల తీరుపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజా హక్కులను కాలరాస్తూ,సామాన్యుల ప్రాణాలను పణంగా పెడుతున్న ఈ వ్యవహారంపై తూతూమంత్రంగా చర్యలు తీసుకుంటే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు.ఈ అక్రమ కట్టడాల వెనుక ఉన్న లంచగొండి అధికారుల అసలు రంగు బయటపెడతామని,దీనిపై జిల్లా కలెక్టర్,విజిలెన్స్ అధికారులు మరియు ఆర్ అండ్ బి ఉన్నతాధికారుల వంటి పై అధికారులకు తక్షణమే రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తామని మధు బాబు హెచ్చరించారు.ప్రాథమిక హక్కు అయిన సురక్షితమైన ప్రయాణాన్ని సామాన్యులకు దూరం చేయడం మానవ హక్కుల ఉల్లంఘన కిందకే వస్తుందని, బాధ్యులైన ప్రతి ఒక్కరిపై కఠిన చర్యలు తీసుకునేలా పై అధికారులపై ఒత్తిడి తెస్తామని ఆయన స్పష్టం చేశారు.

**భారీ వాహనాల తాకిడి.స్కూల్ పిల్లల విలవిల**



ఎనకట్ట వైపు నుంచి నిత్యం వందలాది హెవీ వెహికల్స్ ఈ మెయిన్ రోడ్డు గుండా ప్రయాణిస్తుంటాయి.ఒకవైపు అతివేగంతో వచ్చే భారీ వాహనాలు,మరోవైపు నడవడానికి స్థలం లేక రోడ్డుపైనే వెళ్తున్న పాదచారులతో ఈ 1200 మీటర్ల రోడ్డు నిత్యం మృత్యుకూపంగా మారుతోంది.ఈ మెయిన్ రోడ్డు దాటాలంటేనే పాఠశాల విద్యార్థులు,చిన్న పిల్లలు విలవిలలాడిపోతున్నారు.ఉదయం,సాయంత్రం వేళల్లో ట్రాఫిక్‌ను నియంత్రించే వారు లేక,రోడ్డు దాటడానికి వీల్లేకుండా ఇరువైపులా ఆక్రమణలు ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఏ క్షణంలో ఏవచ్చి ఢీకొడుతుందోనని తల్లిదండ్రులు నిత్యం భయాందోళన చెందుతున్నారు.

**ఇప్పటికైనా స్పందించేనా.?**

డ్రైనేజీలపై ఉన్న అక్రమ దుకాణాలను,మెట్లను తక్షణమే తొలగించి పాదచారులకు ఫుట్‌పాత్‌లను అందుబాటులోకి తేవలసిన అవసరం ఎంతైనా ఉంది.ముడుపుల మత్తులో జోగుతున్న అధికారులు మేల్కొని,ఈ 1200 మీటర్ల మెయిన్ రోడ్డుపై తక్షణమే ఆపరేషన్ అక్రమణల తొలగింపు చేపట్టాలని, లేనిపక్షంలో ఉన్నతాధికారుల చర్యలతో పాటు ప్రజా హక్కుల రక్షణ కోసం పెద్ద ఎత్తున పోరాటాలు తప్పవని పట్టణ ప్రజలు మరియు నేషనల్ హ్యూమన్ రైట్స్ వైస్ ప్రెసిడెంట్ 'కవలకుంట్ల మధు బాబు హెచ్చరిస్తున్నారు.

# సర్వేలను నిర్ణిత గడువులో పూర్తి చేయాలి

### - స్వర్ణ గ్రామముల డిప్యూటీ ఎంపిడిఒ, కె.పి.ఆర్.శర్మ

**కొత్తపల్లి - నంది పత్రిక :** గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న ప్రభుత్వ సర్వేలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్వర్ణ గ్రామాల డిప్యూటీ ఎంపీడీవో కె పి శర్మ సూచించారు గురువారం మండలంలోని గువ్వలకుంట్ల గ్రామంలో ఉన్న సచివాలయాన్ని తనిఖీ చేసి ఉద్యోగుల అటెండెన్స్ రిజిస్టర్, మూమెంట్ రిజిస్టర్లను పరిశీలించారు అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ సర్వేలు మనమిత్ర ట్రైనింగ్, మరియు సిటిజన్ ఈ కేవైసీ సర్వేలను సకాలంలో పూర్తి చేయాలన్నారు అలాగే వాతావరణ వెబ్ పోర్టల్ నందు ప్రతి ఉద్యోగి రోజూ లాగిన్ అయ్యి ప్రజలకు వాతావరణ స్థితిగతులను గురించి అవగాహన కల్పించాలన్నారు వాతావరణ వెబ్ పోర్టల్ నందు లాగిన్ అయిన తర్వాతనే బయోమెట్రి క్ అటెండెన్స్ వెయ్యాలని సూచించారు అలాగే ప్రజలు స్థానిక సమస్యలపై అభిప్రాయాలు , ఫిర్యాదుల హాజరు పట్టికను ఉపయోగించాలన్నారు ( సిటిజన్ ఫీడ్ బ్యాక్) రిజిస్ట్రేషన్ గురించి ప్రజలకు తెలిపి వారి నుండి సదరు రిజిస్ట్రేషన్లో ప్రజలచే నమోదు చేయించాలన్నారు



# రెవెన్యూ సేవలపై ప్రజల్లో సానుకూల స్పందన పెంపొందేలా అధికారులు పనిచేయాలి..!



## జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

**కడప, బ్యూరో చీఫ్ జులై 28 నంది పత్రిక:** భూ సంబంధిత అర్జీలు, ఫిర్యాదులపై బాధ్యతాయుతంగా, త్వరితగతిన స్పందించినప్పుడే రెవెన్యూ సమస్యలకు సమర్థవంతమైన పరిష్కారం సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని బోర్డు సమావేశ మందిరంలో భూ సంబంధిత రెవెన్యూ సమస్యలు, ప్రభుత్వ సేవలపై ప్రజల్లో సానుకూల అభిప్రాయం పెంపొందించడం, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం తదితర అంశాలపై జాయింట్ కలెక్టర్ డా. నిధీ మీనాతో కలిసి ఆర్డీవోలు, తహశీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం తరఫున చేపట్టే ప్రతి పని ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసాన్ని, సానుకూల అభిప్రాయాన్ని పెంపొందించేలా ఉండాలని పేర్కొన్నారు. రెవెన్యూ శాఖలో పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులు, సమస్యలు, అభ్యంతరాలను ఆగస్టు 15వ తేదీలోపు పూర్తిస్థాయిలో పరిష్కరించి పెండెన్సీని "సున్నా" స్థాయికి తీసుకురావాలని ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా.. పెండింగ్ లోవున్న అన్ని రెవెన్యూ సమస్యలను పరిష్కరించి పట్టాదారు పసుపుస్తకాలను పంపిణీ చేయాలన్నారు. మండల స్థాయిలో ప్రతి వారం, జిల్లా స్థాయిలో ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్షలు నిర్వహిస్తూ అందిన ప్రతి సమస్యకు పరిష్కారాన్ని అందించాలని తెలిపారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటూ వర్చువల్ గవర్నెన్స్ విధానాన్ని సమర్థంగా అమలు చేయాలని, క్షేత్రస్థాయి పర్యటనలకు ముందస్తు ప్రణాళికతో వెళ్లడంతో పాటు అవసరమైన చోట ఆకస్మిక తనిఖీలు నిర్వహించి మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. సమీక్ష సమావేశంలో రెవెన్యూ డివిజన్, మండల స్థాయిలో పెండింగ్‌లో ఉన్న బల్క్ ఇష్యూల పరిష్కారం, సెక్షన్ 22-ఏకు సంబంధించిన అన్ని దరఖాస్తులను సకాలంలో పరిష్కరించడం, పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ, మ్యుటేషన్ ప్రక్రియను వేగవంతం చేయడం, అలాగే ప్రభుత్వ సేవలపై ప్రజల్లో సానుకూల అభిప్రాయం (పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్) పెంపొందించే మూడు కీలక పనితీరు ప్రమాణాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో రాజంపేట సబ్ కలెక్టర్ హెచ్.ఎస్. భావన, ఎస్డీసి వెంకటపతి, కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్డీవోలు మురళి, శిరీష, చంద్రమోహన్, చిన్నయ్య, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ వేణుగోపాల్, అన్ని మండలాల తహశీల్దార్లు, సంబంధిత రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



# విద్యార్థులు క్రమ శిక్షణతో మెలగాలి



**కొత్తపల్లి - నంది పత్రిక :** ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించే ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో మెలగాలని ఎంపీటీసీ సోమల స్రవంతి అన్నారు. మంగళవారం గువ్వలకుంట్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు పాఠశాల అభివృద్ధికోసం ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ప్రతి విద్యార్థి క్రమ శిక్షణతో నడుచుకొని విద్యను అభ్యసించాలన్నారు. ఉపాధ్యాయులుకూడా ఆర్థవంతంగా విద్యను బోధించాలని చెప్పారు. పాఠశాల అభివృద్ధికి తాము ఎప్పుడు తోడుఉంటామన్నారు. అందులో భాగంగానే పాఠశాల అభివృద్ధికోసం రూ.5వేలు డోనేషన్ ఇచ్చామన్నారు. అదేవిధంగా పాఠశాలలో నీటి సౌకర్యంకోసం జెడ్పిటీసీ సోమల సుధాకర్ రెడ్డి తన సొంత ఖర్చులతో నీటి సౌకర్యకం కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉశేనయ్య, ఉపాధ్యాయ బృందం, వైఎస్సార్సీపీ నాయకుడు సోమల రవీంద్రారెడ్డి, పాల్గొన్నారు.

# కోడుమూరు నియోజకవర్గ కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం

## జనసేన పార్టీ నాయకులు సంధ్య విక్రమ్ కుమార్



**కర్నూల్ సిటీ నందిపత్రిక** మంగళవారం క్యాంపు కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికలే ఎజెండగా ముఖ్య జనసేన పార్టీ బెళగల్ గూడూరు కోడుమూరు కర్నూలు నాలుగు మండలాల నాయకులతో ఆత్మీయంగా సమావేశం అయిన కోడుమూరు నియోజవర్గ జనసేన నాయకులు సంధ్యా విక్రమ్ కుమార్ అనంతతరం సంధ్యా విక్రమ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మంచి జరుగుతున్న అభివృద్ధి ప్రతి అభ్యర్థి ని గెలిపిస్తుంది అని అన్నారు మనం కూడా ఈరోజు గ్రామభివృద్ధి కోసం పవన్ కళ్యాణ్ చూపుతున్న చొరవ చేస్తున్న అభివృద్ధి పనులను గ్రామాల్లో ప్రతి ఇంటికి చేరువ చేదాం అని కూటమి లో కేటాయించే స్థానలము 100 పెర్సెంట్ స్ట్రైక్ రేట్ తో పవన్ సార్ కి కానుక ఇద్దాము అని కర్నూలు జిల్లా ఉమ్మడి జనసేన పార్టీ అధ్యేక్షులు చింతా సురేష్ ఆధ్వర్యంలో బలంగా ముందుకు పోదాం అని అయన పిలుపునిచ్చాడు ఈ కార్యక్రమంల్ కోడుమూరు నలుమూలల నుంచి భారీగా జనసేన ముఖ్య నాయకులు మరియు జనసైనికులు పాల్గొన్నారు.

# అక్రమ మైనింగ్ ను అడ్డుకునేదెవరు...





## అక్రమణదారులకు ప్రభుత్వ పెద్దల అండ

## పలుకూరు లో ఆర్ అండ్ బి రోడ్లను త్రవ్వుతున్నా పట్టించుకోని అధికారులు

## ప్రభుత్వ ఆస్తులు దేవుడు మాన్యాలు ఆక్రమించుకుంటున్న వైనం

## అక్రమ మైనింగ్ పై మండిపడ్డ వామపక్ష ప్రజాసంఘాలు

**బనగానపల్లె జులై 28నందిపత్రిక** బనగానపల్లె మండల పరిధిలోని పలుకూరు గ్రామంలో ప్రభుత్వం అండఉన్న గ్రామ నాయకులు అక్రమ మైనింగ్ తో ప్రభుత్వ భూములు, దేవుడి మాన్యాలు ఆక్రమించుకొని వాటిని త్రవ్వుతూ నాపరాయి వెలికి తీసుతున్నా వారిని అడ్డుకునే అధికారి గాని ప్రభుత్వం గాని లేదని సిపిఐ మండల కార్యదర్శి శివయ్య ఆరోపించారు. మంగళవారం ప్రజా సంఘాల నాయకులు పలుకూరు గ్రామంలో జరుగుతున్న అక్రమ మైనింగ్ ను పరిశీలించి మాట్లాడారు. బనగానపల్లె మండలం పలుకూరు నుండి రోడ్డు అక్రమాలకుగురవుతూ నాపరాయి బాడుగుట్టలు రోడ్లు మూసుకు వచ్చేసరికి వాహనదారులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు రోడ్లు సైతం తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు ఇప్పటికే పలుకూరు ప్రాంతంలో ఉన్నటువంటి ప్రభుత్వ ఆస్తులు దేవాదాయ భూములు ఆక్రమణలకు గురి అవుతున్నాయి ఎంతోమంది ఈ భూ అక్రమాలపై పోరాడి పోరాడి అలసిపోయారు దొంగలు దొంగలు కలిసి ఊర్లు పంచుకున్నట్టు ఇవాళ కంచనే చేను మేసే విధంగా ఉంది ఎవరైతే ప్రభుత్వంలో ఉన్నారో వారు ఇలాంటి భూములను కాపాడాల్సింది ఉంది కానీ రోడ్లు సైతం తవ్వేస్తున్న ఆర్&బి అధికారులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్టు వాళ్లు ఆఫీసులకే పరిమితమై ఉన్నారు ఒకవైపు దేవాదాయ భూములు ఆక్రమణకు గురి అవుతున్నా దేవదాయ శాఖా అధికారులు మొద్దు నిద్రలో వున్నారు అక్రమ మైనింగ్ చేస్తావున్న ఏమి అనలేని పరిస్థితి లో వున్నారు మైనింగ్ అధికారులను కలిస్తే మీకు తెలుసు కదా మా పరిస్థితి అర్థం చేసుకోండి అని వారంటున్నారు ఈ పరిస్థితిని తీవ్రంగా ఖండిస్తున్నాం ప్రభుత్వ ఆస్తులను దేవాదాయస్తులను కాపాడాల్సిన బాధ్యత అధికారులు ప్రభుత్వం పైనే ఉంది ఈ విషయంపై జిల్లా అధికారులు ఈ ప్రాంతంలో పర్యటించి చర్యలు తీసుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ బనగానపల్లె మండల్ సమితిగా డిమాండ్ చేస్తా ఉన్నాం . లేనియెడల ఎర్ర జెండా పట్టుకుని ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరిస్తున్నాం ఈ కార్యక్రమం లో సిపిఐ మండల కార్యదర్శి శివయ్య సిపిఐ సీనియర్ నాయకులు సంజీవులు పలుకూరు శాఖ కార్యదర్శి బాలయ్య ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎర్రి స్వామి పాల్గొన్నారు

# డిప్యూటీ డీఈఓ పాఠశాల సందర్శన



**మద్రిపాడు జులై 28నంది పత్రిక :** మద్రిపాడు మండలం చుంచులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆత్మకూరు డివిజనల్ విద్యాశాఖ అధికారి జానకిరామ్ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అమలు చేయవలసిన వివిధ విద్యా కార్యక్రమాలపై ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులకు ప్రతిరోజూ నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలలో ఉత్తమ మార్కులు సాధించడమే లక్ష్యంగా క్రమశిక్షణ,పట్టుదలతో కష్టపడి చదవాలని సూచించారు. ప్రతిరోజూ నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకొని,ఉపాధ్యాయుల సూచనలు,సలహాలను పాటిస్తూ మంచి ఫలితాలు సాధించాలని వారికి దిశానిర్దేశం చేశారు. పాఠశాలలో విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు సమష్టి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు తిరుపతయ్య,ధనలక్ష్మి,పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయభాస్కర్,సీఎంఆర్టీ కస్తూరయ్య,పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# లోకేష్ పర్యటనకు సర్వం సిద్ధం

## కార్యకర్తల సమావేశం ఏర్పాట్లను పరిశీలించిన టీడీపీ జిల్లా అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ



**కర్నూల్ సిటీ నంది పత్రిక** రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ బుధవారం ఆదోనిలో నిర్వహించనున్న పర్యటన, కార్యకర్తల సమావేశం విజయవంతం చేసేందుకు తెలుగుదేశం పార్టీ శ్రేణులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ మంగళవారం సమావేశం వేదికను పరిశీలించి ఏర్పాట్లపై పార్టీ నాయకులు, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. సభా ప్రాంగణం, వేదిక నిర్మాణం, కార్యకర్తల కోసం కూర్చునే ఏర్పాట్లు, తాగునీరు, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలు, నాయకుల రాకపోకల ఏర్పాట్లను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు హాజరయ్యే అవకాశం ఉన్నందున ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆది కృష్ణమ్మ మాట్లాడుతూ, మంత్రి నారా లోకేష్ పర్యటన పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహాన్ని నింపనుందని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లే దిశగా ఈ సమావేశం దోహదపడుతుందని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మండల, పట్టణ, గ్రామ కమిటీల ప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ పరిశీలన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప , భాస్కర్ రెడ్డి, సౌదీ రావుఫ్, రామచంద్ర, గోపాల్ రెడ్డి, ఓంకార్ , ఎక్స్ ఎంపీపీ మురళి, రామస్వామి, వడ్డేమాన్ గోపాల్ , దేవేంద్ర, మహాదేవ, కుప్పగల హనుమంతు, రాజశేఖర్, లక్ష్మీనారాయణ,స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల ఇన్‌చార్జిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# డాక్యుమెంట్ రైటర్ల దీక్షలకు కాంగ్రెస్ పార్టీ సంఘీభావం

## డిసిసి అధ్యక్షుడు క్రాంతి నాయుడు బోయ



**కర్నూల్ సిటీ నంది పత్రిక** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ. నెం. 396 ద్వారా ప్రతిపాదించిన రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల ఏర్పాటు ప్రజా ప్రయోజనాల కంటే వేలాది మంది లైసెన్స్ పొందిన డాక్యుమెంట్ రైటర్ల జీవనోపాధిని ప్రమాదంలోకి నెట్టే చర్యగా కనిపిస్తోందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు న్యాయవాది క్రాంతి నాయుడు బోయ అభిప్రాయపడ్డారు. గత కొద్ది రోజులుగా కల్లూరు సబ్ రిజిస్టర్ ఆఫీస్ వద్ద దస్తావేజు లేఖర్లు (డాక్యుమెంట్ రైటర్లు) చేస్తున్న రిలే నిరాహార దీక్షలకు పెన్ డౌన్ కు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని క్రాంతి నాయుడు వారి దీక్ష శిబిరం నుండిమాట్లాడుతూ ప్రభుత్వం మహారాష్ట్ర నమూనాను ఆదర్శంగా చూపుతున్నప్పటికీ, అక్కడ ఈ విధానం ఇంకా అమలు దశలోనే ఉంది. అక్కడ రిజిస్ట్రేషన్ వెరిఫికేషన్, ఆధార్ లింకేజ్, రియల్ టైమ్ గవర్నెన్స్ సమస్యలు, డేటా లీకేజీ, స్టాంప్స్ అవినీతి వంటివి ఉన్నాయి అని ఇప్పటికే టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయడం జరిగింది. అలాంటప్పుడు పూర్తి స్థాయి మూల్యాంకనం జరగకముందే అదే విధానాన్ని ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేయడం ప్రజలపై ప్రయోగాలు చేయడమేననే సందేహాలను కలిగిస్తోంది. రిజిస్ట్రేషన్ వ్యవస్థను ఆధునీకరించడాన్ని కాంగ్రెస్ పార్టీ స్వాగతిస్తున్నప్పటికీ, సంస్కరణల పేరుతో ప్రజా సేవలను ప్రైవేట్ నిర్వహణ వైపు మళ్లించడం, ప్రజలపై అదనపు సేవా రుసుముల భారం పడే పరిస్థితులను సృష్టించడం, వేలాది మంది డాక్యుమెంట్ రైటర్ల ఉపాధిని అనిశ్చితిలోకి నెట్టడం ఏ విధంగానూ సమర్థనీయం కాదు. ఇప్పటికే ఉన్న సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలను బలోపేతం చేసి ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాల్సిన ప్రభుత్వం, సమాంతర వ్యవస్థను తీసుకురావడం వెనుక ఉన్న ఉద్దేశ్యాన్ని ప్రజలకు వివరించాలి. డాక్యుమెంట్ రైటర్లు, న్యాయవాదులు, సంబంధిత సంఘాలతో సంప్రదింపులు జరపకుండా ఇలాంటి కీలక నిర్ణయం తీసుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(స్త్ర) కల్పించిన వృత్తి నిర్వహణ హక్కు, వేలాది కుటుంబాల జీవనోపాధి, ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన ప్రభుత్వ సేవలపై ఈ నిర్ణయం ఎలాంటి ప్రభావం చూపుతుందో ప్రభుత్వం స్పష్టం చేయాలి. జిల్లా కాంగ్రెస్ కమిటీ తరఫున ప్రభుత్వాన్ని మేము ప్రశ్నిస్తున్నాం, వేలాది మంది డాక్యుమెంట్ రైటర్ల భవిష్యత్తుకు ఎవరు బాధ్యత వహిస్తారు? మహారాష్ట్రలో ఇంకా పూర్తిస్థాయిలో పరీక్షించని విధానాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రజలపై ఎందుకు రుద్దుతున్నారు? ఇప్పటికే ఉన్న ప్రభుత్వ రిజిస్ట్రేషన్ కార్యాలయాలను ఆధునీకరించకుండా ప్రైవేట్ నిర్వహణకు ఎందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు? అని క్రాంతి నాయుడు ప్రశ్నించారు. అనంతరం సంఘీభావం తెలిపిన కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ప్రజల ప్రయోజనాలు, పారదర్శకత, వేలాది కుటుంబాల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని జి.ఓ. నెం. 396ను వెంటనే నిలిపివేసి, డాక్యుమెంట్ రైటర్లు, న్యాయవాదులు, సంబంధిత వర్గాలతో సమగ్ర చర్చలు జరిపిన అనంతరం మాత్రమే ఏదైనా నిర్ణయం తీసుకోవాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రభుత్వాన్ని గట్టిగా డిమాండ్ చేస్తోంది. ప్రజా హక్కులు, ఉపాధి పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ప్రజలతో కలిసి నిరంతరం పోరాటం కొనసాగిస్తుంది హాజరైన కాంగ్రెస్ నాయకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎన్సి బజారన్న, రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ రజాక్, మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, డిసిసి ప్రధాన కార్యదర్శి ఈ లాజరస్, ఓబీసీ సెల్ జిల్లా మహిళా అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, ఐ ఎన్ టి యు సి సిటీ అధ్యక్షులు రేపల్లె ప్రతాప్, 48 వార్డు ఇన్చార్జి షేక్ షబ్బీర్, కాంగ్రెస్ నాయకులు రెడ్డి పోగు విజయభాస్కర్ మొదలగువారు పాల్గొన్నారు.

# కారును ఢీకొన్న టిప్పర్..



**మహానంది, జూలై 28 (నంది పత్రిక):–** మహానంది మండలం గాజులపల్లె గ్రామ సమీపంలోని డాక్టర్ శైలేంద్ర రెడ్డి గోడెం వద్ద పార్కింగ్ చేసి ఉన్న కారును టిప్పర్ ఢీకొంది. మంగళవారం నేషనల్ హైవే రోడ్డుకు మట్టి తరలిస్తుండగా నిలిపి ఉన్న కారును టిప్పర్ అతి వేగంతో ఢీ కొట్టిందని స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో టిప్పర్ డ్రైవర్ పరారయ్యారని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టామని మహానంది ఎస్ఐ ఎన్. రామ్మోహన్ రెడ్డి తెలిపారు.

# పార్కు సమస్యలు వారంలోగా పరిష్కరించకపోతే ?.

**సొంత నిధులతో అభివృద్ధి పనులు చేపడుతా.**

**బేతంచెర్ల నగర పంచాయితీ చైర్మన్ చలం రెడ్డి.**



**బేతంచెర్ల జులై 28 ( నందిపత్రిక ).** బేతంచెర్ల పట్టణంలోని నగర పంచాయతీ పార్కులో నెలకొన్న అసౌకర్యాలపై నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్. చలం రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వారంలోగా సమస్యలను పరిష్కరించక పోతే, తానే తన సొంత నిధులతో అభివృద్ధి పనులు చేపడతానని నగర పంచాయతీ అధికారులను హెచ్చరించారు. మంగళవారం వార్డు కౌన్సిలర్ ఇబ్రహీంతో కలిసి పార్కును సందర్శించిన చైర్మన్ అక్కడి పరిస్థితులను పరిశీలించి, పార్కుకు వచ్చిన ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానికుల ఫిర్యాదుల మేరకు చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఆట వస్తువులు దెబ్బతినడం, మహిళల కోసం నిర్మించిన మరుగుదొడ్లు వినియోగానికి అనుకూలంగా లేకపోవడం గమనించారు.ఈ సందర్భంగా చైర్మన్ చలం రెడ్డి మాట్లాడుతూ, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో,మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రత్యేక చొరవతో, ఈ పార్కు అభివృద్ధి చెందిందన్నారు. ప్రస్తుతం దెబ్బ తిన్న ఆట వస్తువులకు మరమ్మతులు చేసి, మరుగుదొడ్లను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకు రావాలని అధికారులను ఆదేశించారు.వారం రోజుల్లో పనులు పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, లేకపోతే తానే సొంత నిధులతో అవసరమైన అభివృద్ధి పనులు చేపడతానని చలం రెడ్డి స్పష్టం చేశారు.



# వర్షాలు కురవాలని అమ్మవార్లకు బోనాలు సమర్పణ



**మహానంది, జూలై 28 (నంది పత్రిక):-** మహానంది మండలం గాజులపల్లె గ్రామంలోని సుంకులమ్మ, దుర్గమ్మ, మారెమ్మ, పెద్దమ్మ ఆలయాల్లోని అమ్మ వార్లకు బోనాలు సమర్పించారు.మంగళవారం ఆషాడ మాసం పురస్కరించుకొని ఎస్సీ కాలనీకి చెందిన మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలు ఎత్తుకొని కుటుంబ సమేతంగా ఆలయాలకు చేరుకొన్నారు.అనంతరం అమ్మవార్లకు బోనాలు, ప్రసాదాలను సమర్పించుకున్నారు. వర్షాలు కురవాలని, పంటలు సమృద్ధిగా పండాలని వేడుకున్నారు. పూజారులు ప్రత్యేక పూజలను నిర్వహించి అమ్మవార్ల తీర్థప్రసాదాలను వితరణ చేశారు.



# ఫలాల అలంకరణలో శ్రీ కామేశ్వరి అమ్మవారు

**మహానంది జూలై 28 (నంది పత్రిక):-** మహానంది పుణ్యక్షేత్రంలో వెలసిన శ్రీ కామేశ్వరి అమ్మవారు ఆషాడ మాసం పురస్కరించుకొని శాకంబరీ ఉత్సవాలలో భాగంగా రెండవ రోజు మంగళవారం నాడు ఫలాల రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈవో శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ముందుగా అర్చకులు తెల్లవారుజామున అభిషేక అర్చన పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పండ్లతో అమ్మవారి ఆలయ ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారికి దర్శించుకుంటున్నారు.



# వైసీపీ విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని గాడిలో పెట్టాం: మంత్రి టీజీ భరత్





**కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనపై ప్రజల్లో పూర్తి సంతృప్తి**

**కర్నూలు 49వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించిన మంత్రి**

**ఓర్వకల్లులో రూ.10 వేల కోట్లకు పైగా పెట్టుబడులు: ఫలించిన కృషి**

**నంది పత్రిక కర్నూలు ప్రతినిధి** గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని దారిలో పెట్టి, అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ గుప్తా స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా ప్రజల్లో ప్రభుత్వం పట్ల పూర్తి సంతృప్తి వ్యక్తమవుతోందని ఆయన అన్నారు.మంగళవారం కర్నూలు నగరంలోని 49వ వార్డు ఎన్.ఆర్ పేటలో మంత్రి టీజీ భరత్ ఇంటింటికీ తిరిగి 'సుపరిపాలన - రెండేళ్ల ప్రగతి' ప్రచారాన్ని నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ, వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.

**రూపాయి లేకపోయినా.. ఇచ్చిన మాట తప్పలేదు**ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. "గత ప్రభుత్వ ఆర్థిక అరాచకత్వం వల్ల రాష్ట్రం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ, మేనిఫెస్టోలో ఇచ్చిన ఏ ఒక్క హామీని విస్మరించలేదు. 'తల్లికి వందనం' పథకం ద్వారా ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే అంతమందికీ ఆర్థిక సాయం అందిస్తున్నాం. ఇది పేద ప్రజలకు ఎంతో ఆసరాగా నిలిచింది" అని తెలిపారు.

**కర్నూలులో రూ.10 వేల కోట్ల పెట్టుబడులు**జిల్లా పారిశ్రామికాభివృద్ధిపై మాట్లాడిన ఆయన.. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ పార్క్‌లో ఇప్పటికే రూ.10 వేల కోట్లకు పైగా పెట్టుబడులకు సంబంధించిన పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. ప్రముఖ రిలయన్స్ సంస్థకు సంబంధించిన పనులు కూడా పూర్తయ్యాయని వెల్లడించారు. స్థానిక యువత ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లే అవసరం లేకుండా ఇక్కడే వేలాది ఉద్యోగాలు కల్పిస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు.

ప్రజలను తప్పుదోవ పట్టించడమే పనిగా పెట్టుకున్న ప్రతిపక్ష వైసీపీ నాయకుల వైఖరిని ఈ సందర్భంగా ఆయన తీవ్రంగా ఖండించారు.

**హాజరైన కూటమి ముఖ్య నాయకులు**

ఈ కార్యక్రమంలో కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఖఖణూ) చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు ఆకేపోగు ప్రభాకర్, నగర అధ్యక్షుడు కొరకంచి రవి, 49వ వార్డు ఇన్‌చార్జి కౌశిక్, కూటమి పార్టీల సీనియర్ నాయకులు, బూత్ ఇన్‌చార్జీలు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శివాలయం వద్ద డంపింగ్ యార్డా?..

## సనాతన ధర్మాన్ని అవమానిస్తే సహించేది లేదు!

**తడకనపల్లె పంచాయతీ కార్యదర్శిని వెంటనే డిస్మిస్ చేయాలి**

**అభిషేకానికి నీళ్లు లేక భక్తుల తీవ్ర అవస్థలు.. పట్టించుకోని అధికారి**

**ఎంపీడీవోకు వినతిపత్రం ఇచ్చి హెచ్చరించిన బీజేపీ, వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ నాయకులు**



**నంది పత్రిక కర్నూలు ప్రతినిధి** శివాలయం పవిత్రతను దెబ్బతీస్తూ, భక్తుల మనోభావాలతో ఆడుకుంటున్న తడకనపల్లె గ్రామ పంచాయతీ కార్యదర్శిని తక్షణమే విధుల నుంచి తొలగించాలని బీజేపీ, విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ), భజరంగ్‌దళ్ మరియు హిందూ సంఘాల నాయకులు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని సనాతన ధర్మాన్ని అవమానిస్తున్న సదరు అధికారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కల్లూరు మండల ప్రజాపరిషత్ అధికారి (ఎంపీడీవో)కి వినతిపత్రం సమర్పించారు.

**రెండు నెలలుగా అభిషేకానికీ నీళ్లు లేవు!** ఈ సందర్భంగా హిందూ సంఘాల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. తడకనపల్లెలోని పవిత్ర శివాలయం పక్కనే నిబంధనలకు విరుద్ధంగా డంపింగ్ యార్డ్‌ను ఏర్పాటు చేయడం దారుణమన్నారు. అంతేకాకుండా, ఆలయ ప్రాంగణంలో ఉన్న బోరును తొలగించి రెండు నెలలు దాటుతున్నా పంచాయతీ సెక్రెటరీ ఏమాత్రం పట్టించుకోకపోవడం ఆయన నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. ఆలయాన్ని శుభ్రం చేసుకోవడానికి, పరమశివునికి అభిషేకం చేయడానికి కూడా నీళ్లు లేక స్థానిక భక్తులు తీవ్ర అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**హిందువులను దుర్భాషలాడతారా?.. ఉపేక్షించేది లేదు!**

సమస్యను పరిష్కరించాలని కోరడానికి వెళ్లిన స్థానిక ప్రజలను సదరు కార్యదర్శి తీవ్రంగా దుర్భాషలాడుతూ, సనాతన ధర్మాన్ని హేళన చేస్తూ మాట్లాడటం క్షమించరాని నేరమని నాయకులు నిప్పులు చెరిగారు. ప్రజాసేవ చేయాల్సిన అధికారి హిందూ సమాజం పట్ల ఇంత అహంకారంతో వ్యవహరించడం వెనుక ఉన్న ఉద్దేశమేంటని ప్రశ్నించారు.

బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తూ, మత విద్వేషాలను రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్న పంచాయతీ కార్యదర్శిని వెంటనే సస్పెండ్/డిస్మిస్ చేయాలని, లేని పక్షంలో మండల వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

**కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు**

ఈ కార్యక్రమంలో తడకనపల్లె గ్రామవాసులు మహేష్, గొల్ల మధు, వినోద్, చైతన్య, కార్తీక్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు చామకూర వీరప్ప, నాయకులు బెస్త ఈరన్న, మధు గౌడ్, రవితేజ, విశ్వహిందూ పరిషత్ నాయకులు సాయి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# గడిగారేవుల గ్రామంలో ఘనంగా ప్రారంభమైన 'డోర్ టు డోర్' ప్రచారం

**నంది పత్రిక గడివేముల** గడివేముల మండలం గడిగారేవుల గ్రామంలో కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇంటింటికీ ప్రచారం (డోర్ టు డోర్)' కార్యక్రమం ఈరోజు ప్రారంభమైంది. ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి. వంగా శ్రీనివాస్ రెడ్డి.సత్యం రెడ్డి. పాణ్యం మార్కెట్ ఛైర్మెన్ అంగజాలా కృష్ణుడు.మండల కన్వీనర్ దిలీప్ రెడ్డి గారి ఆదేశాల మేరకు, టీడీపీ పార్టీ కార్యాలయం సూచనలతో గ్రామ నాయకులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి సీనియర్ నాయకుడు మరియు లిరాచమళ్ళ శ్రీనివాసులు. నగిరి వెంకటేశ్వర్లు. మిద్దె పరమేష్ నాయుడు. మిద్దె శ్రీను. మోతుకూరు శ్రీను.. నగిరి వెంకటరమణ. ఆర్. శివ శంకర్. సిద్దేం రఘు. సిద్దేం శ్రీను. ఆర్. రామకృష్ణుడు లి చురుగ్గా పాల్గొన్నారు. సిద్దేం ప్రసాద్.లికుమ్మరి కొండయ్య తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పార్టీ ఆదేశాల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని గ్రామ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో విజయవంతం చేశారు.



# నంద్యాల టౌన్ 38వ వార్డు వై.యస్.ఆర్ నగర్ లోని బేడా బుడగజంగాల కాలనీ ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియ



**నంద్యాల సిటీ బ్యూరో జులై 28 ( నంది పత్రిక )** నంద్యాల జిల్లా నంద్యాల టౌన్ పరిధిలోని 38వ వార్డు వై.యస్.ఆర్ నగర్ లోని బేడా బుడగజంగం కాలనీని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ నిన్నటి దినం సోమవారం రోజున కలెక్టరేట్ లో నిర్వహించే ప్రజా సమస్యల పరిస్కార వేదిక లో బేడా బుడగజంగం కాలనీ ప్రజలు దాదాపుగా 100 మందికి పైగా వారి కాలనీ యొక్క సమస్యను తెలియజేయడం జరిగింది . వారి యొక్క సమస్యలు నేరుగా వచ్చి పరిశీలించడం కోసమే ఈరోజు 38వ వార్డు వై.యస్.ఆర్ నగర్ లోని బేడా బుడగ జంగాల కాలనీ ని ఆకస్మికంగా సందర్శించడం జరిగింది. కాలనీ ప్రజలు తెలియజేసిన నాలుగు ముఖ్యమైన సమస్యలు అవి ఏమనగా అంగన్వాడి కేంద్రం ఏర్పాటు చేయుటకు కొంత ప్రభుత్వ భూమిని కేటాయించమని, అలాగే ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు చేయుటకు కొంత ప్రభుత్వ భూమిని కేటాయించమని,అలాగే రోడ్లు మరియు డ్రైనేజీ వంటి సమస్యలు కాలనీ ప్రజలు తెలియజేయడం జరిగినది. వారి సమస్యలు వెంటనే స్వీకరించి పలు శాఖల అధికారులకు తెలియజేసి త్వరగా కాలనీ యొక్క అన్ని సమస్యలు పూర్తి చేస్తాం అని హామీ ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఎమ్మార్వో పత్తి శ్రీనివాసులు,విద్యాశాఖ అధికారీ జనార్ధన్,ఎంఇఓ బ్రహ్మం నాయక్ ,పిడి లీలావతి,సచివాల సిబ్బంది వివిధ శాఖల అధికారులు అలాగే బేడ బుడగ జంగం కాలనీ ప్రజలు , వార్డు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ తాటికొండ బుగ్గ రాముడు గారు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

# అభివృద్ధి సంక్షేమం, నమ్మకం కూటమి ప్రభుత్వ విజయాలు





**పండగల 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమం**

**ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ**

**సూపర్ సిక్స్ హామీలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన**

**ప్రజల సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగిన ఎమ్మెల్యే, నేతలు**

**ప్రభుత్వం- ప్రజల మధ్య వారధిగా'ఇంటింటికి తెలుగుదేశం'**

**అభివృద్ధి పనులు, సంక్షేమ ఫలితాలను వివరిస్తున్న ఎమ్మెల్యే**

**80 బన్నూరు గ్రామంలో పండగ వాతావరణం లో ప్రచారం కార్యక్రమం లో నేతలు**

**జూపాడుబంగ్లా, జులై :29: (నంది పత్రిక )** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్ళుగా భావించి పాలనా సాగిస్తుందని ఎమ్మెల్యే గిత్త జయసూర్య తెలిపారు. మంగళవారం 80 బన్నూరు గ్రామంలో నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రజలందరినీ కలుసుకొని, గత రెండేళ్లలో జరిగిన అభివృద్ధి సంక్షేమం పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిత్త జయ సూర్య మాట్లాడుతూ గ్రామాలలో అనేక అభివృద్ధి పనులు చేపట్టామని, సంక్షేమ పథకాలు అందించామని, ప్రజల్ని కలుసుకుని వారితో మాట్లాడినప్పుడు వారు కూటమి పాలన పట్ల సంతృప్తి, సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. రెండేళ్లలో అమలైన సంక్షేమం, గ్రామాల్లోని జరిగిన అభివృద్ధి పనుల గురించి వివరిస్తున్నారని తెలిపారు. తల్లికి వందనం పథకంలో భాగంగా ఇంట్లో ఉన్న చదువుకునే ప్రతి బిడ్డకు రూ 13వేల చొప్పున జమ చేయడం జరిగిందన్నారు. సామాజిక భద్రతా పింఛన్ లో భాగంగా నెల నెలా రూ 4 వేలు, దివ్యాంగులకు రూ 6 వేలు, ఉచితముగా మూడు గ్యాస్ సిలిండర్లు, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం, అన్నదాత సుఖీభవ కింద రూ 20 వేలు అందించడం జరిగింది న్నారు. ప్రతి ఇంటికి వెళ్లి పలకరిస్తూ కుటుంబ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామని భరోసా కల్పించారు. కూటమి ప్రభుత్వ అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రతి ఒక్కరూ కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి విప్లవాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గుండ్రెడ్డి మోహన్ రెడ్డి,తర్తూరు దేవస్థాన కమిటీ చైర్మన్ మందడి నారాయణరెడ్డి, రమణారెడ్డి, కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటర్ చైర్మన్ పరమేశ్వర్ రెడ్డి, తాసిల్దార్ చంద్రశేఖర్ నాయక్, ఏటీఎం అంబమ్మ, హౌసింగ్ ఏఈ బి. జ్యోతి, ఏపీఓ రేష్మ, ఈ ఓ ఆర్ డి పద్మావతమ్మ, టిడిపి నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

# నంద్యాల 38వ వార్డు వై.యస్.ఆర్ నగర్ లో జోరుగా రెండవ రోజు 'డోర్ టు డోర్' ప్రచారం .





**గడప గడపకూ టీడీపీ కూటమి నేతలులి**

**రెండేళ్ల పాలనలో మంత్రి వర్యులు .**

**ఎన్.ఎం.డిఫరూక్ ఆధ్వర్యంలో అభివృద్ధి..**

**.వార్డు టీడీపీ ఇంఛార్జీ తాటికొండ బుగ్గరాముడు**

**నంద్యాల సిటీ బ్యూరో జులై 28 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణంలోని 38వ వార్డు వై.ఎస్.ఆర్ నగర్‌లో తెలుగుదేశం పార్టీ చేపట్టిన 'డోర్ టు డోర్' గడప గడపకు ప్రచార కార్యక్రమం రెండో రోజుకు చేరింది. వార్డు ఇంఛార్జి తాటికొండ బుగ్గరాముడు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు ఇంచార్జి తాటికొండ బుగ్గరాముడు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధిష్టానం పిలుపు మేరకు, నంద్యాల ఎమ్మెల్యే, రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎమ్.డి. ఫరూక్, కుమారులు ఫిరోజ్, ఫయాజ్ గారి ఆదేశాల ప్రకారం ఈ ప్రచారాన్ని చేపట్టినట్లు తెలిపారు. వార్డు మొత్తం విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల కాలంలో ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉంది అని ఆయన అన్నారు. అదేవిధంగా వార్డు నందు ప్రతిరోజూ 30 కుటుంబాలను నేరుగా కలిసి వారి సమస్యలు తెలుసుకుంటున్నాం. ప్రజల వివరాలను 'మై టీడీపీ' యాప్‌లో నమోదు చేస్తూ, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో 38వ వార్డుపై తెలుగుదేశం పార్టీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం అని వార్డు ఇంచార్జి తాటికొండ బుగ్గరాముడు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు మోతె మౌలాలి,పెద్దన్న, మల్లాపురం చిన్న రాముడు, మహేష్,జానీ,తదితర టీడీపీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# ఎల్‌నినో సవాల్‌కు ముందస్తు వ్యూహం..!

**ఎల్‌నినోపై రైతులు ఆందోళన చెందొద్దు..!**

**జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి**

**రైతులకు అండగా జిల్లా యంత్రాంగం**

**ముందస్తు చర్యలతో ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొంటాం**

**నీటి సంరక్షణ నుంచి పంటల బీమా వరకు సమగ్ర కార్యాచరణ**

**శాస్త్రీయ, సహజ సాగు విధానాలతో నష్టాలను తగ్గించడమే లక్ష్యం**

**వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులకు సూచనలు, ఆదేశాలు**

**కడప, బ్యూరో చీఫ్ జూలై 28 నంది పత్రిక** ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశాల నేపథ్యంలో వైఎస్ఆర్ కడప జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమగ్ర కార్యాచరణను అమలు చేస్తున్నామని.. రైతులు నిర్భయంగా శాస్త్రీయ, సహజ సాగు పద్ధతులను అనుసరిస్తూ ప్రభుత్వ సూచనలను పాటించాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్ లో వ్యవసాయ, ఉద్యానవన, ప్రకృతి వ్యవసాయం, పశుసంవర్ధక, సూక్ష్మ సాగునీటి యాజమాన్య శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనే కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు.రాష్ట్ర ప్రభుత్వం వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ జిల్లాలకు అవసరమైన మార్గదర్శకాలు జారీ చేస్తోందని, వాటి ప్రకారం జిల్లాలో ఇప్పటికే ముందస్తు చర్యలు ప్రారంభించామని తెలిపారు. రైతులు వదంతులను నమ్మకుండా వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, కృషి విజ్ఞాన కేంద్రాల నిపుణుల సూచనలను పాటించాలని సూచించారు. జిల్లాలో ప్రతి రైతుకు శాస్త్రీయ సలహాలు, సాంకేతిక సహాయం, ప్రభుత్వ రాయితీలు, పంటల బీమా, ప్రత్యామ్నాయ పంటల సాగు విధానాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామని చెప్పారు. వర్షాభావ పరిస్థితులను ముందుగానే అంచనా వేసి వాటిని సమర్థంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.జూలై నెలలో రాష్ట్రవ్యాప్తంగా 69 శాతం వర్షపాతం లోటు నమోదైందని, రానున్న నెలల్లో కూడా వర్షాభావ పరిస్థితులు కొనసాగే అవకాశాలు ఉన్నందున ప్రతి మండలంలో అప్రమత్త చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నీటి వనరుల సంరక్షణ, భూగర్భ జలాల పరిరక్షణ, భూమిలో తేమ నిల్వ, సూక్ష్మ సాగునీటి విధానాల అమలు, బోర్ల వినియోగం, ఫార్మ్ పాండ్‌ల ఏర్పాటు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు. రైతులకు గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల మార్పిడి, ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని ఆదేశించారు. అరటి, చీనీ వంటి ఉద్యాన పంటల్లో సహజ వ్యవసాయ విధానాలను విస్తరించాలని, జీవ ఎరువులు, నవధాన్యాలతో తయారుచేసిన జీవామృతాలు, వేపపిండి కషాయం వంటి సహజ పద్ధతులను రైతులకు చేరవేయాలని సూచించారు. సాగు ఖర్చులు తగ్గిస్తూ దిగుబడులు పెంచే శాస్త్రీయ విధానాలపై రైతులకు విస్తృత శిక్షణ ఇవ్వాలని పేర్కొన్నారు.

జిల్లాలో అమలవుతున్న జలధారజలహారతి కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేసి ప్రతి నీటి వనరును సంరక్షించాలని, నీటి వృథాను నివారించేలా గ్రీన్ మ్యాట్, సూక్ష్మ సాగునీటి పద్ధతులను విస్తృతంగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రతి రైతు పొలంలో ఫార్మ్ పాండ్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలపై అవగాహన కల్పించాలని సూచించారు.పశుగ్రాస నిల్వలు, పశువైద్య సేవలు, గోకులం షెడ్ల నిర్వహణ, పాడి పరిశ్రమ, కోళ్ల పరిశ్రమ అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం, వ్యవసాయ శాస్త్రవేత్తలు సమన్వయంతో పనిచేస్తున్నారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. శాస్త్రీయ సూచనలు పాటిస్తూ ప్రభుత్వ సహకారాన్ని వినియోగించుకోవాలి. ప్రతి రైతుకు జిల్లా యంత్రాంగం అండగా ఉంటుంది" అని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఏపీ సీఎన్ఎఫ్ డీపీఎం ప్రవీణ్ కుమార్, పశుసంవర్ధక శాఖ అధికారి శ్రీనివాసులు, ఉద్యాన శాఖ ఉపసంచాలకుడు హరిప్రసాద్, ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరమణ, ఎల్డీఎం జనార్దనం, వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డా. ఎ. ప్రభాకర్ రెడ్డి, శాస్త్రవేత్త డా. కె. సునీల్ కుమార్, కృషి విజ్ఞాన కేంద్రం కార్యక్రమ సమన్వయకర్త డా. బి. శిల్పకళ, డీఏఏటీ కేంద్రం సమన్వయకర్త డా. ఎన్. కృష్ణప్రియతో పాటు వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# నా పట్టు నా అభిమానం" కార్యక్రమం



**నంది పత్రిక ఆత్మకూరు..'** "నా పట్టు నా అభిమానం" కార్యక్రమం నందు నంద్యాల జిల్లా పట్టు రైతులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై చర్చించడం జరిగింది. ఈ సమావేశానికి జిల్లాలోని 20 మంది పట్టు రైతులు మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారులు హాజరయ్యారు.అదేవిధంగా, రాబోయే కార్యక్రమాల అమలు, ఈ సంవత్సరానికి నిర్ణయించిన 150 ఎకరాల లక్ష్య విస్తీర్ణాన్ని సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, అలాగే ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై సమగ్రంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర పట్టు మండలి నుండి శాస్త్రవేత్త డా ॥బి.ఆర్.అర్చన నంద్యాల జిల్లా పట్టు పరిశ్రమ శాఖ అధికారి కె. నగేష్ ,పట్టు రైతులు మరియు శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# "సంజీవనగర్ తండాలో ఘనంగా ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం "



**నంది పత్రిక ఆత్మకూరు..** రాష్ట్ర న్యాయ సేవాధి కార సంస్థ ఆదేశాల మేరకు కర్నూలు,జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి ఆధ్వర్యంలో ఆత్మకూరు మండలంలోని, సంజీవనగర్ తాండ నందు జులై 28 ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జడ్జి మాట్లాడుతు ప్రకృతి ని పర్యావరనాన్ని ప్రతి ఒక్కరూ కాపాడాలని కోరారు. మానవ వన్య ప్రాణి దాడుల బాధితులకు న్యాయం పొందేందుకు సంబంధించిన జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ పథకం 2025 అమలు పై తో అటవీ సరిహద్దు ప్రాంతాలలో వ్యవసాయ పొలాలలో చిరుతలు, పులులు, ఏనుగులు, అడవి పందుల దాడుల వలన ప్రాణాలు కోల్పోయిన మరియు పశువులను, పంటలను కోల్పోయిన వారికి మరియు వారి కుటుంబ సభ్యులకు గవర్నమెంట్ నుండి నష్టపరిహారం లభిస్తుందని తెలిపారు. గిరిజనులకు ఏవైనా సమస్యలు ఉంటే లీగల్ సర్వీసెస్ టోల్ ఫ్రీ నెంబర్ 15100 పై కాల్ చేస్తే వారికి ఉచిత న్యాయ సహాయాన్ని అందిస్తామని తెలిపారు. లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శివరామ చంద్రరావు మాట్లడుతూ అడవి జంతువుల బాధితులకు పరిహారం అందించేందుకు అటవీశాఖ అధికారులు మీ సేవా ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పించారని తెలిపారు. ఐటీడిఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ గుండాల నాయక్ మాట్లడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము 2026 లో ప్రాజెక్ట్ హనుమాన్ను ప్రారంభించి వన్యప్రాణుల దాడుల బాధితులకు తక్షణ వైద్య సహాయం మరియు వేగవంతమైన నష్ట పరిహారాలను అందిస్తుందని తెలిపారు. ఆత్మకూరు డియస్పి ఆర్.రామాంజి నాయక్ మాట్లడుతూ గిరిజనులు అటవీ భూములను కాపాడుకోవాలని చెట్లను కొట్టి వేయకుండా ప్రకృతి ని కాపాడాలని కోరారు. అనంతరం గిరిజనులకు నంద్యాల డిస్టిక్ అండ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేసి, వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సమావేశంలో ఆత్మకూరు డిఎస్పి రామాంజి నాయక్, ఆత్మకూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ లక్ష్మి కుమారి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ జాకిర్ హుస్సేన్ , ఐటీడీఏ ప్రాజెక్టు మేనేజర్ గుండాల నాయక్, ఆత్మకూరు ఎంపీడీవో నాగేంద్రుడు, డిప్యూటీ ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఆత్మకూరు న్యాయ వాదులు భాస్కర్, బతుకులయ్య, అంకిరాజు, ప్యారా లీగల్ వాలెంటీర్స్ రమేష్, బలరాముడు, , జుల్ఫికర్, యస్.యన్.తాండ సర్పంచ్ నాగులు నాయక్, డాక్టర్ పవన్ కుమార్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు మరియు ఐటీడిఏ అధికారులు, జిల్లా రెవిన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# నంద్యాలలో హోరెత్తిన వైఎస్సార్‌సీపీ డీఎస్సీ నిరసన ర్యాలీ...

**నంద్యాలలో హోరెత్తిన వైఎస్సార్‌సీపీ నిరసన ర్యాలీ! శ్రీనివాస సెంటర్ డా.వైఎస్సార్ విగ్రహం ఎదుట వద్ద కిక్కిరిసిన విద్యార్థులు, నిరుద్యోగులు.**

**మెగా డీఎస్సీలో అక్రమాలపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలి: వైఎస్సార్‌సీపీ డిమాండ్.**

**మంత్రి నారా లోకేష్ తక్షణమే రాజీనామా చేయాలి: కాటసాని రాంభూపాల్ రెడ్డి మండిపాటు.**

**నంద్యాల సిటీ బ్యూరో జులై 28 ( నంది పత్రిక )** నంద్యాలలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం చేపట్టిన నిరసన ర్యాలీ హోరెత్తింది. మెగా డీఎస్సీ నిర్వహణలో భారీగా అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ విద్యార్థులు, నిరుద్యోగులు పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయం నుంచి శ్రీనివాస సెంటర్ వరకు సాగిన ఈ ర్యాలీలో వేలాది మంది పాల్గొనడంతో శ్రీనివాస సెంటర్‌లోని డాక్టర్ వైఎస్సార్ విగ్రహం ప్రాంగణం జనసందోహంతో కిక్కిరిసిపోయింది. ముందుగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన పార్టీ నాయకులు, అనంతరం కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మెగా డీఎస్సీలో జరిగిన అవకతవకలకు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తక్షణమే రాజీనామా చేయాలని వైఎస్సార్‌సీపీ డిమాండ్ చేసింది. డీఎస్సీ నియామకాలపై తక్షణమే సీబీఐ విచారణ జరిపించాలని కోరింది. ఈ నిరసన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డితో పాటు ఎమ్మెల్సీ ఇస్సాక్ బాష, మాజీ ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, మార్క్ ఫెడ్ మాజీ ఛైర్మన్ పీపీ నాగిరెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు సూర్యనారాయణ రెడ్డి, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు గుండం నాగేశ్వర రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, సురేష్, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాష, మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, నంద్యాల పరిశీలకుడు సూర్యనారాయణ రెడ్డి,ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా విభాగం సెక్రటరీ శశికళ రెడ్డి మా మాజీ మున్సిపల్ చైర్మన్ మాబున్నీసా, నంద్యాల జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు సురేష్ , నంద్యాల జిల్లా కమిటీ జిల్లా వైసీ జిల్లా వైసీపీ సోమశేఖర్ రెడ్డి, వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి అనిల్ అమృతరాజ్ మున్సిపల్ వింగ్ అధ్యక్షుడు టైలర్ శివ సాయి రామ్ రెడ్డి,నంద్యాల జిల్లానంద్యాల ఎస్టీ సెల్ సెక్రెటరీశంకర్ నాయక్ అసెంబ్లీ యూత్ అధ్యక్షుడు శ్రీనివాసులు పాల్గొన్నారు మాట్లాడుతూ... వైఎస్సార్సీపీ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. మెగాడీఎస్సీలో అర్హత కలిగిన నిరుద్యోగ యువతకు అన్యాయం జరిగిందని ఆరోపించారు. ఇటీవల ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు ఒక్కసారి పెద్ద ఎత్తున తరలి వచ్చి ఉద్యమాన్ని చేపట్టి నీట్ లీక్ కు భాద్యులైన కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను రాజీనామా చేసే వరకు పోరాటాన్ని ఆపలేదని గుర్తు చేశారు. అలాగే ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో నిర్వహించిన డీఎస్సీ నియామకాల్లో జరిగిన అవకతవకలపై బాధ్యతవహించి విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా సీబీఐ విచారణ చేపట్టాలని కోరారు. టెట్లో అర్హత లేకపోయినా కనీసం డిగ్రీ పాస్ కాకపోయినా టీచర్ ఉద్యోగాలను స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు కల్పించారని ఆరోపించారు. అర్హతలు ఉన్నవారికి ఉద్యోగాలు కల్పించలేదని వారికి అన్యాయం చేశారని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హమీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. ఎస్సీఆర్టీ మార్గదర్శకాల ద్వార డీఎస్సీ నిర్వహించడం జరుగుతుందని, అయితే అందులో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి అయిన నవీన్ అనే వ్యక్తి ఎన్.సీ తీసుకోకుండా డీఎస్సీ పరీక్షవ్రాసి స్టేట్ పస్ట్ ర్యాంక్ సాధించాడని, కంప్యూటర్ ఆపరేటర్ అయిన ఈ వ్యక్తి స్టేట్ ఫస్ట్ ఏలా వస్తాడని సూటిగా ప్రశ్నించారు. 420 టీచర్ ఉద్యోగాలను అర్హత లేని వారికి స్పోర్ట్స్ కోటాలో ఇవ్వడం జరిగిందని ఆరోపించారు. విద్యార్థుల, యువత శక్తిని మంత్రి లోకేష్ తక్కువ అంచనా వేస్తున్నారని, జంతర్ మంతర్లో జరిగిన ఉద్యమాలే తార్కాణం అని డిల్లీ కోటను బద్దలు కొట్టి వారి న్యాయమైన డిమాండ్లను సాధించారని పేర్కొన్నారు. మంత్రి నారాలోకేష్ రాజీనామా చేసేవరకు ఈ పోరాటాలు ఆగవని హెచ్చరించారు.



# అమరావతి ఛాంపియన్ పోటీలు ప్రారంభించిన ఎం ఈ ఓ శోభ వివేకావతి





**ప్రభుత్వం గ్రామస్థాయి లో ప్రతిభ ఉన్న క్రీడాకారులను గుర్తించేందుకే పోటీల్లో నిర్వహిస్తున్నాం**

**జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి వి ఎం రాజు**

**రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు క్రీడాకారులకు మంచి అవకాశాలు కల్పిస్తుంది**

**వై పి పి యం ప్రధానోపాధ్యాయులు వీర రాఘవయ్య**

ఆళ్లగడ్డ ప్రతినిధి జూన్ 28 పత్రిక ఆళ్లగడ్డ పట్టణంలోని వైపిపీఎం ప్రభుత్వ హైస్కూల్లో మంగళవారం నాడుఅమరావతి ఛాంపియన్షిప్ పోటీలు ప్రారంభమయ్యాయి ఆళ్లగడ్డ నియోజకవర్గం అమరావతి చాంపియన్షిప్ పోటీలకు ముఖ్య అతిథులుగానంద్యాల జిల్లా డిస్టిక్ స్పోర్ట్స్ అథారిటీ అధికారి వి ఎం రాజు, ఆళ్లగడ్డ ఎం,ఈ,ఓ శోభ వివేకావతి వైపిపిఎం ప్రభుత్వ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వీర రాఘవయ్యలు పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్రీడాకారులను ఉద్దేశించి జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి వి ఎం రాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామ స్థాయిలో ప్రతిభ ఉన్న క్రీడాకారులను గుర్తించేందుకు నియోజకవర్గ పరిధిలో పోటీలను నిర్వహించి ప్రతిభ ఉన్న క్రీడాకారులను ఎన్నుకొని జిల్లాస్థాయి రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనే విధంగా అమరావతి చాంపియన్షిప్ పోటీలనురాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్నదన్నారు . ఎం,ఈ,ఓ శోభ వివేకావతి మాట్లాడుతూ ఈ అమరావతి చాంపియన్షిప్ నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న పోటీలలో ప్రతిభ ఉన్న క్రీడాకారులను ఎన్నిక చేసుకొని జిల్లా స్థాయిలో రాష్ట్రస్థాయిలో ఆళ్లగడ్డ నియోజకవర్గం క్రీడాకారులు పథకాలు సాధించాలని మన ఆళ్లగడ్డ కు క్రీడాకారుల తల్లిదండ్రులకు పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఎంఈఓ శోభా వివేకవతి తెలిపారు. ప్రభుత్వ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వీర రాఘవయ్య మాట్లాడుతూ క్రీడాకారులు మంచి విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని దేశంలో ఎక్కడ లేని విధంగాఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు క్రీడాకారులకు మంచి అవకాశాలు కల్పించిందని అందులో భాగంగానే ఉద్యోగాల రిజర్వేషన్లు 3% శాతం కేటాయించడం క్రీడాకారులు ఎంతో గర్వించదగ్గ విషయమని దీనిని క్రీడాకారులు సద్వినియోగపరుచుకోవాలని వ్యాయామ ఉపాధ్యాయులు ప్రతిభ ఉన్న క్రీడాకాలను ఎంపిక చేసుకొని శిక్షణను చేయించి జిల్లా రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనే విధంగా క్రీడాకారులకు తోడ్పాటు అందించాలని క్రీడల అభివృద్ధి మన అందరి బాధ్యత తీసుకోవాలని వీర రాఘవయ్య సూచించారు అనంతరం ప్రధానోపాధ్యాయులు వీర రాఘవయ్య,. ఎం, ఈ,ఓ శోభ వేదవతి జిల్లా జిల్లా స్పోర్ట్స్ అధికారి వి ఎం రాజు క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యా ఆశాజ్యోతి, ఎల్ ప్రతాప్ మనోహర్ బాబు మౌలాలి, చాంద్బాషా , భారతి, సుమ, ఓబన్న, రవి, ధర్మరాజు, దేవేంద్ర, శ్రీధర్, సువర్ణ, లోకేశ్వరి, నరసింహ, రాణి, దాదా పీర్, వినోద్ కుమార్ ఆర్.ఆర్ అకాడమీ కోచ్ డిపి సుబ్బరాయుడు డిస్టిస్ స్పోర్ట్స్ అథారిటీ నంద్యాల కె వి కే (క్రీడా వికాస కేంద్రం ) స్టేడియం కోచ్ లు వెంకటరమణ , శాంతిరాజు, సుదర్శన్ లక్ష్మణ్, విక్రమ్, మణికంఠ , దేబోరా పాల్గొన్నారు.



## ఆర్టీసీ బస్సు--లారీ ఢీ--ముగ్గురికి గాయాలు.



బేతంచర్ల జూలై 28 ( నందిపత్రిక ). బేతంచర్ల మండలం బు గ్గాని పల్లె సమీపంలో సోమవారం ఆర్టీసీ బస్సు, లారీ ఎదు రె దురుగా బలం గా " ఢీ" కొన్నాయి. ప్రమాదంలో బస్సు ముందు భాగం పూర్తిగా నుజ్జు నుజ్జు అయ్యింది.ప్రమాద సమయంలో ఆర్టీసీ బస్సులో ప్రయాణికులు ఎక్కువ మంది ఉన్నారు. అదృష్టవశాత్తు అందరూ క్షేమంగా ఉన్నారు.ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ రియాజ్ తో పాటు అదే బస్సులో ప్రయాణిస్తున్న లక్ష్మీదేవి, మద్దమ్మ, కంబగిరి ఆచారీలకు గాయాలయ్యాయి. డ్రైవర్ రియాజ్ కు తలకు, కాలికి గాయాలయ్యాయి. అయితే ఆయన పరిస్థితి విషమంగా లేదు, క్షేమంగా ఉన్నట్లు తెలిసింది. గాయపడిన వారిని స్థానికులు సహాయంతో వెంటనే బేతంచర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. రోడ్డుపై పడి ఉన్న గాజు పెంకులు, వస్తువులను తొలగించారు. ఈ ప్రమాదంతో కొంత సేపు రహదారిపై ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది.

## అనంత విద్యా సంస్థలో చదివే విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణిస్తున్నారు

**అనంత విద్యాసంస్థల అధినేత అనంత రామసుబ్బారెడ్డి**




ఆళ్లగడ్డ ప్రతినిధి జూలై 28 నంది పత్రిక అమరావతి ఛాంపియన్‌షిప్2026 పోటీల్లో నియోజకవర్గ స్థాయిలో పాల్గొన్న అనంత డిగ్రీ కళాశాల, ఆళ్లగడ్డ విద్యార్థినులు విశిష్ట ప్రతిభ కనపరిచారని మంగళవారం జరిగిన ఎంపికల వాలీబాల్ విభాగంలో అండర్-17 విభాగం నుంచి ఎం. స్వాతి, అండర్-23 విభాగం నుంచి ఎం. ఆసియా, ఎల్. రుక్సానా జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక అయినారని అనంత విద్యాసంస్థల అధినేత అనంత రామ సుబ్బారెడ్డి, అనంత డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నరసింహులు, అనంత జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శంకరాచారి తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనంత విద్యాసంస్థల చదువుతున్న విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా మంచి నైపుణ్యాన్ని సాధిస్తూ విద్యా సంస్థకు వారి తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు చేస్తున్నారని అలాగే జిల్లా స్థాయికి క్రీడలకు ఎంపికైన విద్యార్థినులను అభినందించి, భవిష్యత్తులో కూడా క్రీడల్లో మరింత ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. విద్యార్థులలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను ప్రోత్సహించడం తమ విద్యాసంస్థల ప్రధాన లక్ష్యమని, క్రీడలకు ఎల్లప్పుడూ పూర్తి సహకారం అందిస్తూ అన్ని విధాలుగా ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు.

# తనను పార్టీ అధిష్టానం పిలిచిందన్న ప్రచారం అవాస్తవం

**ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ**

**ప్రధాని రాష్ట్ర పర్యటన ఒకవైపు**

**తల్లికి వందనంనిధులు విడుదల**

**రాష్ట్రమంతటా ఒక పండగ**

**వాతావరణం నెలకొంది**

**ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ**



ఆళ్లగడ్డ ప్రతినిధి జూలై 27, నంది పత్రిక తనను తెలుగుదేశం పార్టీ అధిష్టానం విజయవాడకు పిలిచి వివరణ కోరిందంటూ వస్తున్న ప్రచారం అవాస్తవమని, అలాంటి సమాచారం తనకు ఎవరూ ఇవ్వలేదని, పార్టీ నుంచి ఎలాంటి ఫోన్ కాల్ కానీ, అధికారిక సమాచారం కానీ తనకు అందలేదని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేపట్టిన "రెండేళ్ల నమ్మకం అభివృద్ధి, సంక్షేమం" ఇంటింటి ప్రచార కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతోందని, ప్రతి ఎమ్మెల్యే, మంత్రి క్షేత్రస్థాయిలో పాల్గొనాలని పార్టీ ఆదేశించిందన్నారు. అలాంటి కీలక కార్యక్రమం మధ్యలో తనను పిలిచే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. అలాగే బోండా ఉమకు సంబంధించిన అంశాన్ని తనతో ముడిపెట్టి ప్రచారం చేయడం సరైనది కాదన్నారు. అహోబిలం ఘటనను కారణంగా చూపుతూ తనను పిలిచారన్న ప్రచారం కూడా అవాస్తవమని, ఆ ఘటన జరిగి చాలా రోజులు అయ్యిందని,

ఆ అంశంపై పార్టీ స్పందించాల్సి ఉంటే అప్పుడే స్పందించేదని తెలిపారు. పార్టీ ఎవరినైనా వివరణ కోరితే తప్పకుండా వెళ్లి వివరణ ఇవ్వడం ప్రతి నాయకుడి బాధ్యతేనని, తనకు అలాంటి పరిస్థితి వస్తే తాను కూడా పార్టీ నిర్ణయాన్ని గౌరవిస్తానని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు. మాజీ కౌన్సిలర్ హుస్సేన్ భాష శేఖర్ రెడ్డి నాగాంజనేయులు పాల్గొన్నారు.

## పీజీఆర్ఎస్ ఫిర్యాదుపై బుడగ జంగాల కాలనీలో పర్యటించిన జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి

**గర్భిణులు, చిన్నారుల కోసం వెంటనే అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశం**

**కాలనీవాసుల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్**

**పాఠశాల, రోడ్లు, డ్రైనేజీ, స్మశాన వాటిక సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు**



నంద్యాల బ్యూరో, జూలై 28(నంది పత్రిక):- ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, పీజీఆర్ఎస్‌లో అందిన ఫిర్యాదు మేరకు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మంగళవారం నంద్యాల పట్టణంలోని బుడగ జంగాల కాలనీని సందర్శించి స్థానికుల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో కాలనీవాసులు తమ ప్రాంతంలో అంగన్‌వాడీ కేంద్రం లేకపోవడంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వినతిపత్రం సమర్పించగా, కలెక్టర్ ఇచ్చిన హామీ మేరకు నేరుగా కాలనీకి వెళ్లి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా వెంటనే ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించి, అర్హులైన గర్భిణులు, బాలింతలు, చిన్నారులందరినీ నమోదు చేసి ప్రభుత్వ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ స్త్రీ శిశు సంక్షేమ అధికారిని ఆదేశించారు. అనంతరం కాలనీలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. ప్రస్తుతం అద్దె భవనంలో 104 మంది విద్యార్థులతో పాఠశాల నిర్వహణ జరుగుతున్న పరిస్థితిని పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానికులతో మాట్లాడి పాఠశాల ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు శాశ్వత పరిష్కారం కల్పించే దిశగా అవసరమైన చర్యలు చేపడతామని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా స్థానికులు రోడ్లు, డ్రైనేజీ, స్మశాన వాటికకు దారి, పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటుకు భూమి కేటాయింపు తదితర సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కొన్నేళ్లుగా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల వినతులపై స్పందించిన కలెక్టర్, సమస్యలన్నింటినీ ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు. పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలకు అవసరమైన భూమి కేటాయింపు అంశంపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. స్మశాన వాటికకు వెళ్లే మార్గాన్ని అభివృద్ధి చేసి అవసరమైన లెవలింగ్ పనులు చేపడతామని తెలిపారు. ఆక్రమణలు లేదా ఇతర అడ్డంకులు ఉన్నచోట వాటిని తొలగించి ప్రజలకు అనుకూలంగా మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే రోడ్లు, డ్రైనేజీ సమస్యలను కూడా దశలవారీగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ శేషన్న, డీఈఓ జనార్ధన్ రెడ్డి, పీడీ ఐసీడీఎస్ పిడి లీలావతి తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.



## విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు యర్రం విష్ణు వర్ధన్ రెడ్డి సన్మానం



నంద్యాల ప్రతినిధి. జూలై 28. (నంది పత్రిక ):ఒక సామాన్య రైతు కుటుంబంలో కీ శే యర్రం సదా శివారెడ్డి మరియు రామ లక్ష్మమ్మ దంపతులకు జన్మించి విజయవంతమైన వ్యాపార వేత్తగా , బాల్యం లోనే స్వయం సేవక్ గా , ఉత్తమ భర్తగా, ఆదర్శ తండ్రిగా , గొప్ప నాయకుడిగా , విలువైన స్నేహితుడిగా అందరి మన్ననలను పొందుతూ ప్రస్తుతం భారత మాత సేవా సమితి ఉపాధ్యక్షులు సేవలందిస్తున్న యర్రం విష్ణు వర్ధన్ రెడ్డి విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు గా నియమితులవడం మన నంద్యాల వాసులందరికీ గర్వ కారణమని భరతమాత సేవా సమితి అధ్యక్షులు గోళ్ల సుదర్శనం తెలిపారు.భారతమాత దేవాలయం అభివృద్ధిలో కూడా వారి కృషి ఎనలేనిదని పేర్కొంటూ ఈ సందర్భంగా వారిని భారత మాత సేవా సమితి తరుపున ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో భారత మాత సేవా సమితి ప్రధాన కార్యదర్శి సముద్రాల మధుసూదన రావు , సమన్వయ కార్యదర్శి పోలేపల్లి సందీప్ , మేడా రామకృష్ణ , వెంకటేశ్వర బాబు మరియు సభ్యులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య వర్తక సంఘం స్టేట్ శాశ్వత ఈసీ సభ్యుడు కొండపల్లి చిన్న సుబ్బారావుకు ఘన సన్మానం





బద్వేల్, జూలై 28 (నంది పత్రిక):బద్వేల్ పట్టణంలోని అమ్మవారి శాలలో ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షుడు, స్టేట్ శాశ్వత ఈసీ సభ్యుడు కొండపల్లి చిన్న సుబ్బారావును ప్రముఖులు, ఆర్యవైశ్య పెద్దలు, కమిటీ సభ్యుల సమక్షంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు పూలమాలలు, శాలువాతో సత్కారం నిర్వహించి అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమానికి నాలుగు మండలాల ఆర్యవైశ్య సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కమిటీ సభ్యులను ప్రత్యేకంగా ఆహ్వానించారు. అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కొండపల్లి చిన్న సుబ్బారావు వారిని ఘనంగా సత్కరించి, అనంతరం నిండు భోజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా మాట్లాడిన ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు, గత 40 ఏళ్లలో తమను ఈ స్థాయిలో గుర్తించి ఆహ్వానించిన సందర్భాలు లేవని, కొండపల్లి చిన్న సుబ్బారావు తమను గౌరవించి సన్మానించడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. అలాగే అమ్మవారి శాల అభివృద్ధికి అవసరమైన విరాళాలు, సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు.కొండపల్లి చిన్న సుబ్బారావు మాట్లాడుతూ, ఆర్యవైశ్య సమాజ అభివృద్ధి కోసం ఎల్లప్పుడూ ముందుండి సేవలు అందిస్తానని, సంఘానికి అవసరమైన ప్రతి విషయంలో తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమానికి హాజరైన అతిథులు సంతోషం వ్యక్తం చేస్తూ భోజన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం సంఘ సేవలో విశేషంగా కృషి చేస్తున్న కొండపల్లి చిన్న సుబ్బారావును అభినందించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షుడు ఊరివి శ్రీనివాసులు, కోశాధికారి భూపాలపు నాగరాజు, జాయింట్ సెక్రటరీ సకల గోవిందస్వామి, గౌరవ సలహా సభ్యులు, ఇతర కమిటీ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ప్రచార కార్యదర్శిగా చేదర్ల వెంకటసుబ్బయ్యను ఎన్నుకున్నారు.

## సీఎం ఎఫ్ఆర్ చెక్కుల పంపిణీ చేసిన.. ఎమ్మెల్యే

**మండలంలోని వివిధ గ్రామాల బాధితుల కు రూ 4,30,124 ల సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ.**

**బాధితులు సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలి... గీత.**



జూపాడుబంగ్లా జులై ::28 :( నంది పత్రిక ): మండల పరిధిలోని వివిధ గ్రామాలలోని అనారోగ్య బారినపడి ఆర్థికంగా నష్టపోయిన బాధితులను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి స్థానిక ఎమ్మెల్యే సిఫారసుతో మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే గిత్త జయ సూర్య మంగళవారం బాధితుల స్వగృహాలకు వెళ్లి అందజేశారు. మండ్లేము గ్రామానికి చెందిన జి రవళి అనే బాధితురాలికి రూ 20,464ల చెక్కును అలాగే దేవ నిహారిక కి రూ 27,574లు, చెక్కును అందజేశారు. తర్తూరు గ్రామానికి చెందిన బైరవకొండ మల్లికార్జున రూ 35,909లు, 80 బన్నూరు గ్రామానికి చెందిన నాగరత్నమ్మకురూ66,250, 80 బన్నూరు గ్రామానికి చెందినకు లింగస్వామి రూ 52,350, అలాగే తరిగోపుల గ్రామానికి రవి గౌడ్ రూ 40,205, బాలస్వామి రూ37983, తాటిపాడు గ్రామానికి చెందిన బండారు మల్లిక కురూ37,378, మరియు కుమ్మరి గీత కు రూ 40,887, తెలుగు వెంకట లచ్చమ్మ కు రూ51,114, కనకం ఇందిరా రూ 20,000, చెందిన కూటమి నాయకులతో కలిసి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిత్త జయ సూర్య మాట్లాడుతూ వివిధ రోగాల బారిన పడి ఆర్థికంగా నష్టపోయిన వారిని ఆదుకునేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన సహాయ నిధి నుండి ఆర్థిక సహాయం చేస్తూ బాధితులకు అండగా నిలుస్తున్నారని అన్నారు. బాధితులు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి అందజేసిన నిధులను తమ ఆరోగ్యలకే ఖర్చు చేసుకోవాలని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బాధితుల ఇళ్లకు వెళ్లి స్వయంగా వారి బాధలను విని మన ప్రభుత్వం చేస్తున్న మేలును గురించి వివరించాలని చెప్పడంతోనే తాను బాధితుల స్వగృహాలకు వెళ్లి బాధితులను పరామర్శించి సీఎం మంజూరు చేసిన నిధులను అందజేస్తున్న అన్నారు. ఈ కార్యక్రమంలో గుండ్రెడ్డి మోహన్ రెడ్డి, పోతులపాడు మాజీ సర్పంచ్ రవికాంత్, తర్తూర్ దేవస్థాన కమిటీ చైర్మన్ మందడి నారాయణరెడ్డి, తర్తూర్ రమణారెడ్డి, మందడి దొరబాబు రెడ్డి, రవి కుమార్ యాదవ్, నాయకులు కార్యకర్తలు ప్రభుత్వ అధికారులు తాసిల్దార్ చంద్రశేఖర్ నాయక్, ఏపీఎం అంబమ్మ, ఏపీవో రేష్మ, ఈ ఓ ఆర్ డి పద్మావతమ్మ, హౌసింగ్ ఏఈ బి. జ్యోతి, మండల టిడిపి నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.



# “కూటమి ప్రభుత్వ సంక్షేమ ఫలాలతో ఆనందం వ్యక్తం చేస్తున్న నంద్యాల ప్రజలు“



## “వర్షంలో సైతం ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులను నేరుగా కలిసి సంక్షేమ పాలన గురించి వివరించిన నంద్యాల టీడీపీ నాయకులు“

**నంద్యాల సిటీ బ్యూరో జులై 28 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణంలోని 9, 29, 38, 40 వార్డుల్లో నిర్వహించిన “2 ఏళ్ళ అభివృద్ధి సంక్షేమ కూటమి పాలన“ రెండో రోజు కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ ఛైర్మన్ తెలుగుదేశం పార్టీ నంద్యాల అసెంబ్లీ సమన్వయకర్త గుడుపాటి నారాయణస్వామి, తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిని పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి “2 ఏళ్ళ అభివృద్ధి సంక్షేమ కూటమి పాలన“ కరపత్రాలను పంపిణీ చేస్తూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని మై టీడీపీ యాప్‌లో నమోదు చేశారు. ఈ సందర్భంగా గుడుపాటి నారాయణస్వామి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రెండు ఏళ్ళ కాలంలో ప్రజల విశ్వాసాన్ని సంపాదించిందన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణమే ప్రభుత్వ ధ్యేయమని, రైతులు, మహిళలు, యువత, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. “2 ఏళ్ళ అభివృద్ధి సంక్షేమ కూటమి పాలన“ కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికి చేరుకుని ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను వివరించడంతో పాటు పాలనలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు. అలాగే సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని పార్టీ శ్రేణులకు నారాయణ స్వామి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఫిరోజ్ మాట్లాడుతూ, గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన నష్టాలను అధిగమిస్తూ కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో ప్రజల మెప్పు పొందే పాలన అందించిందన్నారు. ‘తల్లికి వందనం‘ పథకం కింద గతంలో ఒక్క విద్యార్థికే పరిమితమైన ఆర్థిక సహాయాన్ని, ఇప్పుడు అర్హత ఉన్న ప్రతి విద్యార్థికి రూ.15 వేల చొప్పున తల్లి ఖాతాలో జమ చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. అదేవిధంగా పట్టణాల్లో చెత్త



పన్ను రద్దు, అన్న క్యాంటీన్ల పునఃప్రారంభం, నెలవారీ పింఛన్‌ను రూ.4 వేలుకు పెంపు, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, మెగా డీఎస్సీ, ఒంటరి మహిళలకు పింఛన్లు, డ్వాక్రా మహిళలకు రుణాల ప్రాధాన్యత, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తోందన్నారు. త్వరలో అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు అండగా నిలవడంతో పాటు, ఆగస్టు నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి తీసుకువచ్చిన ప్రజలకు వివరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చెన్నంశెట్టి శ్రీనివాసులు,బోయ రామ కృష్ణ, బుగ్గ రాముడు, మరాఠి సూరి, రవి కుమార్, జయ కృష్ణ, నాగారత్నమ్మ, సాయిరాం రాయల్, సుబ్బారాయుడు, క్లస్టర్ ఇంచార్జులు కామిని మల్లికార్జున,ఉప్పరి సురేష్ కుమార్, గోవిందా నాయుడు,సౌభాగ్యవతి, సురేష్, మహేష్,ప్రసాద్ రెడ్డి, ప్రసాద్,వేద సాయి తదితరులు పాల్గొన్నారు.

# ఆళ్లగడ్డ పట్టణాభివృద్ధికి 5కోట్లతో పలు అభివృద్ధి పనులు ప్రారంభించి పూర్తి చేశాము







## ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

**ఆళ్లగడ్డ ప్రతినిధి జూలై 28 నంది పత్రిక** కూటమి ప్రభుత్వం చేపట్టిన “రెండేళ్ల నమ్మకం అభివృద్ధి, సంక్షేమం“ కార్యక్రమంలో భాగంగా రెండో రోజు మంగళవారం నాడు ఆళ్లగడ్డ పట్టణంలో ఇంటింటి ప్రచార కార్యక్రమంలో ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మాట్లాడుతూ, గత రెండు సంవత్సరాల్లో ఆళ్లగడ్డ పట్టణ అభివృద్ధికి మాత్రమే సుమారు 5 కోట్లతో పలు అభివృద్ధి పనులను ప్రారంభించి పూర్తి చేశామని తెలిపారు. గత వైసీపీ పాలనలో ఒక రోడ్డు వేయాలన్నా, ఒక డ్రెయినేజీ నిర్మించాలన్నా సంవత్సరాల తరబడి ప్రజలు తిరగాల్సి వచ్చేదని, కానీ ప్రస్తుతం ప్రజల సమస్యలను తామే గుర్తించి, వెంటనే సంబంధిత మంత్రులు, అధికారులతో సమన్వయం చేసి రోడ్లు, డ్రెయిన్లు వంటి పనులను వేగంగా పూర్తి చేస్తున్నామని తెలిపారు. ప్రజల కోసం ఎంత అభివృద్ధి చేసినా వైసీపీ నాయకులు విమర్శలు చేయడం తప్ప ప్రజలకు ఉపయోగపడే ఒక్క సలహా కూడా ఇవ్వలేదని ఆమె విమర్శించారు. అభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అయితే వాటిని పట్టించుకోకుండా ప్రజా సేవనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులు, పరిశ్రమలు తీసుకురావడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని, ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులను ఆకర్షిస్తూ రాష్ట్ర యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారని అన్నారు. భోగాపురం విమానాశ్రయం వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు, విశాఖపట్నంలో గూగుల్ వంటి సంస్థల పెట్టుబడులు, రాయలసీమలో కొత్త పరిశ్రమల ఏర్పాటు రాష్ట్ర అభివృద్ధికి నిదర్శనమని ఆమె పేర్కొన్నారు. డీఎస్సీ అంశంపై వైసీపీ చేస్తున్న ఆరోపణలను ఖండిస్తూ, వాస్తవాలు లేకుండా రాజకీయ ప్రయోజనాల కోసం యువతను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ప్రజల సమస్యల పరిష్కారం కంటే రాజకీయ ఆరోపణలకే వారు ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ఆళ్లగడ్డలో జరిగిన అభివృద్ధి పనులను ప్రత్యేక కరపత్రాల ద్వారా ప్రతి ఇంటికీ చేరవేస్తున్నామని తెలిపారు. ప్రచారంలో ప్రజలు చెప్పిన సమస్యలను వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సాధ్యమైనంత వరకు అక్కడికక్కడే పరిష్కరిస్తున్నామని చెప్పారు. తెలుగుదేశం పార్టీ, కూటమి నాయకులు, కార్యకర్తలందరూ 45 రోజులపాటు జరిగే ఈ కార్యక్రమాన్ని అత్యంత బాధ్యతగా తీసుకుని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. ప్రజల విశ్వాసాన్ని మరింత బలపరచి రానున్న స్థానిక ఎన్నికల్లో కూటమిని విజయవంతం చేయాలని కార్యకర్తలకు ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి కిషోర్ మాజీ కౌన్సిలర్ హుస్సేన్ భాష వైకాపా నాయకులు చింతకుంట శేఖర్ రెడ్డి నాగాంజనేయులు శేఖర్ రెడ్డి శానిటర్ ఇన్స్పెక్టర్ బాలస్వామి ఇతర అధికారులు టిడిపి నాయకులు కార్యకర్తలు, భూమా అభిమానులు తదితరులు పాల్గొన్నారు



# ‘వన్ మంత్ - ఫోర్ విజిట్‘ లో స్వీకరించిన అర్జీలను నాణ్యతతో త్వరితగతిన పరిష్కరించండి

### ప్రజా అర్జీల పరిష్కారంలో జాప్యానికి తావులేదు

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**నంద్యాల బ్యూరో, జూలై 28(నంది పత్రిక):–** వన్ మంత్ – ఫోర్ విజిట్‘ లో స్వీకరించిన అర్జీల పరిష్కారంలో జాప్యానికి తావులేకుండా, ప్రతి ఫిర్యాదును నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి “వన్ మంత్ – ఫోర్ విజిట్“ కార్యక్రమంలో భాగంగా ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని అన్ని మండలాలు, శ్రీశైలం నియోజకవర్గ పరిధిలోని ఆత్మకూరు, మహానంది, వెలుగోడు మండలాల్లో స్వీకరించిన ప్రజా అర్జీల పరిష్కార పురోగతిపై జిల్లాధికారులు, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సమావేశంలో పీజీఆర్ఎస్ నోడల్ అధికారి ఉమామహేశ్వరి తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆళ్లగడ్డ నియోజకవర్గ పరిధిలో ఇప్పటివరకు మొత్తం 2,074 ప్రజా అర్జీలు స్వీకరించగా, వాటిలో 1,621 అర్జీలను పరిష్కరించారని, ఇంకా 453 అర్జీలు పరిష్కరించాల్సి ఉందని తెలిపారు. అదేవిధంగా, శ్రీశైలం నియోజకవర్గ పరిధిలోని ఆత్మకూరు, వెలుగోడు, మహానంది మండలాల్లో గత మూడు వారాలుగా నిర్వహించిన కార్యక్రమంలో మొత్తం 929 ప్రజా అర్జీలు అందాయని తెలిపారు. వాటిలో 417 అర్జీలను పరిష్కరించగా, 512 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. రెవెన్యూ, సర్వే సంబంధిత ప్రజా వినతులను తహసీల్దార్లు బాధ్యతాయుతంగా, నిబంధనలకు అనుగుణంగా సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా, ప్రతి వినతిపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి పారదర్శకంగా పరిష్కారం చూపాలని సూచించారు. ఇళ్ల స్థలాల కేటాయింపుకు సంబంధించి గత నెలలో జారీ అయిన ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు చర్యలు చేపట్టాలని తహసీల్దార్లను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్ల ఇళ్ల స్థలాలు కోరుతున్న దరఖాస్తుదారులు ప్రభుత్వం నుంచి తదుపరి మార్గదర్శకాలు వెలువడే వరకు వేచి ఉండాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. వెలుగోడు మండలంలో ఇళ్ల స్థలాలకు సంబంధించి 110 వినతులు అందినట్లు కలెక్టర్ తెలిపారు. పెన్షన్లకు సంబంధించిన దరఖాస్తులను అర్హత, అనర్హత ప్రమాణాలను ప్రజలకు స్పష్టంగా వివరించి అపోహలకు తావు లేకుండా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న అన్ని అర్జీలను శాఖల వారీగా, సమస్యల స్వభావాన్ని బట్టి సంబంధిత అధికారులు నాణ్యమైన పరిష్కారం అందించి పూర్తిస్థాయిలో క్లియర్ చేయాలని తహసీల్దార్లు, ఎంపీడీవోలు మరియు సంబంధిత జిల్లా అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీకి ప్రాధాన్యతనిస్తూ, సమస్యల పరిష్కారంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అర్జీదారులకు సంతృప్తికరమైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం: కలెక్టర్ జి. రాజకుమారి

### అక్టోబర్ 3న తుది ఓటరు జాబితా ప్రచురణ

### ఓటరు జాబితా సవరణలో పారదర్శకతకు ప్రాధాన్యం

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**నంద్యాల బ్యూరో, జూలై 28(నంది పత్రిక):–** జిల్లాలో జరుగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా, నిష్పక్షపాతంగా పూర్తి చేసి ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడమే ఎన్నికల సంఘం ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జి. రాజకుమారి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం, పోలింగ్ కేంద్రాల పునర్విభజన, ఓటర్ల డిజిటైజేషన్, క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ తదితర అంశాలపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి డి. రాము నాయక్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి అన్నపురెడ్డి ప్రదీప్, బహుజన్ సమాజ్ పార్టీ ప్రతినిధి కె. శ్రీనివాసులు, భారతీయ జనతా పార్టీ ప్రతినిధి కసెట్టి చంద్రశేఖర్, కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా ప్రతినిధి పి. నర్సింహులు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి సయ్యద్ రియాజ్ బాషా, తెలుగుదేశం పార్టీ ప్రతినిధి ఎ. నరేంద్ర కుమార్ రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి పి. శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తుది ఓటరు జాబితా ప్రచురణను సెప్టెంబర్ 22కు బదులుగా అక్టోబర్ 3న నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో పోలింగ్ కేంద్రాల సంఖ్య 1,629 నుంచి 1,763కు పెరిగిందని, 1,200 మందికి పైగా ఓటర్లు ఉన్న కేంద్రాలను ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం విభజించి, ఒకే కుటుంబ సభ్యులు వేర్వేరు కేంద్రాలకు వెళ్లకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల పునర్విభజనలో వచ్చిన మార్పులకు భారత ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం ఆమోదం లభించినట్లు పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 14,05,443 మంది ఓటర్లు ఉండగా, వారిలో 12,25,937 మంది వివరాలు విజయవంతంగా డిజిటైజ్ చేయబడ్డాయని, ఇది మొత్తం ఓటర్లలో 87.23 శాతమని కలెక్టర్ వివరించారు. మిగిలిన 1,79,506 మంది ఓటర్లలో శాశ్వతంగా వేరే ప్రాంతాలకు మారిన వారు, మరణించిన వారు, ద్వంద్వ ఓట్లు ఉన్న వారు, ఇంట్లో అందుబాటులో లేని వారు తదితర కారణాలతో గుర్తించిన వివరాలను క్షేత్రస్థాయిలో ధృవీకరించినట్లు తెలిపారు. ఈ నెల 31న డ్రాఫ్ట్ ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు జాబితాలు ప్రజల పరిశీలనకు అందుబాటులో ఉంచుతామని, మరణించిన వారి పేర్ల తొలగింపును మరణ ధృవపత్రాలు, బీఎల్‌ఓల ధృవీకరణ ఆధారంగా మాత్రమే చేపడుతున్నామని చెప్పారు. గైర్హాజరైన వారు లేదా వేరే ప్రాంతాలకు వెళ్లిన వారిలో అర్హులైన నిజమైన ఓటర్లు ఎవరైనా ఉంటే అక్టోబర్ 3న తుది జాబితా ప్రచురణకు ముందే తమ పేర్లను తిరిగి నమోదు చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణకు ఎన్నికల సంఘం నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం అవకాశం కల్పించబడిందని, అందిన దరఖాస్తులన్నింటినీ నిబంధనల మేరకు పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. ఓటర్లు కార్యాలయాలకు వ్యక్తిగతంగా రావాల్సిన అవసరం లేకుండా ఆన్‌లైన్ ద్వారానూ ఫారమ్–6, 7, 8 తదితర దరఖాస్తులు సమర్పించవచ్చన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 4,099 ఆన్‌లైన్ దరఖాస్తులు అందినట్లు తెలిపారు. కొత్తగా 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారు, ఇతర ప్రాంతాల నుంచి నివాసం మార్చుకున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ దాదాపు పూర్తయిందని, కేవలం 6,066 మంది ఓటర్లు మాత్రమే మ్యాపింగ్‌కు మిగిలి ఉన్నారని, ఇది మొత్తం ఓటర్లలో కేవలం 0.43 శాతం మాత్రమేనని కలెక్టర్ వెల్లడించారు. ఓటర్ల మ్యాపింగ్‌లో వ్యత్యాసాలు ఉన్నవారికి, వివరాలు పూర్తి కానివారికి నోటీసులు జారీ చేస్తున్నామని తెలిపారు. కుటుంబ సభ్యుల మధ్య వయస్సు వ్యత్యాసాలు, జనన తేదీలలో తేడాలు వంటి అంశాలను సరిచేయడానికే ఈ ప్రక్రియ అని, నోటీసు అందిందని మాత్రమే ఓటు తొలగించబడుతుందనే అపోహలకు తావులేదని కలెక్టర్ స్పష్టం చేశారు. నంద్యాల అర్బన్‌లో అత్యధికంగా 46,741 వ్యత్యాసాలు నమోదయ్యాయని, అనంతరం డోన్, శ్రీశైలం, ఆళ్లగడ్డ నియోజకవర్గాలు ఉన్నాయని వివరించారు. ప్రతి కేసులోనూ నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేసి, సంబంధిత వ్యక్తుల వివరణలు స్వీకరించిన అనంతరమే నిర్ణయం తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. మరణం, శాశ్వతంగా వేరే ప్రాంతానికి మారడం, ద్వంద్వ ఓట్లు వంటి అంశాలపై పూర్తి విచారణ అనంతరం పక్కా ఆధారాలతోనే స్పీకింగ్ ఆర్డర్ జారీ చేసి తుది నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా ఓటరు జాబితా పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించే ప్రక్రియలో సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.



# భూ సమస్యల పరిష్కారంలో రెవెన్యూ క్లినిక్స్ సమర్థవంతమైన వేదిక

### 27 విడతల్లో 401 దరఖాస్తులకు పరిష్కారం

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం బ్యూరో చీఫ్ జూ లై 28 నంది పత్రిక** రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారానికి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ క్లినిక్స్ ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందిస్తూ ఉత్తమ ఫలితాలను ఇస్తున్నాయని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. భూ సంబంధిత సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే పీజీఆర్ఎస్ తో పాటు భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా రెవెన్యూ క్లినిక్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్లినిక్స్ ద్వారా ప్రజల భూ సంబంధిత సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా త్వరితగతిన పరిష్కరించే చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. 2025 డిసెంబర్ 29న ప్రారంభమైన రెవెన్యూ క్లినిక్స్ ద్వారా 2026 జూలై 27 నాటికి మొత్తం 27 విడతలు నిర్వహించామని తెలిపారు. ఈ కాలంలో జిల్లావ్యాప్తంగా 1016 దరఖాస్తులు అందగా, వాటిలో 401 దరఖాస్తులను పరిష్కరించడం జరిగిందన్నారు. నిబంధనలకు అనుగుణంగా 230 దరఖాస్తులను తిరస్కరించగా, ప్రస్తుతం 385 దరఖాస్తులు వివిధ దశల్లో పరిష్కార ప్రక్రియలో ఉన్నాయని వెల్లడించారు. డివిజన్‌ల వారీగా వివరాలను వెల్లడిస్తూ, భీమవరం డివిజన్ పరిధిలోని ఏడు మండలాల నుంచి 451 దరఖాస్తులు అందాయని, వాటిలో 172 దరఖాస్తులను పరిష్కరించగా, 96 దరఖాస్తులను తిరస్కరించామని, 183 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. నరసాపురం డివిజన్ పరిధిలోని ఎనిమిది మండలాల నుంచి 359 దరఖాస్తులు అందగా, 154 దరఖాస్తులను పరిష్కరించామని, 84 దరఖాస్తులను తిరస్కరించామని, 121 దరఖాస్తులు పరిష్కార దశలో ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే తాడేపల్లిగూడెం డివిజన్ పరిధిలోని ఐదు మండలాల నుంచి 206 దరఖాస్తులు అందగా, 75 దరఖాస్తులను పరిష్కరించామని, 50 దరఖాస్తులను తిరస్కరించామని, మిగిలిన 81 దరఖాస్తులపై విచారణ కొనసాగుతోందని తెలిపారు. భూ సమస్యలకు సంబంధించి అందిన ప్రతి ఫిర్యాదును సమగ్రంగా పరిశీలించి, భవిష్యత్తులో ఎటువంటి వివాదాలు తలెత్తకుండా శాశ్వత పరిష్కారం అందించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజలకు సత్వర, పారదర్శక సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. రెవెన్యూ క్లినిక్స్ ద్వారా భూ సమస్యల పరిష్కారం వేగవంతమవుతోందని, భూ హక్కులకు సంబంధించిన సమస్యలు ఉన్న ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు.




# ఉద్యానవన పంటలకు ప్రోత్సాహం. . ఎంపీ పుట్టా మహేష్ కుమార్.

### తక్కువ నీటితో ఎక్కువ సాగు చేసే పంటలపై దృష్టి పెట్టాలన్న ఎంపీ



**ఢిల్లీ బ్యూరో చీఫ్, జూలై 28 నంది పత్రిక** వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో చిన్న, సన్నకారు రైతులు రక్షిత సాగు, సూక్ష్మ నీటిపారుదల, మల్చింగ్ మరియు ఇతర ఉద్యానవన సాంకేతికతలను అవలంబించడాన్ని ప్రభుత్వం ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్. పార్లమెంటు వర్షాకాల సమావేశాల సందర్భంగా ఉద్యానవన పంటలకు కేంద్రం అందిస్తున్న ప్రోత్సాహాలపై లోక్‌సభలో ప్రశ్నించారు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్. ఏలూరు ఎంపీ అడిగిన ప్రశ్నకు కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్ సమాధానం ఇస్తూడ “సమగ్ర ఉద్యానవన అభివృద్ధి మిషన్ ( మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ ఆఫ్ హార్టికల్చర్- ఎంఐడిహెచ్)“ మరియు ఇతర ఉద్యానవన అభివృద్ధి పథకాల కింద కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం, సబ్సిడీలను అందిస్తున్నట్లు వివరించారు. ఎం ఐ డి హెచ్ కింద, రక్షిత సాగు సాంకేతికతలను అవలంబించడంలో రైతులకు సహాయపడటానికి సంస్థాగత, సాంకేతిక మరియు విస్తరణ మద్దతు అందించబడుతుంది. ఈ మద్దతు రాష్ట్ర ఉద్యానవన మిషన్లు, సాంకేతిక సహాయక బృందాలు (టి ఎస్ జి లు ), ప్రెసిషన్ ఫార్మింగ్ డెవలప్‌మెంట్ సెంటర్లు పి( ఎఫ్ డి సి లు ), సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ సి ఓ ఈ లు), ఐ కార్ సంస్థలు, రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాలు ( ఎస్ ఏ యు లు), కృషి విజ్ఞాన్ కేంద్రాలు( కె వి కె లు ) మరియు ఇతర గుర్తింపు పొందిన సంస్థల ద్వారా అందించబడుతుందని కేంద్ర మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్ తెలిపారు. స్వచ్ఛ మొక్కల కార్యక్రమం, ఉద్యానవన క్లస్టర్ అభివృద్ధి వంటి కార్యక్రమాల అమలు ద్వారా జాతీయ ఉద్యానవన మండలి( ఎన్ హెచ్ బి) నుంచి సంస్థాగత మరియు సాంకేతిక మద్దతును కూడా అందిస్తున్నట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు. ఇండో-ఇజ్రాయెల్, ఇండో-డచ్ సహకారం, పరిశోధనా సంస్థల ద్వారా ఎం ఐ డి హెచ్ కింద 61 పంటల వారీ “క్రాప్ స్పెసిఫిక్ సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్“ స్థాపించినట్లు చెప్పిన కేంద్ర మంత్రి రైతులు, క్షేత్రస్థాయి కార్యకర్తల కోసం శిక్షణ సహాయం కూడా ఇస్తున్నట్లు తెలిపారు. ఇంకా, పాలీ హౌస్, షేడ్ నెట్ హౌస్, ప్లాస్టిక్/నాన్-వోవెన్ క్లాత్ టన్నెల్స్, వాక్ ఇన్ టన్నెల్స్ మొదలైన రక్షిత సాగు నిర్మాణాల కోసం ఎం ఐ డి హెచ్ కింద ఆర్థిక మరియు సాంకేతిక సహాయం అందిస్తున్నట్లు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కు కేంద్ర మంత్రి వివరించారు. దీనిపై ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఒక ప్రకటన విడుదల చేస్తూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న రాయితీలను ఉపయోగించుకుని బిందు సేద్యం, స్ప్రింకర్లు, పాలీ హౌస్, షేడ్ నెట్ హౌస్ వంటి వాటిపై దృష్టి పెడితే నీటి పొదుపుతోపాటు, పంటల ఉత్పాదకత పెరుగుతుందని, కాబట్టి రైతులు సాంప్రదాయ పంటల సాగుతోపాటు ఉద్యానవన పంటల సాగుకు కూడా ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా వర్షాభావ పరిస్థితుల నుంచి గట్టెక్కేందుకు ప్రయత్నించాలని కోరారు



# కూటమి పాలనలో వికాసం, గొడ్డలి పార్టీ పాలనలో విధ్వంసం...



**అభివృద్ధి, సంక్షేమం రెండిటితోనూ ముందడుగు...**

**కొత్తపేట మండలం అవిడి, కండ్రిగ గ్రామాల్లో జరిగిన**

**ఇంటింటికీ కూటమి ప్రభుత్వం ఎమ్మెల్యే బండారు...**

**కొత్తపేట బ్యూరో చీఫ్ జూలై 28 నంది పత్రిక** కూటమి పాలనలో అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో ప్రజలకు అందుతుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాల పాలన పూర్తయిన సందర్భంగా మంగళవారం కొత్తపేట మండలం ఆవిడి,కండ్రిగ గ్రామాల్లో ఏపీ బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి,మార్కెట్ యార్డ్ చైర్మన్ పల్లి మంగాదేవి భీమరావు,కూటమి నాయకులతో కల్సి ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రజలందరినీ కలుసుకొని, గత రెండేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు.ఎన్డీఏ కూటమి పాలనలో ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ త్రయం రాష్ట్ర అభివృద్ధి కోసం విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రానికి పెట్టుబడుల రూపంలో అనేక కంపెనీలు వస్తున్నాయని, రాజధాని నిర్మాణం వేగంగా జరుగుతుందని, పోలవరం వచ్చే ఏడాది పూర్తవుతుందన్నారు. గొడ్డలి పార్టీ పాలనలో రాష్ట్రానికి రాజధాని లేకుండా, గుంతల రహదారులతో విధ్వంస పాలన ప్రజలు చూశారన్నారు.రైతులకు తమ భూములపై హక్కులు లేకుండా చేసే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ వంటి దుర్మార్గపు చట్టాలతో ప్రజల్ని ఇబ్బంది పెట్టారని గుర్తు చేశారు. రాష్ట్రంలో, నియోజకవర్గంలో అరాచకాలతో ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేశారని నాటి రోజుల్లో జరిగిన పాలనను గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రజలతో మాట్లాడినప్పుడు వారు కూటమి పాలన పట్ల సంతృప్తి, సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. గత రెండేళ్లలో అమలైన సంక్షేమం, గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనుల గురించి ప్రజలే వివరిస్తున్నారని తెలిపారు. ఇప్పటికీ గొడ్డలి పార్టీ వైసిపి నాయకులు మరల అధికారంలోకి వస్తే రప్పా రప్పా రాజ్యాంగం అమలు చేస్తామంటున్నారు తప్ప, ప్రజలకు మేలు చేస్తామని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని





అనడం లేదన్నారు. ప్రజల విశ్వాసాన్ని కోల్పోయి ప్రజల్ని భయభ్రాంతులను చేస్తున్న గొడ్డలి పార్టీ వైసిపి ఇక ఎన్నటికీ అధికారంలోకి వచ్చే అవకాశం లేదన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో గ్రామ గ్రామాన జరుగుతున్న అభివృద్ధి, ఇంటింటికి అందుతున్న సంక్షేమం ప్రజల కళ్ళల్లో సంతోషాన్ని కనబరుస్తుందన్నారు. పింఛన్ల పెంపు, తల్లికి వందనం పథకంలో భాగంగా ఇంట్లో ఉన్న చదువుకునే ప్రతీ బిడ్డకు రూ.13 వేలు చొప్పున తల్లుల ఖాతాలో జమ చేయడం జరిగిందన్నారు. అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు అందించడం జరిగిందన్నారు. కొత్తపేట నియోజకవర్గంలో గ్రామ గ్రామాన అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలియజేశారు.

## రాష్ట్ర బిసి శాఖ మంత్రి సవితను మర్యాదపూర్వకంగా కలిసిన ఏఐబిడబ్ల్యూఏ అధ్యక్షులు డాక్టర్ ఆంజనేయులు





**అనంతపురం బ్యూరో చీఫ్ జూలై 28 నంది పత్రిక** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ సంక్షేమం చేనేత శాఖ మంత్రి సవిత ను మంగళవారం నాడు పెనుగొండ మంత్రి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన అఖిలభారత బహుజనుల సంక్షేమ సంఘం( ఏఐబిడబ్ల్యూఏ ) అధ్యక్షులు డాక్టర్ ఎం ఆంజనేయులు ఈ సందర్భంగా అఖిలభారత బహుజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పనిచేస్తున్న నాయకులకు అందరికీ ఇంటి పట్టాలు మంజూరు చేయాలని సంక్షేమ పథకాలు అందరివారికి అందేలా చూడాలని బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేయాలని కోరుతూ మంత్రికి వినతి పత్రం అందజేశారు. మంత్రి సవిత, సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మనవల ఆంజనేయులు శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు రామంజప్ప జిల్లా అధికార ప్రతినిధి దాసరికాంతమ్మ లేపాక్షి మండల అధ్యక్షురాలు నాగమణి పరిగి మండల అధ్యక్షుడు వ్యక్తి రవికుమార్ హిందూపూర్ మండల అధ్యక్షురాలు నాగమ్మ ప్రధాన కార్యదర్శి గంగరత్నమ్మ మండల లీడర్లు సునీత వెంకమ్మ శివమ్మ అంజనప్ప కొత్తచెరువు అంజినప్ప రాము మండల అధ్యక్షుడు రెడ్డిపల్లి మారెప్ప రామగిరి మండల ఉపాధ్యక్షుడు తిమ్మాపురం గంగాధర తదితరులు పాల్గొన్నారు.

# రాబోయే రెండు నెలల్లో రీ-సర్వే ప్రక్రియను నాణ్యత ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం బ్యూరో చీఫ్: జూలై 28, నంది పత్రిక.** జిల్లాలో భూ రీ-సర్వే ప్రక్రియను నిర్దేశిత గడువులోపు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు.

భీమవరం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి మంగళవారం జాయింట్ కలెక్టర్ కె.ఆర్.కల్పశ్రీతో కలిసి రీ-సర్వే, పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ, ఐవీఆర్ఎస్ అంశాలపై రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దారులు, సర్వే అధికారులు, మండల సర్వేయర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో రీ-సర్వే పనులపై ప్రత్యేక దృష్టి సారించి వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. రీ-సర్వే ప్రక్రియ పూర్తయిన అనంతరం సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెలల్లో రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీని సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రీ-సర్వే జరుగుతున్న గ్రామాల్లో పనుల పురోగతిని మండలాల వారీగా నిరంతరం సమీక్షిస్తూ,





వెనుకబడిన ప్రాంతాల్లో ప్రత్యేక కార్యాచరణ చేపట్టి మెరుగైన ఫలితాలు సాధించాలని అధికారులకు సూచించారు. భూ రికార్డుల ఆధునికీకరణలో రీ-సర్వే కీలకమని, ప్రతి దశలో ఖచ్చితత్వం, పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న 22-ఏ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తహసీల్దారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రైతులు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా సమస్యలను త్వరితగతిన పరిష్కరించి, చట్టపరమైన ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఆర్ఓఆర్, మ్యుటేషన్, ఎఫ్-లైన్ అంశాలకు సంబంధించి ఐవీఆర్ఎస్ కాల్స్ సందర్భంగా కొన్నిచోట్ల రైతుల నుంచి ప్రతికూల స్పందన వచ్చిన విషయాన్ని ప్రస్తావిస్తూ, ఆ ఫిర్యాదులపై లోతుగా పరిశీలన చేసి, సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతుల నుంచి ఎలాంటి వ్యతిరేక స్పందన రాకుండా సేవల నాణ్యతను మెరుగుపరచాలని సూచించారు. అదేవిధంగా పీజీఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావులేకుండా తహసీల్దారులు, ఆర్డీవోలు క్షేత్రస్థాయిలో పర్యటించి, ఫిర్యాదుదారులను నేరుగా కలుసుకుని నిర్ణీత గడువులో కేసులను పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలు అందించడంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పి.ప్రభాకర్, రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దారులు, సర్వే అధికారులు, మండల సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.



# జిల్లాలో రహదారి ప్రమాదాలు నివారించాలి

**ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్స్ పై ప్రత్యేక దృష్టి**

**కేంద్రీకరించి చర్యలు తీసుకోవాలి**

**రహదారి ప్రమాదాలలో ఏ ఒక్కరూ ప్రాణాలు కోల్పోకూడదు**

**హెల్మెట్, సీట్ బెల్ట్ ధారణ ఆవశ్యకత రహదారి భద్రతా**

**నియమాలపై విస్తృత అవగాహన కలిగించాలి**

**జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశంలో జిల్లా ఎస్పీ కె.**

**ప్రతాప్ శివకిశోర్ తో కలిసి రహదారి ప్రమాదాల నివారణపై**

**సమీక్షించిన జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి**





**ఏలూరు, బ్యూరో చీఫ్ జూలై , 28 నంది పత్రిక** జిల్లాలో అధికంగా ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్స్ ను గుర్తించి ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ లో మంగళవారం జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధ్యక్షతన జరిగింది. జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివకిశోర్ తో కలిసి ప్రమాదాల నివారణపై తీసుకోవలసిన చర్యలపై జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో గత సంవత్సరం 304 రోడ్డు ప్రమాదాలలో 149 మంది మరణించారని, అంతకుముందు సంవత్సరంతో పోలిస్తే ప్రమాదాలు, మరణాలు తక్కువ అయినప్పటికీ, ఇది ఆందోళన కలిగించే విషయమన్నారు. అతివేగం, నియమాలు పాటించని కారణంగా ప్రమాదాలు సంభవిస్తున్నాయని, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించని కారణంగా మరణాలు సంభవిస్తున్నాయన్నారు.

# హైదరాబాద్‌లో ఫేక్ కాల్ సెంటర్ స్కామ్

**కోట్ల రూపాయాల సైబర్ మోసం - కీలక నిందితుడిని అరెస్ట్ చేసిన ఇడి**

హైదరాబాద్ కేంద్రంగా నడిచిన అంతర్జాతీయ ఫేక్ కాల్ సెంటర్ స్కామ్‌లో కీలక నిందితుడిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు అరెస్ట్ చేశారు. ప్రధాన సూత్రధారి వికాస్ కుమార్ నిమార్ అలియాస్ మిస్టీ.. అమెరికా పౌరులను లక్ష్యంగా చేసుకుని కోట్ల రూపాయల సైబర్ మోసానికి పాల్పడ్డాడు. దీంతో వికాస్‌ను ఈడీ అధికారులు అదుపులోకి తీసుకుని వైద్య పరీక్షల నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఫేక్ కాల్ సెంటర్‌కు సంబంధించి మాదాపూర్ పోలీసులు నమోదు చేసిన కేసు ఆధారంగా మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఈడీ అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఇంటర్‌పోల్ ద్వారా అమెరికా ఎంబసీ అందించిన సమాచారంతో సీబీఐ గతంలోనే కేసు నమోదు చేసింది. 2023లో ఈసీఐఆర్ నమోదు చేసి మనీలాండరింగ్ కోణంలో ఈడీ అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. హైదరాబాద్, విశాఖపట్నం, లఖ్‌నవూతో పాటు పలు నగరాల్లో నకిలీ కాల్ సెంటర్లను వికాస్ నిర్వహించాడు. ఈ ముఠా.. టెక్నికల్ సపోర్ట్ పేరుతో విదేశీయులను నమ్మించి భారీ మొత్తంలో డబ్బు కాజేసింది. ప్రభుత్వ సంస్థలు, ప్రముఖ ప్రైవేట్ కంపెనీల అధికారులమంటూ బాధితులకు ఫోన్ కాల్స్ చేసి నిందితుడు బెదిరింపులకు పాల్పడినట్లు విచారణలో బయటపడింది. వికాస్.. కంప్యూటర్ వైరస్‌లు, బ్యాంక్ ఖాతా సమస్యలు, సెక్యూరిటీ అలర్ట్‌ల పేరుతో అమెరికన్లను భయపెట్టి డబ్బు వసూలు చేశాడని.. గిఫ్ట్ కార్డులు, డిజిటల్ పేమెంట్ల రూపంలోనూ బాధితుల నుంచి నగదు సేకరించినట్లు దర్యాప్తులో తేలింది.

సేకరించిన డబ్బును క్రిఎ÷-టోకరెన్సీగా మార్చి ఆధారాలు లేకుండా ప్రయత్నించినట్లు ఈడీ అధికారులు గుర్తించారు. క్రిఎ÷-టో ఆస్తులను ఎక్స్ఛేంజ్‌లు, హవాలా తరహా నగదు సెటిల్‌మెంట్ నెట్‌వర్క్‌లు, బ్యాంకింగ్ మార్గాల ద్వారా భారత కరెన్సీగా మార్చినట్లు విచారణలో బయటపడింది. వీసీ సొల్యూషన్స్ పేరుతో కంపెనీ ఏర్పాటు చేసి మోసపూరిత డబ్బును చట్టబద్ధ ఆదాయంగా చూపించే ప్రయత్నం చేసినట్లు అధికారులు తెలిపారు. వీసీ సొల్యూషన్స్ బ్యాంక్ ఖాతాల్లో భారీ నగదు డిపాజిట్లు, అనుమానాస్పద క్రెడిట్ లావాదేవీలను గుర్తించారు. ÷ాల్ సెంటర్ ద్వారానే ఆదాయం వచ్చినట్లు విచారణలో నిమార్ అంగీకరించినట్లు ఈడీ అధికారులు వెల్లడించారు. అయితే ఈ డబ్బును ఆదాయపు పన్ను రిటర్న్‌లో కిరాణా వ్యాపారం, ఇతర వ్యాపారాల ఆదాయంగా వికాస్ చూపించాడని తెలిపారు. 2023లో ఈసీఐఆర్ నమోదు చేసి మనీలాండరింగ్ కోణంలో ఈడీ అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసులో మరికొందరి పాత్ర, నిధుల ప్రవాహం, క్రిఫ్టో లావాదేవీలపై దర్యాప్తు కొనసాగుతోంది.

# తుది దశకు చేరుకుంటున్న సర్ డిజిటలైజేషన్ ప్రక్రియలో ఆలస్యం

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం గడువు సమీపిస్తుండగా ఇంకా స్పందించాల్సిన ఓటర్లు కూడా పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. మిగిలిపోయిన వారి అడ్రస్‌లను తెలుసుకోవడానికి అధికారులు ప్రయత్నం చేస్తున్నారు. అధికారులు, సిబ్బందితో సహా అందరూ ఎన్యుమరేషన్ పత్రాల స్వీకరణపై దృష్టి కేంద్రీకరించారు. గతంతో పోలిస్తే కొంత పరిస్థితి మెరుగ్గా కనిపిస్తున్నప్పటికీ.. ఇంకా ఎన్యుమరేషన్ పత్రాలు ఇవ్వాల్సిన వారు అధికంగానే ఉండటం గమనర్హం.వాటి అందజేతకు కొందరు నిరాకరిస్తుండగా.. మరికొందరు అందుబాటులో లేకపోవడంతో డిజిటలైజేషన్ ఆశించిన స్థాయిలో ముందుకు కదలడం లేదు. ఇంటి అడ్రసులు మారిన వారు కూడా అధిక సంఖ్యలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరికి సమాచారం అందించి ఎన్యుమరేషన్ పత్రం అందజేసేలా చర్యలు తీసుకుంటున్నారు. సర్ పక్రియ ఆగస్టు 3వ తేదీన ముగుస్తుంది. కేవలం వారం రోజులు మాత్రమే మిగిలి ఉంది. ఇంత తక్కువ వ్యవధిలో లక్షకు పైగా ఓటర్ల ఎన్యుమరేషన్ పత్రాలు తీసుకొని డిజిటలైజేషన్ చేయడం కష్టసాధ్యమనే చెప్పాలి. అందిన ఎన్యుమరేషన్ పత్రాలను యాప్‌లో అప్‌లోడ్ చేసేందుకు ప్రత్యేక కేంద్రాల్లో ముమ్మరంగా కసరత్తు కొనసాగుతుంది. ఆయా ప్రాంతాల్లో నివసిస్తున్న ఏపీకి చెందిన వారు ఎన్యుమరేషన్ పత్రాలను తిరిగి ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారు. తమ స్వస్థలాల్లో ఓటు హక్కు ఉండేలా అక్కడే పత్రాలను ఇస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇటువంటి వారి నుంచి ఆయా ప్రాంతాల్లో ఓటరు నంబర్ తీసుకొని ఆ సమాచారాన్ని యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. సర్‌లో భాగంగా వీరందరికి ఎన్యుమరేషన్ పత్రాలను జూన్ 25 వ తేదీన ప్రారంభించారు. ఈ క్రమంలో సర్ పక్రియ చివరి దశకు చేరుకుంది.

# స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

అంతర్జాతీయ, భౌగోళిక, రాజకీయ కారణాల నేపథ్యంలో బంగారం ధరలు తగ్గుముఖం పట్టాయి. మంగళవారం పసిడి ధరలు భారీ తగ్గుదల నమోదు చేశాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, మంగళవారం ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,44,170గా ఉంది. నిన్నటితో పోల్చుకుంటే పది గ్రాములకు రూ.1690 మేర తగ్గింది.. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,32,150గా ఉంది. నిన్నటితో పోల్చుకుంటే పది గ్రాములకు రూ.1550 మేర తగ్గింది. మరోవైపు వెండి ధరలు కూడా తగ్గుదలను నమోదు

చేశాయి. కిలోకు ఐదు వేల రూపాయల మేర తగ్గాయి. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడల్లో కిలో వెండి ధర రూ.2,35,000గా ఉంది.

# దమ్ముంటే లోకేశ్ సవాల్ స్వీకరించండి

## వైసిపికి మంత్రి మండిపల్లి సవాల్

వైసీపీ నేతలకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సవాల్ విసిరారు. డీఎస్సీపై మంత్రి నారా లోకేశ్ విసిరిన సవాల్‌ను వైసీపీ నేతలకు దమ్ము, ధైర్యం ఉంటే స్వీకరించాలన్నారు. డీఎస్సీపై బహిరంగ చర్చకు రావాలని జగన్, వైసీపీకి ఛాలెంజ్ చేశారు. జగన్, ఆయన టీంకు బుద్ధి లేదని.. ప్రజలకు మంచి చేస్తున్నా కూడా విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. లోకేశ్ విద్యాశాఖ మంత్రి అయ్యాకే.. విద్యారంగంలో సంచలనాత్మక నిర్ణయాలు తీసుకున్నారని.. పెనుమార్పులు వచ్చాయని చెప్పుకొచ్చారు. లోకేశ్‌ను వైసీపీ నేతలు రాజీనామా చేయమనడం విడ్డూరంగా ఉందని మంత్రి అన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే 16 వేలకు పైగా టీచర్ ఉద్యోగాలు ఇచ్చామన్నారు. డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు పొందిన కుటుంబాలను వైసీపీ నేతలు అవమానిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి హయాంలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో ఉద్యోగావకాశాలు మెండుగా వస్తున్నాయన్నారు. ఏపీ బ్రాండ్‌ను చెడగొట్టేందుకు వైసీపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఇదే పద్ధతిలో వైసీపీ వెళ్తే.. వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీకి 11 సీట్లు కూడా రావని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వ్యాఖ్యానించారు.

# సమస్యల పరిష్కారం కోసం పోరుబాట జంతర్ మంతర్ వద్ద జర్నలిస్టుల ఆందోళన

జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ జర్నలిస్టులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ అధ్వర్యంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన జర్నలిస్టులు ఢిల్లీ జంతర్ మంతర్‌లో ధర్నా నిర్వహించారు. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ ధర్నాలో మాట్లాడారు. జర్నలిస్టుల రైల్వే రాయితీ పాస్‌లను పునరుద్ధరించాలని, పదవీ విరమణ చేసిన జర్నలిస్టులకు జాతీయ పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో కేంద్రం తగుచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# అభిజీత్ దీప్కేకు క్యూ కట్టిన పెళ్లి సంబంధాలు!

నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై విద్యార్థుల పక్షాన నిలిచి, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామాకు దారితీసిన పరిస్థితుల్లో కీలక పాత్ర పోషించిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే కుటుంబ సభ్యులు ఇటీవల మీడియాతో పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఒకవైపు తమ 30 ఏళ్ల కుమారుడికి పెళ్లి సంబంధాలు వెల్లువెత్తుతుండగా, మరోవైపు నిరసనల సమయంలో తాము తీవ్రమైన బెదిరింపులను ఎదుర్కొన్నామని వారు గుర్తుచేసుకున్నారు.

# గిరిజన సంక్షేమానికి ఎలాంటి డోకా రానివ్వం

**గిరిజన చట్టాల అమలుకు తొలి ప్రాధాన్యం**

**గిరిజనం అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట**

**రాష్ట్ర గిరిజనశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి**

**హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత - జిల్లా కలెక్టర్లు**

**రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి**





**పాడేరు బ్యూరో చీఫ్ జూలై 28 నంది పత్రిక** గిరిజన సంక్షేమాభివృద్ధిలో కూటమి ప్రభుత్వం ఎప్పుడూ పెద్దమనసుతోనే వ్యవహరిస్తుందని రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. పాడేరు కలెక్టర్ కార్యాలయంలో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అధ్యక్షతన గిరిజన చట్టాల పరిరక్షణ విషయమై అంతర్ జిల్లా సమన్వయ కమిటి సమావేశం మంగళవారం నిర్వహించారు.రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత సౌజన్యంలో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం గిరిజన సంక్షేమానికి అమలు చేస్తున్న విషయాలపై క్షుణ్ణంగా వివరించారు. ఆదివాసీ చట్టాలకు ఎలాంటి విఘాతం రాకుండా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. గిరిజన ప్రాంతాల్లో నూరు శాతం ఉద్యోగాలు కల్పన కోసం మొట్టమొదట కృషి చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపిన పార్టీ తెలుగుదేశం అన్నారు. వక్తలు మాట్లాడుతూ ప్రస్తుతం జీవో నం 3 సర్వోన్నత న్యాయస్థానంలో రద్దుకు గల కారణాలపై వివరించారు. దాని పునరుద్ధరణకు న్యాయపరంగా కూడా ఎలాంటి చిక్కులు లేకుండా ముందుకు సాగేలా కసరత్తు ప్రాముఖ్యమన్నారు.దీనిపై పలు ఆదివాసీ సంఘాల ప్రతినిధులతో మాట్లాడి వారి యొక్క సూచనలు, సలహాలు తీసుకున్నారు. కూటమి ప్రభుత్వం ఎప్పుడూ గిరిజన పక్షపాతి అనే విషయాన్ని ఆదివాసీ సమాజం గుర్తుంచుకోవాలని సూచించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా, పార్వతీపురం మన్యం, పోలవరం జిల్లా కలెక్టర్లు సమక్షంలో ఈ సమావేశం నిర్వహించారు. యావత్తు గిరిజనప్రాంత ప్రయోజనాలు సంరక్షించే విధానంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జానపద కళలు మరియు సృజనాత్మక అకాడమీ చైర్మన్ వంపూరి గంగులయ్య, గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ కుమార్, పాడేరు నియోజకవర్గ ఇంచార్జ్ గిడ్డి ఈశ్వరి, తెదేపా అరకు పార్లమెంట్ అధ్యక్షురాలు మోజోరు తేజోవతి, సివెరి అబ్రహం, కలెక్టర్ దినేష్ కుమార్, టి.నిశాంతి, ఆదివాసీ సంఘాల ప్రతినిధులు మొట్టడం రామారావు, రామారావు, పలువురు ఆదివాసీ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com